నవంబర్
2018

151

సంపుటి : 13 సంచిక : 7 వెల రు. 10/-

## ఈ సంచికలో........

కేరళపై ఎందుకీ దాడులు?
తీవ్రమవుతున్న పెట్టుబడిదారీ సంక్షోభం
సామాజిక న్యాయానికి మరో విఘాతం
వ్యవసాయ సంస్కరణలతోనే సంక్షోభ పరిష్కారం
శబరిమలపై కాంగ్రెస్, బిజెపి అవకాశవాదం
ఔషధ పరిశ్రమ దోపిడి
జీవన సౌలభ్యం - వాస్తవాలకు దూరం
లౌకికవాదులు, లౌకిక శక్తులు చేయవలసిందేమిటి?
కమ్యూనిస్టు వ్యతిరేకతకు బలైన రోజన్‌బర్గులు
ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఖమ్మం సభ

స్ఫూర్తి

# ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఖమ్మం సభ

- కొల్లు రాఘవయ్య

**1922**లో మాడపాటి హనుమంతరావు కార్యదర్శిగా ఆంధ్ర జన సంఘం స్థాపించారు. 1. హరిజన సేవ 2. అస్పృశ్య నివారణ 3. సరభరాయి (ఉద్యోగస్తులకు, వ్యాపారులు సరుకులు ఉచితంగా ఇవ్వాలి. 4. వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిచాయి. 1930 సంవత్సరంలో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1. సాంఘిక సమస్యలు 2. బాల్య వివాహాలు 3. వితంతు వివాహాలు 4. అంటరానితనం 5 గ్రంథాలయ ఉద్యమం తదితర సమస్యలను తీసుకొని పనిచేసింది. 1934లో ఖమ్మంలో జరిగిన 3వ ఆంధ్ర మహాసభలో మాడపాటి హనుమంతరావు పాల్గొన్నారు. కొందరు ఛాందస వకీళ్ళు, మహాసభ జరగకుండా అడ్డుతగిలారు. ఖమ్మంలో అభ్యుదయ భావాలు గల యువకులు చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, సర్వదేవభట్ల రామనాథం, పెరవల్లి వెంకటరమణయ్య, పెండ్యాల సత్యనారాయణ మొదలగువారు సభ జరగటానికి తోడ్పడ్డారు. ఈ మహాసభలో 1. సంఘ సంస్కరణలు 2. విద్యా వ్యాప్తి 3. పౌర హక్కులు 4. అంటరానితనం 5. సహపంక్తి భోజనాలు 6. గ్రంథాలయ ఉద్యమం 7. హరిజనోద్ధరణ మొదలైన తీర్మానాలు ఆమోదించబడ్డాయి. ఖమ్మంలో కూడా ఆంధ్ర మహాసభ శాఖ ఏర్పడింది. ఇక్కడి యువకులపై కొందరికి, కాంగ్రెస్‌పైన, మరికొందరికి కమ్యూనిస్టు పార్టీపై అభిమానం ఉన్నది. 1938లో చిర్రావూరి లక్ష్మీనర్సయ్య మరో 9 మందితో కలిసి, త్రిపుర కాంగ్రెస్ మహాసభలకు వెళ్ళారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో పరిచయం ఏర్పడింది. ఈ కాలంలోనే చంద్ర రాజేశ్వర రావు, నండూరి ప్రసాదరావులు మునగాల పరగణా పోరాటాలకు వస్తూ, పోతూ, ఖమ్మం, మధిరల్లో ఆగుతూ ఇక్కడి అభ్యుదయ భావాలు కల యువకులు చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, సర్వదేవభట్ల రామనాథం, పెరవల్లి వెంకటరమణ, పెండ్యాల సత్యనారాయణ, రావెళ్ళ జానకిరామయ్య, వట్టికొండ నాగేశ్వరరావు, పబ్బరాజు రంగారావు మొదలగువారితో సంబంధాలు ఏర్పర్చుకున్నారు. కమ్యూనిస్టు



సాహిత్యం, స్వతంత్ర భారతి పత్రిక పంపేవారు.

1938లో చిర్రావూరి లక్ష్మీనర్సయ్య మొదలగువారు కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఎస్.రామనాథం వందేమాతర ఉద్యమం అనంతరం, కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా చేరారు. హైద్రాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో ప్రారంభమైన వందేమాతర ఉద్యమం సంస్థానమంతా వ్యాపించింది. వందేమాతర గేయాన్ని నైజాం ప్రభుత్వం నిషేధించింది. ఇక్కడి ఉద్యమ అభివృద్ధికి కృష్ణా, నల్గొండ జిల్లాలకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. 1938లో పొట్లూరి సుందరాన్ని ఖమ్మం పంపించారు. సుందరం ఇక్కడి ముఖ్య కార్యకర్తలను కలిసి పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. అటు తరువాత రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శివయ్యను ఖమ్మం పంపారు. శివయ్య ఇక్కడి నిర్మాణ బాధ్యతలు, రాజకీయ తరగతులు, రెగ్యులర్‌గా పార్టీ పత్రికలు తెప్పించి అందించేవారు. ఖమ్మం పట్టణంలో ఏర్పర్చిన మొదటి సెల్‌కు చిర్రావూరి కార్యదర్శి. కమిటీకి నాయకుడు ఆయనే. ఖమ్మం పట్టణం, తాలూకా, ఇల్లందు తాలూకా కొత్తగూడెం, మహబూబాబాద్ డివిజన్, వరంగల్ పట్టణం తాలూకాల్లో ఆంధ్ర మహాసభ విస్తరణకు చిర్రావూరి సర్వదేవభట్ల, పెరవల్లి వెంకటరమణయ్య, పబ్బరాజు రంగారావులు బాధ్యతలు తీసుకొన్నారు. మధిర తాలూకా బాధ్యతలు రావెళ్ళ జానకిరామయ్య, వట్టికొండ నాగేశ్వర రావు, పాలేరు, ముదిగొండ, నేలకొండపల్లి ప్రాంతాల బాధ్యతలు పెండ్యాల సత్యనారాయణ, కె.ఎల్. నర్సింహారావు గారలు తీసుకున్నారు. అన్ని గ్రామాలు, పట్టణాలు తిరిగారు. యువకులను సమీకరించారు. అన్ని గ్రామాల్లో ఆంధ్ర మహాసభ శాఖలను ఏర్పరచారు. రాజకీయ శిక్షణ ఇచ్చారు. ఆసక్తి వున్న యువకులకు పార్టీ సభ్యత్వం ఇచ్చారు. గ్రామ శాఖల నిర్మాణం చేశారు.

**ఖమ్మం పట్టణ యువజన సంఘం**

ఆంధ్ర మహాసభ ఉద్యమంలో యువకులను చైతన్యవంతులను చేయడంలో ఖమ్మం పట్టణ యువకుల సంఘం నిర్వహించిన పాత్ర చాలా ఉంది. ఈ సంస్థ 1936లో ఏర్పడింది. 1934 సం.లో విజయవాడ నుండి ఖమ్మం వచ్చి స్థిరపడిన గరేడి సత్తయ్య ఈ సంఘానికి ముఖ్య నాయకుడు. అంకిత వెంకటనర్సింహం, మంగళగిరి జగన్నాథం, సంగెపు నారాయణ, వడ్డెల్లి నారాయణ, దువ్వారి చలపతి, రామినేని వెంకన్న, అచ్చి వెంకన్న, గోదేశి వీరభద్రం, పిల్లి చెన్నకృష్ణ, చిల్లంచర్ల రాములు, కొండపల్లి కృష్ణయ్య, బుడిగం వీరన్న, తాళ్లూరి నర్సింహం, చెన్న నర్సింహం, జక్కం నర్సింహం, సీమ నర్సింహం వంటి యువకులు ప్రాణాలకు తెగించి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం, నాజీ, ఫాసిజంలకు వ్యతిరేకంగా గోడలపై పోస్టర్లు అంటించినందుకు వీరిని కొందరు అట్టల గ్యాంగ్ అని పిలిచారు. మరికొందరు ఉగ్రవాదులుగా చిత్రించారు. ఈ యువకులే ప్రజల్లో జాతీయవాద భావాలను వ్యాపింపచేశారు. జీళ్ళచెరువు గ్రామ పట్వారి అందించిన సమాచారం మేరకు ఈ యువక సంఘాన్ని నైజాం పోలీసులు అరెస్టు చేసి జైళ్ళలో నిర్భంధించారు. వీరిలో కొందరికి 18 నెలల కారాగార శిక్షను విధించారు. జైళ్ళ నుండి విడుదలై వచ్చిన తరువాత చాలామంది యువకులు కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. నాయకులు పొద్దున్నే ఒక ముద్ద కడుపులో, మరొక ముద్ద సంచిలో వేసుకొని కొత్త గ్రామాలకు పార్టీ విస్తరణకు బయలుదేరేవారు. ఒక ముద్ద కడుపులో ఒక ముద్ద సంచిలో అన్నది ఆనాటి నినాదం.

12వ ఆంధ్ర మహాసభ చివరిది. ఖమ్మం పట్టణం లకారం చెరువు పక్కన రావి నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన గొప్ప బహిరంగ సభ జరిగింది. 40 వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. చాలా దూరప్రాంతాల నుండి ప్రజలు బండ్లు కట్టుకొని వచ్చారు. మహిళలు చాలా సుదూరప్రాంతాల నుండి వచ్చారు. ఈ

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఖమ్మం సభ**
కొల్లు రాఘవయ్య ... ........................... 2

**2. కేరళపై ఎందుకీ దాడులు?**
పినరయి విజయన్ ............................ 4

**3. తీవ్రమవుతున్న పెట్టుబడిదారీ సంక్షోభం**
10

**4. సామాజిక న్యాయానికి మరో విఘాతం**
ఎంవిఎస్ శర్మ ............................. 13

**5. వ్యవసాయ సంస్కరణలతోనే సంక్షోభ పరిష్కారం**
ఎ. కోటిరెడ్డి ............................... 15

**6. శబరిమలపై కాంగ్రెస్, బిజెపి అవకాశవాదం**
జె. జగదీష్.................................. 19

**7. ఔషధ పరిశ్రమ దోపిడి**
జొయెల్ లెక్స్‌చిన్ ..............................24

**8. జీవన సౌలభ్యం - వాస్తవాలకు దూరం**
తికేందర్ సింగ్ పన్వార్ .......................27

**9. లౌకికవాదులు, లౌకిక శక్తులు చేయవలసిందేమిటి?**
బిపన్‌చంద్ర .................................. 29

**10. కమ్యూనిస్టు వ్యతిరేకతకు బలైన రోజన్‌బర్గులు**
వర్ధని ..........................................33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)



**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్ : కె.హరికిషోర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# దాడులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై దేశంలో సరికొత్తగా వివాదం నడుస్తోంది. ఆర్‌బిఐ అధికారాలు కత్తిరించడానికి ద్రవ్య విధాన కమిటీ ఏర్పాటు, డైరెక్టర్ల బోర్డులోకి ఆర్‌ఎస్‌ఎస్ వారి నియామకం, పెద్ద నోట్ల రద్దులో ఆర్‌బిఐ అభిప్రాయాలను ఖాతరు చేయకపోవడం తదితర అనేక చర్యలు.. ఆర్‌బిఐపై కేంద్ర ప్రభుత్వ దాడులకు నిదర్శనాలు. ఈ దాడులను కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి ఆ సంస్థపై ఎదురుదాడులకు పాల్పడుతున్నారు. ఇదే విధంగా కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ పైన కూడా కేంద్రం దాడులకు పాల్పడింది. సిబిఐని రాజకీయ కక్షసాధింపు సాధనంగా మార్చుకున్న బిజెపి ప్రభుత్వం ఆ సంస్థ అత్యున్నత పదవుల్లోకి తమ తాబేదారులను చేర్చి దాన్ని పూర్తిగా జేబు సంస్థగా మార్చడానికి చేసిన ప్రయత్నాలపై దేశవ్యాపితంగా కొద్దిరోజుల క్రితమే దుమారం రేగింది.

ప్రజాస్వామిక, రాజ్యాంగ సంస్థలను ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ఒక పద్ధతి ప్రకారం ధ్వంసం చేయడం ఇప్పుడే ప్రారంభం కాలేదు. కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే విద్యావ్యవస్థపైనా, చరిత్ర, సాంస్కృతిక సంస్థలపైనా దాడి చేసి వాటిని ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాకు అనుగుణంగా మార్చడానికి ప్రయత్నించింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ విషయంలో మరింత దూకుడుగా ముందుకు పోతోంది. న్యాయవ్యవస్థపై దాడికి పాల్పడింది. దీనికి వ్యతిరేకంగా నలుగురు సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు రోడ్డెక్కి నిరసన తెలియజేయాల్సి వచ్చింది. రక్షణ రంగం మీద దాడి చేస్తోంది. సీనియారిటీని కాదని తన రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకుపోయే వారిని ఉన్నత స్థానాల్లో నియమించింది. కార్పొరేట్ రహస్య విరాళాలతో ఎన్నికలను తొత్తడం చేయడం కోసం ఎన్నికల నిర్వహణ వ్యవస్థపై దాడికి దిగింది. ఇవిగాక శాస్త్ర పరిశోధనా కేంద్రాలు, విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు వంటి విజ్ఞాన కేంద్రాలపై మోడీ ప్రభుత్వం నిత్యం దాడి చేయడం చూస్తూనే ఉన్నాం.

ప్రజాస్వామిక సంస్థలను నిర్వీర్యం చేసి చివరికి ధ్వంసం చేయడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ఏం సాధించ దలచుకున్నాయి? భారత రాజ్యాంగాన్ని పచ్చి మితవాద, ఫాసిస్టు పద్ధతుల్లో పునర్నిర్మించడం ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం. ఈ విషయాన్ని ఆర్‌ఎస్‌ఎస్ గురువులు బహిరంగంగానే ప్రకటించారు. భారత ప్రజలు సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాట అనంతరం నిర్మించుకున్న రాజ్యాంగం సర్వ సమగ్రమైనది కాకపోయినా ప్రజలకు అనేక హక్కులు కల్పించింది. ఈ హక్కుల వినియోగం కోసం అనేక ప్రజాస్వామిక సంస్థలు ఏర్పాటయ్యాయి. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలుకు ఈ ప్రజాస్వామ్య సంస్థలు అడ్డుగా ఉన్నాయి. అందువల్ల అంతిమంగా రాజ్యాంగాన్ని మితవాద, ఫాసిస్టు పద్ధతుల్లో పునర్నిర్మించడం కోసం ముందుగా ఈ ప్రజాస్వామ్య సంస్థలను నాశనం చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ పూనుకుంటోంది. మోడీ ప్రభుత్వం చేస్తున్న ఈ రాజ్యాంగేతర, అప్రజాస్వామిక చర్యల వెనుక ముఖ్య ఉద్దేశం ఇదే.

ఈ దాడుల పట్ల వామపక్ష, ప్రజాతంత్ర శక్తులే కాకుండా బూర్జువా లిబరల్ డెమోక్రాట్లు కూడా ఆందోళన చెందుతున్నారు. కాని మన పాలక వర్గాలకు ఈ ఆందోళన లేదు సరికదా సమర్థిస్తున్నాయి. నిజానికి పాలక వర్గాలు సంక్షోభంలో పడిన ప్రతిసారీ రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేయడం నాటి ఎమర్జెన్సీ నుండి నేటి పరోక్ష ఎమర్జెన్సీ వరకు చూస్తూనే ఉన్నాం. సంక్షోభ భారాలను ప్రజలపై నెట్టడానికీ, దాని వల్ల వచ్చే ప్రతిఘటనను అణచివేయడానికే ఈ దాడి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థే నేడు తీవ్ర సంక్షోభంలో పడింది. మన దేశ ఆర్థిక వ్యవస్థ మరీను. ఈ సంక్షోభమే మన ప్రజల ప్రజాతంత్ర హక్కుల హరణలోనూ, ప్రజాస్వామ్య సంస్థలపై దాడుల్లోనూ ప్రతిఫలిస్తోంది. ఈ దాడులకు వ్యతిరేకంగా జరిగే పోరాటం మన దైనందిన పోరాటంలో భాగంగా ఉండాలి.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.



**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# కేరళపై ఎందుకీ దాడులు?



రచయిత
కేరళ ముఖ్యమంత్రి

**పినరయి విజయన్**

'నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్' సహభాగస్వామ్యంతో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్సు నిర్వహిస్తున్న ఈ సదస్సులో పాల్గొంటున్నందుకు నాకు సంతోషంగా ఉంది. నాకు సంతోషంగా ఉందని చెప్పడం వెనుక కారణం ఏంటంటే మీడియాలో ఒక సెక్షను ప్రధాన స్రవంతి మీడియా సహా – కేరళ గురించి ఏకపక్షంగా, పక్షపాతంగా చేస్తున్న ప్రచారంలో మంచి చెడులు ఎంచి చూడడం అనే అంశం ఈ సదస్సు చర్చనీయాంశం కావడం.

ఈ సదస్సు నిర్వాహకులు ఈ అంశాన్ని చర్చకు పెట్టడం ద్వారా కేరళ రాష్ట్రం పట్ల ఒక ప్రణాళికా బద్ధమైన దుష్ప్రచారం జరుగుతుందనే వాస్తవాన్ని గుర్తించినందుకు, కొన్ని కార్పొరేట్ మీడియా సంస్థలు కేరళ రాష్ట్రానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారం కొనసాగిస్తున్న నేపథ్యంలో ఇంతమంది జర్నలిస్టులు అటువంటి ప్రచారానికి వ్యతిరేకంగా ఇక్కడ హాజరు కావడం నాకు సంతోషంగా ఉంది. తమ స్వార్థ వ్యాపార ప్రయోజనాల కోసం కార్పొరేట్ మీడియా యజమానులు మా రాష్ట్రానికి వ్యతిరేకంగా అసత్యపు ప్రచారంలో మునిగి తేలుతూ ఉంటే ఇంతమంది జర్నలిస్టులు సత్యం వైపు నిలబడడం నాకు సంతోషాన్ని ఇస్తుంది. సత్యం మాట్లాడినందుకు మూల్యం చెల్లించుకోవాల్సిన పాడుకాలంలో మనం ఉన్నాం. అసమ్మతి గళాలను, నిరసన గొంతుకలను నులిమేస్తున్న కాలం ఇది. చిన్నారుల మీద రాజద్రోహం కేసుల మోపడం మనం చూశాం. కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తల మీద బెదిరింపులకు దిగుతూనే కొత్త గూండా సంస్కృతిని చూస్తున్నాం. నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, ఎం.ఎం. కల్బుర్గి వంటి అభ్యుదయ సామాజిక కార్యకర్తలు హత్యకావించబడడం, గౌరిలంకేష్, శంతను భౌమిక్ వంటి జర్నలిస్టుల ప్రాణాలు హరించడం – ఇవన్నీ వారు సత్యం వైపు నిలబడినందుకు చెల్లించిన మూల్యం.

కేరళ రాష్ట్రం మీద ఇప్పుడే దాడి ఎందుకు జరుగుతుంది? ఎందుకంటే ఈ రాష్ట్రం లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజం అన్న రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండడమేగాక వీటిని బలోపేతం చేసే కృషి కొనసాగిస్తుంది. దేశంలో పెచ్చరిల్లుతున్న మతతత్వ ధోరణులకు వ్యతిరేకంగా ప్రజానీకంపై భారాలు మోపుతున్న నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వం చేబడుతున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా, పెద్ద నోట్లరద్దు కుట్రకు వ్యతిరేకంగా, ఇలా అనేక సామాజిక రాజకీయ అంశాలపై మా రాష్ట్రం తొలిగా నిరసన గళం వినిపించింది. సహజంగానే మావైఖరి పాలకవర్గాలకు కంటగింపుగా ఉంది. అందుకే మా మీద ఇటువంటి దుష్ప్రచారానికి తెరతీశారు.

కేరళ రాష్ట్ర శాసనసభకు 2016లో జరిగిన ఎన్నికలలో వామపక్ష, ప్రజాతంత్ర కూటమి అధికారంలోకి రావడంతోనే మా రాష్ట్ర ప్రతిష్ఠను మసకబార్చడానికి, మా రాష్ట్రం మీద నిందాపూర్వక బలప్రయోగానికి ఎత్తులు జిత్తులు మొదలయ్యాయి. సహజంగానే మా రాష్ట్రంలో ఎండలు ఎక్కువ. 2016 ఎన్నికల ప్రచారం మొదలవడంతోనే మా రాష్ట్రం మరింత వేడెక్కింది. నవజాత శిశు మరణాల రేటులో కేరళ రాష్ట్రం మరో సోమాలియాగా తయారయ్యిందని ప్రధాని హోదాలో ఉన్న ఒక పెద్ద మనిషి నోరుపారేసుకున్నారు. అయితే ఆ ఎండాకాలపు తీవ్రత మళయాళీ ప్రజలకు చెమట పట్టించలేదు సరికదా– కేరళను సోమాలియాగా అభివర్ణించిన పెద్దమనిషికి ముచ్చెమటలు పట్టించింది. రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా యావత్ కేరళ ప్రజానీకమే కాదు, వివిధ రాష్ట్రాలలో, వివిధ దేశాలలో ఉన్న మా సోదరీసోదరులందరూ ఒక్కటిగా నిలిచి ఈ పెద్ద మనిషి మాటలు ఎంతటి అబద్ధాలో ప్రపంచానికి చాటి చెప్పారు. సామాజిక మాధ్యమంలో హాష్‌టాగ్ ద్వారా ఆ పెద్దమనిషికి 'అవహేళన' అంటే ఏమిటో రుచి చూపించారు. అంకెలు, అదీ ప్రభుత్వ అధికారిక గణాంకాల ద్వారా నవజాత శిశుమరణాలు సోమాలియా దేశంలో మాదిరి అత్యధికంగా ఉన్న రాష్ట్రం కేరళకాదు, ప్రధాని పదవి చేపట్టకముందు 16 ఏళ్ల పాటు ఆ పెద్దమనిషి పాలించి వచ్చిన గుజరాత్ రాష్ట్రం అన్న నిజాన్ని లోకానికి ఎరుకపరిచారు.

ఆ తర్వాత పెద్ద నోట్ల రద్దు వ్యవహారం వచ్చింది. కేవలం కేరళ రాష్ట్రం మీదే కాదు, యావత్ దేశ ప్రజానీకం మీద జరిగిన ఆర్థిక ఉగ్రవాద దాడి ఇది. అయితే పెద్ద నోట్ల రద్దు ప్రకటన వెలువడిన రోజున సాయంకాలాని కల్లా మా రాష్ట్రంలో నిరసన ప్రదర్శనలు మిన్నంటాయి. దానికి కొనసాగింపుగా దేశవ్యాప్తంగా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించే గొంతులు పెరిగాయి. పెద్దనోట్ల రద్దు మూలంగా చేరుతాయని చెప్పిన ప్రయోజనాలు ఎవీ నేరవేరవన్న వాస్తవం దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. దేశంలో చలామణిలో ఉన్న పెద్దనోట్లు రద్దుచేయటంతో, వాటిస్థానంలో జారీ చేయాల్సిన కొత్తనోట్ల ముద్రణా ఖర్చులు తడిపిమోపెడవుతాయని, సర్కారు అశించిన ప్రయోజనాలు ఏమీ నెరవేరవన్న వాస్తవం ప్రజలు గ్రహించారు.

పెద్దనోట్ల రద్దు వ్యవహారం దేశ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది. వందమందికిపైగా ప్రాణాలు తీసింది. ఒక్క రూపాయి నల్లధనాన్ని కూడా బయటపెట్టలేకపోయింది. ఒక మాటలో చెప్పాలంటే పెద్దనోట్లరద్దు వ్యవహారం 'మాటల

కందని మూర్ఖత్వపు పరాకాష్ట' దేశ ఆర్థిక వ్యవస్థ పాలిట మునుపెన్నడూ ఎరుగని వినాశనంగా పరిణమించింది. పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించిన రోజునే మేం ఏం చెప్పామో సరిగా అదే జరిగింది. మా అంచనా సరైనవదని రుజువయ్యింది.

అటుకేంద్ర ప్రభుత్వం గాని, ఇటు రిజర్వు బ్యాంకు గానీ పెద్దనోట్ల రద్దు నిర్ణయం సరైన దేనని దేశప్రజానీకాన్ని ఒప్పించలేక పోయాయి. ఈ నిర్ణయం తప్పుడు నిర్ణయం అని, సర్కారు ఆలోచనా రాహిత్యంగా చేసిన నిర్ణయం అన్న నిర్థారణకు రావడానికి ఇంతకన్నా రుజువేం కావాలి. ఆఖరికి దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా వెనక్కి వచ్చిన నోట్లు, వాటిలో దొంగనోట్ల శాతం వెలికితీసి నల్లధనం వంటి అంశాలపై విస్మయం వ్యక్తం చేసింది. ప్రజాగ్రహం సద్దుమణిగే దాకా ప్రభుత్వం ఈ గణాంకాలను బయటపెట్టకపోవచ్చు కూడా.

> **"అటు కేంద్ర ప్రభుత్వం గాని, ఇటు రిజర్వు బ్యాంకు గానీ పెద్దనోట్ల రద్దు నిర్ణయం సరైనదేనని దేశప్రజానీకాన్ని ఒప్పించలేక పోయాయి. ఈ నిర్ణయం తప్పడు నిర్ణయమని, సర్కారు ఆలో చనా రాహిత్యంగా చేసిన నిర్ణయమన్న నిర్థారణకు రావడానికి ఇంతకన్నా రుజువేం కావాలి. ఆఖరికి దేశ సర్వోన్నత న్యాయ స్థానం కూడా వెనక్కి వచ్చిన నోట్లు, వాటిలో దొంగనోట్ల శాతం వెలికితీసి నల్లధనం వంటి అంశాలపై విస్మయం వ్యక్తం చేసింది."**

ఈ అంశం మీద కూడా కేరళ ప్రజానీకం ఒక్క గొంతుతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే గళాలను మా రాష్ట్రం ఏకీకృతం చేసే ప్రయత్నాల్లో ఉండగా పెద్ద నోట్ల రద్దు ప్రహసనానికి సమాంతరంగా కేరళ సహకారసంఘాల వ్యవస్థ మీద కేంద్ర సర్కారు దాడికి దిగింది. కేరళరాష్ట్రంలో సమ్మిళిత ఆర్థిక (ఫైనాన్షియల్ ఇన్‌క్లూజివ్) సమాజ నిర్మాణానికి సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. దేశానికి 'అభివృద్ధి నమూనా' అంటూ బడాయి ప్రచారం చేసిన గుజరాత్‌లో కన్నా కేరళ రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు గణనీయంగా తక్కువ స్థాయిలో ఉండడానికి సహకార సంఘాలు ఎంతగానో తోడ్పడ్డాయి.

అలాంటి సహకార సంఘాలు నల్లధనం దాచుకోవడానికి సాధనాలు అంటూ మీడియాలో కట్టుకథలు అల్లి ప్రచారం చేశారు. కానీ ఈ సహకార సంఘాలు తమ శ్రమ, స్వేదఫలాలతో నిర్మితమయ్యాయమని రాష్ట్ర ప్రజానీకం అందరికీ తెలుసు. అందుకే ఈ కట్టుకథలను ఎవరూ విశ్వసించలేదు దానా దీనా చివరికి ఏం జరిగిందో, దేశ ప్రజానీకం మొత్తం గ్రహించారు. కేరళ సహకారం సంఘాల మీద ఎక్కడినుండి విషపు కథనాలు మొదలయ్యాయో అదే రాష్ట్రంలో భాజపా అధ్యక్షుడు అమిత్‌షా డైరెక్టరుగా ఉన్న సహకార బ్యాంకులో నోట్లరద్దు అమలులో ఉన్న 50 రోజులలో అత్యధికంగా 650 కోట్లరూపాయలపై చిలుకు నోట్లు జమచేయబడ్డాయి. ఇంత సొమ్మును లెక్కించడం ఆ యాభై రోజులలో బ్యాంకు రోజుకి 24 గంటలు పనిచేసినా సాధ్యం కాదన్న ఇంగితాన్ని ఉపయోగిస్తూ ఆ సొమ్ము ఎవరి ప్రాపకంతో జమ అయిన నల్లధనమో ఎవరైనా ఇట్టేగ్రహిస్తారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర మధ్య ప్రదేశ్‌లలో బిజెపి మంత్రులు డైరెక్టర్లుగా ఉన్న మరోరెండు సహకార బ్యాంకులలోనూ ఇలానే నల్లధనం పోగుపడిందన్న వార్తలు మీడియాలో వచ్చాయి.

కేరళ సహకార సంఘాల వ్యవస్థ మీద కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించిన సవతిప్రేమను నిరసిస్తూ కేరళ ప్రజానీకం సహకార వ్యవస్థ తమ జీవితాల్లో ఎదురైన ఆర్థిక ఒడిదుడుకులను అధిగమించడానికి ఎలా తోడ్పడిందో ఆ కథనాలను ప్రపంచానికి చాటిచెప్పారు. నోట్లరద్దు అనంతర కాలంలో కేంద్రప్రభుత్వం కేరళ సహకార సంఘాల వ్యవస్థ పట్ల ప్రదర్శించిన పక్షపాత వైఖరిని సుప్రీంకోర్టు కూడా గమనంలోకి తీసుకున్నది. ప్రజల భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ప్రకటించింది. ఆ రకంగా భాజపా సంకీర్ణ ప్రభుత్వ పక్షపాత వైఖరిని కేరళ ప్రజానీకం గరిష్ట ఐక్యతతో ఎండగట్టి తిప్పికొట్టారు. ఆ తరువాత 'జంతుహింస నిషేధం' పేరిట కేంద్రప్రభుత్వం ఒక గెజెట్ నోటిఫికేషన్ ఇచ్చింది. పేరు ఏదైనా ఈ గెజెట్ అసలు ఉద్దేశ్యం గోమాంసంపై నిషేదం విధించడమే. కేంద్రప్రభుత్వ దుష్టపన్నాగానికి వ్యతిరేకంగా మరలా కేరళ రాష్ట్రమే తొలిగా గొంతువిప్పింది. ప్రజలు ఎక్కడికక్కడ బీఫ్ ఫెస్టివల్స్' నిర్వహించి కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసన తెలియజేశారు. కేంద్రప్రభుత్వం చర్య రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తుందని జంతు హింస నిరోధ చట్టం మూలంగా పాడిపరిశ్రమ, తోళ్లపరిశ్రమ, పశుపోషణ వ్యవస్థ దెబ్బతినిపోతాయని, సమాజంలో అట్టడుగు తరగతుల జనాభాకు అందుబాటులో ఉన్న పోషకాహారాన్ని వారికి కాకుండా చేయ్యడమే

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

**"బిజెపి నిర్వహించిన యాత్రలో భాగంగా ఉప ఎన్నిక జరగనున్న నియోజకవర్గం మొత్తం తిరిగారు. రెచ్చగొట్టుడు నినాదాలు ఇచ్చారు. ఈ మొత్తం ప్రయత్నాలకు ఈ ప్రాంత ప్రజానీకం దిమ్మతిరిగిపోయే సమాధానం ఇచ్చారు. ఆ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి నాలుగవ స్థానంలోకి నెట్టివేయబడ్డాడు. అంతకన్నా సిగ్గు తీసే విషయం ఏంటంటే గత ఎన్నికలలో లభించిన ఓట్ల కన్నా ఈసారి జరిగిన ఎన్నికలలో వారికి పోలైన ఓట్ల శాతం గణనీయంగా తగ్గిపోయింది."**

చూశారు. మా రాష్ట్రంలో మంత్ర నగరుల్లాంటి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి వాటిని చూసి తరలించండి, మా రాష్ట్ర ప్రజల నిర్మల ఆతిథ్యాన్ని అస్వాదించండి అని స్వాగత వచనాలు చెప్పిన ఆ ప్రజానీకమే మా రాష్ట్రంపై ఎటువంటి తప్పుడు ప్రచారం జరిగినా అధికారిక గణాంకాల ద్వారానే అలాంటి ప్రచారంలో కపటత్వాన్ని ఎండగట్టి ఏడు తాటిచెట్లలోతున పాతి పెట్టారు. అదే మా రాష్ట్ర ప్రజల విశిష్టత– విజ్ఞత.

ఈ చట్టం ఉద్దేశ్యమని ఎలుగెత్తిచాటారు. ఈ పరిణామంతో ఇతర రాష్ట్రాలు కూడా ఈచట్టాన్ని వ్యతిరేకిస్తూ తమ నిర్ణయాన్ని ప్రకటించాయి. రాష్ట్రాల స్పందన ఆధారంగా ఈ చట్టంలో మార్పు తెస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. కాని ఈ రోజు వరకు అలాంటి చర్యలు చేపట్ట లేదు. కేరళ రాష్ట్రంలో హిందువులు ప్రమాదంలో పడ్డారని దేశవ్యాప్తంగా మరో దుష్ప్రచారానికి తెరతీశారు. ముఖ్యమంత్రి తల తెచ్చిన వారికి నజరానాలు ఇస్తామని ప్రకటించారు. సామాజిక మాధ్యమాల్లో, ప్రభుత్వ అనుకూల కార్పొరేట్ మీడియాలో కేరళ రాష్ట్రం హత్యల క్షేత్రం అన్న ప్రచారాన్ని సాగించారు. ఈ పన్నాగాన్ని కూడా కేరళ ప్రజానీకం ఐక్యంగా తిప్పికొట్టింది. 'కేరళ ముందంజ' 'కేరళ నెంబర్1' పేరిట 'హ్యాష్ ట్యాగ్' లద్వారా మా రాష్ట్రం శాంతిభద్రతలు సహా అనేక సామాజిక ఆర్థిక జీవన ప్రమాణాల రీత్యా ఎలా అగ్రభాగాన ఉందో దేశానికి, బహ్య ప్రపంచానికి కూడా చాటిచెప్పారు.

మా రాష్ట్రం ప్రతిష్ట మసకబార్చే కుట్రలో భాగంగా బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు, కేంద్రమంత్రులు, ఆ పార్టీ అధ్యక్షులు సహా అనేకమంది 'యాత్ర' పేరిట మా రాష్ట్రానికి వచ్చి అవాకులు, చెవాకులతో అసత్యాలను ప్రచారం చేశారు. ఈ ప్రచారాన్ని కూడా మా ప్రజానీకం బలంగా తిప్పికొట్టారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో నవజాత శిశుమరణాలను అరికట్టలేని ముఖ్యమంత్రులు, రైతుల ఆత్మహత్యలను అరికట్టలేని ముఖ్యమంత్రులు, గో సంరక్షణ పేరిట అమాయక ముస్లింలను హత్యకావించడాన్ని నిలువరించలేని కేంద్రప్రభుత్వ నిర్వాకాలను ఎత్తిచూపుతు మా రాష్ట్రంలో శాంతి, భద్రతల మీద చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టారు. శాంతియాత్రలకు పక్క రాష్ట్రాల నుండి ప్రజలను కూడా అరువుకు తెచ్చిన వైనాన్ని ఎండ గట్టారు. ముందు మీ ఇంట గెలిచి చూపించండి, ఆ తరువాత రచ్చగెలుద్దురు అని సవాలు చేశారు.

బిజెపి నాయకులు అత్యంత బాధ్యతా రహితంగా కేరళ రాష్ట్రంలో 'ఇస్లామిక్ ఉగ్రవాదం' జడలు విప్పుతున్న రాష్ట్రం అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మా రాష్ట్రంలో దశాబ్దాల తరబడి బలంగా వేళ్లూనుకుని ఉన్న మతసామరస్యాన్ని దెబ్బతీయడానికి 'లవ్ జిహాద్' వంటి నినాదాలను ప్రచారంలో పెట్టారు. మీడియాలో మా రాష్ట్రం గురించి ఇలాంటి వార్త లే ప్రచారం అయ్యేలా పనిగట్టుకుని ప్రయత్నం చేశారు. కేరళ ప్రజానీకం కరుడుగట్టిన ఆర్ఎస్ ఎస్ హిందూ మతోన్మాద శక్తుల దుష్ప్రచారాన్ని నిశితంగా గమనించి తగిన బుద్ధి చెప్పారు. బిజెపి నిర్వహించిన యాత్రలో భాగంగా ఉప ఎన్నిక జరగనున్న నియోజకవర్గం మొత్తం తిరిగారు. రెచ్చగొట్టుడు నినాదాలు ఇచ్చారు. ఈ మొత్తం ప్రయత్నాలకు ఈ ప్రాంత ప్రజానీకం దిమ్మతిరిగిపోయే సమాధానం ఇచ్చారు. ఆ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి నాలుగవ స్థానంలోకి నెట్టివేయబడ్డాడు. అంతకన్నా సిగ్గు తీసేసే విషయం ఏంటంటే గత ఎన్నికలలో లభించిన ఓట్ల కన్నా ఈ సారి జరిగిన ఎన్నికలలో వారికి పోలయిన ఓట్ల శాతం గణనీయంగా తగ్గి పోయింది. 'మా రాష్ట్రంతో' మా భవిష్యత్తుతో ఆటలాడుకోవద్దు' అంటూ ప్రజలు బిజెపికి గట్టిగా బుద్ధిచెప్పారు.

'యాత్ర' పేరిట మా రాష్ట్రానికి పోటెత్తిన బిజెపి నాయకులను మా ప్రజలు సాదరంగానే



కేరళ వరద సహాయ కార్యక్రమాలలో మహిళలు

కన్నూరు జిల్లాల్లో హింస గురించి మీడియా తెగ హడావిడి చేస్తున్నది. నేను ఈ జిల్లాకు చెందనవాడినే. చారిత్రక వాస్తవాలు, అధికారిక గణాంకాలను పరిశీలిస్తే ఆర్ఎస్ఎస్ అసలు స్వరూపం ఎవరైనా ఇట్టే గ్రహించవచ్చు. ఈ జిల్లాలో మత సామరస్యాన్ని దెబ్బతీయడానికి అర్ఎస్ఎస్ శక్తులు లెక్కలేనన్ని ప్రయత్నాలు చేశాయి. ఇక్కడి బీడి పరిశ్రమ యజమాన్యాలు తమపై చేస్తున్న అమానుష దోపిడికి వ్యతిరేకంగా కార్మికులు ఆందోళనలకు దిగినప్పుడల్లా యాజమాన్యాల కొమ్ముకాసేందుకు ఆర్ఎస్ఎస్ ఏకంగా ప్రైవేటు సైన్యాన్ని తయారుచేసి, బీడీ కార్మికుల మీద హింసాత్మక దాడులకు తెగబడేది. 1970లో తలస్సేరిలో మతఘర్షణలు రగిలించడానికి ఆర్ఎస్ఎస్ తీవ్రంగా ప్రయత్నించింది. ఈ కుట్రను భగ్నం చేయడంలో సిపిఎం పోషించిన సానుకూల పాత్రను జస్టిస్ విద్యాతిల్ కమిషన్ ప్రశంసించింది. ఆ నివేదిక చదివిన ఎవరికైనా ఈ వాస్తవం బోధపడుతుంది. ఆ తర్వాత కూడా ఆర్ఎస్ఎస్ కన్నూరు జిల్లాలో మత సామరస్యాన్ని భగ్నం చేయడానికి అడుగడుగునా ప్రయత్నిస్తూనే వచ్చింది. ఈ రకంగా కన్నూరు జిల్లాలో తన ఉనికి చాటుకోవాలని చూసింది.

భారత స్వాతంత్ర్యోదమకాలంలో ఆర్‌ఎస్ఎస్ ఎటువంటి పాత్ర పోషించిందో అందరికి తెలుసు. ఏ ప్రజాఉద్యమంలోనూ అది నేరుగా భాగస్వామి కాలేదు. సరికదా కనీసం సహకరించటం, సంఘీభావంగా నిలవటం కూడా చేయలేదు. ఇక మా రాష్ట్రంలో పరిస్థితి చూస్తే ఈ గడ్డ మీద జరిగిన అనేక సంస్కరణోద్య మాలకు వ్యతిరేకంగా పనిచేసింది. అలాంటి ఆర్‌ఎస్ఎస్ నాటి సంస్కర్తలను తమ మతతత్వ అజెండా వ్యాప్తికి నిస్సిగ్గుగా వాడుకుంటున్నది.

"మానవాభివృద్ధి సూచికలో దేశంలోనే కేరళ రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అలానే కేరళలో వామపక్షప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల విభాగంలో అగ్రభాగాన నిలిచిన రాష్ట్రంగా 'ఇండియా టుడే' పత్రిక ఒక సర్వే వెలువరించింది. ఇంకా అనేక సామాజిక రంగాల్లో కూడా కేరళ రాష్ట్రం అగ్రభాగాన ఉన్నట్లు ఆ పత్రిక గణాంకాలతో సహా వివరించింది."

కేరళకు సంబంధించిన మరిన్ని వాస్తవాలను మీ దృష్టికి తీసుకురాదలిచాను. కేరళకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వ ప్రాయోజిత ప్రచారా లు ఎన్నయినా సాగనీయండి అవేవీ సత్యాన్ని మరుగున పరచలేవు. కొద్దికాలం క్రితం ఐక్య రాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమాల సంస్థ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (ఢిల్లీ) సంయుక్తంగా ప్రారంభించిన ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్‌లో నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ అమర్త్యసేన్ మాట్లాడుతూ మెరుగైన జీవన ప్రమాణాలను అందించడంలో కేరళ రాష్ట్రాన్ని చూసి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉందని చెప్పారు. సామాజిక సూచికల ఆధారంగా మిగిలిన రాష్ట్రాలకన్నా కేరళ ఎంత ముందంజలో ఉందనేది గణాంకాలతో సహా వివరించారు.

మానవాభివృద్ధి సూచికలో దేశంలోనే కేరళ రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అలానే కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతల విభాగంలో అగ్రభాగాన నిలిచిన రాష్ట్రంగా 'ఇండియా టుడే' పత్రిక ఒక సర్వే వెలువరించింది. ఇంకా అనేక సామాజిక రంగాల్లో కూడా కేరళ రాష్ట్రం అగ్రభాగాన ఉన్నట్లు ఆ పత్రిక గణాంకాలతో సహా వివరించింది. దేశంలోనే కేరళ రాష్ట్రం అవినీతి సూచీలో అట్టడుగున ఉందని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ ప్రకటించింది. ప్రజాసంబంధాల సూచికలో దేశంలోనే మా రాష్ట్రం అగ్రభాగాన నిలిచింది. 'కాప్స్ టుడే ఇంటర్నేషనల్ సర్వేలో కేరళ పోలీసులు 'ఎక్సలెన్సీ అవార్డు పొందారు.

దేశంలోనే అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా కేరళ నిలిచింది. ఇంకా అనేకానేక ప్రమాణాల రీత్యా దేశంలోనే ఎన్నదగిన రాష్ట్రంగా కేరళ నిలిచింది. అత్యధిక జనసాంద్రతగల రాష్ట్రం అయినప్పటికీ బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా కేరళ ముందంజలో ఉంది. దేశంలోనే నూటికి నూరు శాతం విద్యుదీకరించబడిన రాష్ట్రం మా కేరళ. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల జనాభాకు దామాషా నిష్పత్తిలో రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ. దేశంలో మిగిలిన ఏ రాష్ట్రంతో పోల్చిచూసినా అణగారిన తరగతుల ప్రజానీకానికి మా వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వమే అధిక కేటాయింపులు చేసిందని నేను ఘంటాపథంగా చెప్పగలను. ఇంటర్నెట్ సౌకర్యం లభ్యత పౌరుల హక్కుగా నిర్ణయించిన ఏకైక రాష్ట్రం మా రాష్ట్రమే. నేను ఇటువంటి ఉదాహరణలు అనేకం చెప్పగలను. ట్రాన్స్‌జెండర్ జనాభాకు నిర్దిష్ట చట్టం చేసింది. వారికి ఉపాధి అవకా శాలు కల్పించింది (కొచి మెట్రో ఉదాహరణ) మా రాష్ట్రమే.

నవజాత శిశుమరణాల రేటు దేశంలోకెల్లా మా కేరళ రాష్ట్రంలోనే అత్యల్పంగా ఉన్నది. స్త్రీ పురుష నిష్పత్తి కూడా మిగిలిన అన్ని రాష్ట్రాలకన్నా హెచ్చుగా ఉంది. మెరుగైన వైద్య సౌకర్యాల రూపకల్పన ద్వారా సగటు ఆయు: ప్రమాణం పెరిగింది. గ్రామాలకు ఆధునిక రహదారుల సౌకర్యం ఉంది. విదేశాల నుండి వచ్చే వ్యక్తిగత జమలు కూడా దేశంలోకెల్లా మా రాష్ట్రంలోనే అత్యధికం. మహిళాభ్యున్నతి కోసం ప్రభుత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం. అంతే కాదు రాష్ట్ర బడ్జెట్‌లో 16 శాతం మహిళాభ్యున్నతికి కేటాయిస్తున్నాం. అలాగే పోలీసు విభాగంలో మహిళలను 25 శాతానికి పెంచేకృషి జరుగు తున్నది. కేవలం మహిళలే ఉన్న పోలీసు బెటాలి యన్‌లు ఉన్నాయి. అలాగే ప్రత్యేక మహిళా పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశాం లైంగిక నేరాలకు పాల్పడేవారి 'రిజిస్ట్రీ' నిర్వహిస్తున్న తొలిరాష్ట్రం మా కేరళయే.

కార్మికులకు ఇచ్చే కనీస వేతనాలు మిగిలిన అన్ని రాష్ట్రాలలో కన్నా మా రాష్ట్రంలోనే ఎక్కువ. అందుకే మా రాష్ట్రానికి వలసకార్మికుల తాకిడి కూడా ఎక్కువే. వలస కార్మికులకు కూడా మా రాష్ట్రంలో ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాం. వలస కార్మికులు కూడా మా రాష్ట్ర పౌరుల స్థాయిలో సమానంగా ఆదరించబడతారు. ఇలాంటి శ్రమైక జీవన సౌందర్య వాతావరణాన్నిచెడగొట్టేందుకు మతోన్మాదశక్తులు వాట్సప్‌ల ద్వారా వలస కార్మికులలో భయోత్పాతం కలిగించే ఆడియో, వీడియో సందేశాలను పెద్ద ఎత్తున చలామణీ చేశాయి. రాష్ట్రప్రభుత్వం అన్ని జిల్లా అధికార యంత్రాగాల సమన్వయంతో వలస కార్మికుల భయసందేహాలను నివృత్తి చెయ్యడంతో పాటు వారి రక్షణకు పూచీనిచ్చాయి.

కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా రాష్ట్రప్రతిష్టను మసకబార్చడానికి సామాజిక మాధ్యమంలో తప్పుడు వార్తలు, వీడియోలు పెద్దఎత్తున ప్రచారంలో పెట్టే పని కొనసాగుతున్నది. ఇక్కడి ప్రజలు ఒక హత్యాఘటనను వేడుకలా జరుపుకుంటున్నారని వీడియో, ట్విట్టర్‌లో కేంద్రమంత్రుల అధికారిక ట్విట్టర్ ఖాతాల నుండి ప్రచారంలోకి వచ్చాయి. కానీ ఒక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో గెలుపును వేడుకగా చూస్తున్న ప్రజల వీడియోను మార్ఫింగ్ చేసి, హత్యను వేడుకగా చూస్తున్నట్లు ప్రచారంలోకి తెచ్చారన్న వాస్తవాన్ని బయటపెట్టడంతో ఈ ట్వీట్లను ప్రచారంలో పెట్టినవాళ్లే వెనక్కితీసుకున్నారు. అలాగే ఎక్కడో జరిగిన మతకలహాలను కేరళలో జరిగినట్లు వీడియో ద్వారా తప్పుడుగా ప్రచారం చేశారు. అలాగే రోడ్డుపక్కన పడి ఉన్న ఆవు మృత కళేబరాల పోటోలనుఫేస్‌బుక్ పేజీలలో మా రాష్ట్రంలో 'ఇష్టారాజ్యంగా' వధించబడుతన్న గోమాతలు అంటూ విరివిగా ప్రచారంలోకి తెచ్చారు. ఇది తప్పుడు వార్త అని అంతే పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో మతోన్మాదశక్తులు తోకముడిచాయి. ఈ మతోన్మాదశక్తుల దిగజారుడుతనానికి పరాకాష్ట ఏంటంటే గౌరీలంకేష్ హత్యకావించబడిన వీడియోను కేరళలో హత్యకావించబడిన 'హిందుమహిళ' అంటూ ప్రచారంలోకి తెచ్చారు.

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఏలుబడిలో ఉన్న మా రాష్ట్రంలో మత ఉద్రిక్తతలు

> **"మా రాష్ట్ర ప్రజానీకం భారతీయులందరిని తమ అన్నదమ్ములు,అక్కచెల్లెళ్లలా ఆదరభావంతో చూస్తారు. అలానే దేశదేశాల్లో స్థిరపడిన మళయాళీ డాక్టర్లు, ఇంజనీర్లు, నర్సులు మా రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. విలువైన విదేశీ మారక ద్రవ్య నిధుల జమలు మా రాష్ట్రంలోనే అత్యధికంగా ఉన్నాయి. అలాగే మషాలా దినుసులు, రబ్బరు, జీడిపప్పు ఎగుమతులలో మా రాష్ట్రమే అగ్రభాగాన ఉండి విదేశీ మారక ద్రవ్యాన్ని గణనీయంగా అర్జించి పెడుతున్నది."**

రాజేసి ఎలాగైనా ఇక్కడ కాలూనాలని ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ఎంతటి నీచానికైనా పాల్పడుతున్నాయి. మల్లప్పురం (ముస్లిం జనాభాత్యధికంగా ఉన్న) జిల్లాలో హిందువులను భూములు కొనుక్కోనివ్వడం లేదని ఒక ప్రచారం లేవదీశారు. ఇది తప్పుడు ప్రచారం అని ఆ జిల్లాలోని హిందువులు తిప్పికొట్టారు. మాజీ విదేశాంగ కార్యదర్శి కూడా ఈ ప్రచారాన్ని తప్పుడుదని విమర్శించారు. రంజాన్ మాసంలో ముస్లీంలు నీలంబుల్‌లోని హిందూ దేవాలయాన్ని అపవిత్రం చేశారనే తప్పుడు ప్రచారంతో అక్కడ ఉద్రిక్తతలు రాజేయాలని చూశారు. అయితే ఘటన జరిగిన 24 గంటల్లో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఆలయాన్ని అపవిత్రం చేసిన నిందితుడు స్వయానా సంఘ్‌పరివార్‌కు చెందినవ్యక్తి అని తేలింది. అలాగే పెరంబువార్‌లో ముస్లీంలు పందివారుని అమ్మనీయడం లేదనే తప్పుడువార్త ప్రచారం చేశారు.

ఈ కుయత్నాలకు_తోడు మా రాష్ట్రానికి గుండెకాయవంటి పర్యాటక రంగాన్ని కుదేలు చెయ్యడానికి బాయ్‌కాట్ కేరళ అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచార కుతంత్రానికి తెగబడ్డారు. మా రాష్ట్ర ఆర్థికవ్యవస్థని దెబ్బతీసి, తద్వారా ఇక్కడి ప్రజలు జీవనాధారం కోల్పోయేలా చేసి, వారిలో అసంతృప్తిని పెంచాలనే ఈ కుట్రల వెనుక అర్‌ఎస్‌ఎస్ శక్తులు ఉన్నాయనేది నిర్వివాదాంశం.

మా రాష్ట్ర ప్రజానీకం భారతీయులందరిని తమ అన్నదమ్ములు,అక్కచెల్లెళ్లలా ఆదరభావంతో చూస్తారు. అలానే దేశదేశాల్లో స్థిరపడిన మళయాళీ డాక్టర్లు, ఇంజనీర్లు, నర్సులు మా రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. విలువైన విదేశీ మారక ద్రవ్య నిధుల జమలు మా రాష్ట్రంలోనే అత్యధికంగా ఉన్నాయి. అలాగే మషాలా దినుసులు, రబ్బరు, జీడిపప్పు ఎగుమతులలో మా రాష్ట్రమే అగ్రభాగాన ఉండి విదేశీ మారక ద్రవ్యాన్ని గణనీయంగా అర్జించి పెడుతున్నది. ఆఖరికి విదేశీ పర్యాటకులు దైవభూమిగా



సోలార్ పవర్ స్కాంకు వ్యతిరేకంగా సిపిఎం ఆందోళన

పిలవబడే మా రాష్ట్రాన్ని సందర్శించనిదే తమ పర్యటన ముగించరు.

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ పరిపాలనలో ఉన్న ఈ రాష్ట్రం లౌకికభావనకు పెట్టని కోట, , మత కలహాల ఊసేలేని రాష్ట్రం మాది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజానీకానికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తుంది. మిగిలిన అన్నిరాష్ట్రాలకన్నా మా రాష్ట్రంలో మహిళాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతున్నది. ఒక చిన్న రాష్ట్రం అనేక సామాజిక రంగాల్ని ముందు పీఠిన ఉండడం కొన్ని స్వార్థ పరశక్తులక్తి కంటగింపుగా ఉంది. అలాంటి స్వార్థపరశక్తులకి మా ప్రజానీకం ఈ రాష్ట్రంలో నిలువనీడ లేకుండా చేస్తారు. రాబోయే రోజుల్లో కేరళరాష్ట్రం మతసహనంతో, శాంతితో, మరింత సంపద్వంతంగా విరాజిల్లుతుంది.

మా వామపక్ష- ప్రజాంతంత్ర సంఘటన ప్రభుత్వం అవినీతిని అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకుంటుంది గతంలో అధికారంలో ఉన్న యుడిఎఫ్ హయాంలో జరిగిన సౌరశక్తి స్కామ్ మీ అందరికి గుర్తుండే ఉంటుంది. ఈ కుంభకోణానికి వ్యతిరేకంగా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన పార్టీల పిలుపు మేరకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సెక్రెటేరియట్‌ని ముట్టడించారు. ఈ ఆందోళనకు దిగివచ్చిన యుడియఫ్ ప్రభుత్వం ఈ కుంభకోణాన్ని విచారించేందుకు ఒక జ్యుడిషియల్ కమిషన్‌ను వేసింది. ఈ కమిషన్ విధివిధానాలను యుడిఎఫ్ ప్రభుత్వమే రూపొందించింది. కొద్దికాలంక్రితం కమిషన్ రాష్ట్రప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. ఆ నివేదిక మతన్యాయపరమైన సలహాలు తీసుకున్నాక నివేదిక. దాని ఆధారంగా తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిర్ణయించింది. ఇది రాజకీయ ప్రేరేపితమైన చర్య అని ఇప్పుడు మా మీద విమర్శ చేస్తున్నారు. కమీషన్‌ను నియమించింది, ఆ నివేదిక ఆధారంగా యాక్షన్ టేకెన్ రిపోర్డు నివేదించాలని నిర్ణయించింది. యుడిఎఫ్ ప్రభు త్వమే. ఇప్పటి మా ప్రభుత్వం దానికి కొన సాగింపు చర్యలను చేపట్టింది. చట్టప్రకారం మా ముందున్న కర్తవ్యం అది 'యాక్షన్ టేకెన్ రిపోర్టును జ్యుడిషియల్ కమిషన్ ముందుంచాలి కూడా. దీని మూలంగా యుడిఎఫ్ ప్రభుత్వం లోని అనేక మంది పెద్దలు జైలు ఊసలు లెక్కు పెట్టాల్సి రావచ్చు. కానీ ఏం చేస్తాం- చట్టం తన పని తాను చేసుకోవాల్సిందేకదా.

అవినీతిని ఆరికట్టడంతో పాటు మా ప్రభుత్వం ముందు రెండులక్ష్యాలు ఉన్నాయి. దీర్ఘకాలిక ప్రాజెక్టులను త్వరితంగా పూర్తి చెయ్యడం ద్వారా మా రాష్ట్రం సర్వతోముఖ వికాసాన్ని సాధించాలి. ఇందుకు అవసరమైన బడ్జెట్‌యేతర పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రంలో మౌలిక వసతులు మరింత మెరుగు పరచడానికి కేరళ మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నిధుల బోర్డును ఏర్పాటు చేశాం. అలాగే సమాజంలో అణగారిన తరగతుల ప్రజానీకానికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు తగిన సంక్షేమ

పథకాలను అమలు చేస్తున్నాం. సమాజంలో వివిధ తరగతుల ప్రజానీకానికి సామాజిక సంక్షేమ పెన్షన్లు అందించడం అందులో భాగమే. ప్రభుత్వరంగ పరిశ్రమలు అంటేనే పనికిమాలినవని, ఎప్పుడు నష్టాల్లో ఉంటాయనే అభిప్రాయం దేశవ్యాప్తంగా చాలా ప్రబలంగా ఉంది. కానీ మా రాష్ట్రంలో అనేక రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరును మెరుగుపరచడం ద్వారా వాటిని నష్టాల నుండి బయటకు తెచ్చాం. లాభాల బాట పట్టించాం. మా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తిని

> **"కేరళ సామాజిక జీవితాన్ని ఆనందదాయకంగా మలచడానికి 'హరితమ్‌కేరళమ్‌మిషన్' 'ఆర్ద్రమ్ మిషన్" 'విద్యా మిషన్' 'లైఫ్ మిషన్'ల పేరిట నాలుగు బృహత్ ప్రణాళికలు చేపట్టాం. ప్రకృతిని సంరక్షించుకోవడం, జల వనరులను కాపాడుకోవడం చేతిని శుద్ధిచేసుకోవడం, వ్యర్థాలను శాస్త్రీయంగా వదిలించుకోవడం హరితమ్ కేరళమ్ మిషన్ ప్రధాన ఉద్దేశ్యాలు. పౌరులందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడం ఆర్ద్రమ్ మిషన్' లక్ష్యం."**



కేరళ కో-ఆపరేటివ్ బ్యాంక్ కార్యకలాపాలు

ద్విగుణీకృతం చేసేందుకు చర్యలు చేపట్టాం. పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడుకోవడానికి నిరంతరాయంగా కృషి చేస్తున్నాం. అందరికీ మెరుగైన వైద్య సదుపాయాలు, నాణ్యమైన విద్య అందిస్తూ ప్రపంచ దేశాల ప్రశంసలకు పాత్రులమయ్యాం. అందరికీ ఆవాసం కల్పించేకృషిలో ముందుకు సాగుతున్నాం.

కేరళ సామాజిక జీవితాన్ని ఆనందదాయకంగా మలచడానికి 'హరితమ్‌కేరళమ్‌మిషన్' 'ఆర్ద్రమ్ మిషన్" 'విద్యామిషన్' 'లైఫ్ మిషన్' ల పేరిట నాలుగు బృహత్ ప్రణాళికలు చేపట్టాం. ప్రకృతిని సంరక్షించుకోవడం, జలవనరులను కాపాడుకోవడం చేతిని శుద్ధిచేసుకోవడం, వ్యర్థాలను శాస్త్రీయంగా వదిలించుకోవడం హరితమ్ కేరళమ్ మిషన్ ప్రధాన ఉద్దేశ్యాలు. పౌరులందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడం ఆర్ద్రమ్ మిషన్' లక్ష్యం. తరగతి గదులను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసి పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దడానికి ఉద్దేశించినదే విద్యా మిషన్. లైఫ్ మిషన్ ద్వారా ప్రజలందరికీ ఆవాసం కల్పించడం, భూమి పంచడం లక్ష్యంగా పెట్టుకున్నాం. భూమిలేని నిరుపేద కుటుంబాలలో ఒక్కరికైనా ఉపాధి కల్పించడం తక్షణ కర్తవ్యంగా చేపట్టాలి.

అన్నింటికి మించి ఈ దేశం గురించి, చరిత్ర గురించి, వివిధ సమూహాల ప్రజానీకం గురించి బలంగా వేళ్లూనుకుని ఉన్న భ్రమాన్విత అవగాహనను బద్దలు కొట్టి ప్రజలలో శాస్త్రీయ ఆలోచన పెంపొందించేందుకు మా ప్రభుత్వం నిరంతరమూ కృషి చేస్తోంది. ఇది మత చాందస శక్తులకు ఎంత మాత్రం గిట్టడం లేదు. అందుకే ఈ దేశంలోనే ఎన్నదగిన రాష్ట్రంగా ఉన్న మా కేరళ రాష్ట్ర ప్రతిష్టని మసకబార్చడానికి అభూత కల్పనలు, పర్యాబద్దాలు ప్రచారంలోకి తెస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. అయినప్పటికీ మా రాష్ట్ర ప్రజానీకం చైతన్యవంతంగా ఈ తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, వాస్తవాలను లోకం ముందుంచుతున్నారు. కేరళ ప్రజానీకం ' మా కేరళ' నవకేరళ అని నినదిస్తున్నారు.

మతోన్మాదశక్తులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగం సమాఖ్య స్ఫూర్తి గొంతు నులిమేలా చేస్తున్న ఈ గోబెల్స్ ప్రచారాన్ని మిగిలిన భారతదేశ ప్రజానీకం అంతగా విశ్వసించకపోవడం మాకు కొంగొత్త ఆశారేఖ వంటిది. మా రాష్ట్రంలో గతంలో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాల స్ఫూర్తితోనే ఇవాళ రాష్ట్రం మొత్తం మీద దేవాలయంలోకి దళితులకు ప్రవేశం కల్పించడంతో పాటు కొన్ని దేవాలయాలలో దళితులనే ఆలయ పూజారులుగా నియమించాం. సామాజిక న్యాయానికి ఆదర్శప్రాయంగా నిలిచాం. అయినప్పటికీ మా రాష్ట్రం మీద ఏకపక్షంగా పక్షపాతపూరిత ప్రచారం కొనసాగుతూనే ఉంది.

రాజ్యాంగంలోని 356వ అధికరణాన్ని ఉపయోగించి కేరళలో ఎన్నిక కాబడిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వాన్ని రద్దుచెయ్యాలనే డిమాండును మీరు వింటూనే ఉన్నారు. దేశంలో ప్రతిపక్షం ఉనికి లేకుండా చెయ్యాలనే డిమాండును మీరు వింటూనే ఉన్నారు. దేశంలో ప్రతిపక్షం ఉనికిలేకుండా చెయ్యాలనేదే ఈ శక్తుల ఉద్దేశ్యం. కాని వివేకవంతమైన దేశ ప్రజానీకం ప్రజాస్వామ్యం గొంతు నులిమే ఎలాంటి ప్రయత్నాలనయినా చైతన్యవంతంగా తిప్పికొట్టి తీరతారనే విశ్వాసం మాకుంది.

చివరిగా మీ జర్నలిస్టుందరికీ నేను చేసే మనవి ఒక్కటే. మీ వృత్తి నిబద్ధతలో భాగమైన సత్యం, నిర్దిష్టత, పక్షపాతరాహిత్యం, ప్రజలకు జవాబుదారీతనం అన్ని సూత్రాలను సమున్నతంగా నిలబెట్టేందుకు మీరు కట్టుబడి ఉండండి. జర్నలిస్టు విలువలను, నైతిక విలువలను రెండు కళ్ళుగా మీరు కాపాడుకుంటూ వస్తారని నాకు తెలుసు. అందులో భాగంగానే ఇవాళ మా రాష్ట్రం మీద జరుగుతున్న ప్రచారాలలో ఏది సత్యం, ఏది అసత్యమో నిగ్గు తేల్చాలని మిమ్మల్ని కోరుతున్నాను.

క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను నిర్ధారించేందుకు మీరంతా మా రాష్ట్రానికి రావాలని ఆహ్వానిస్తున్నాను. ఒకసారి మా గడ్డమీద కాలుపెడితే చాలు. కేరళ రాష్ట్రం ఏ రకంగా చూసినా శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లుతూ ఉందని మీరే అర్థం చేసుకుంటారు.

*వెల్‌కమ్ టూ కేరళ*
*దేవభూమికి తరలిరండి*

**(తెలుగు: సత్యరంజన్)**

❋

# తీవ్రమవుతున్న పెట్టుబడిదారీ సంక్షోభం

## (2018, అక్టోబరు 6-8 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన సిపిఐ(ఎం) కేంద్రకమిటి సమావేశంలో ఆమోదించిన తీర్మానంలోని ముఖ్యాంశాలు

పార్టీ 22వ మహాసభలో మనం అంచనా వేసిన విధంగానే ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రమౌతున్నది. 2018 అక్టోబరులో ఐఎంఎఫ్ విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ రిపోర్టు మన అంచనాను తిరిగి ధృవీకరించింది. 180 దేశాల ఆర్థికవ్యవస్థలను పరిశీలించిన ఈ నివేదిక ఎక్కువ దేశాలు ఇంకా 2008 సంక్షోభం నాటి ఉత్పత్తి స్థాయికి చేరుకోలేదని చెప్పింది. దోపిడీని తీవ్రం చేయటం ద్వారా గరిష్ట లాభాలను పొందుతున్నారన్న విషయాన్ని భయానకమైన స్థాయిలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు రుజువు చేస్తున్నాయి. ఎక్కువ దేశాలలో సంక్షోభం నాటికన్నా పెట్టుబడులు 25 శాతం తక్కువగా ఉండటంతో ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని నివేదికలో చెప్పారు. నిరుద్యోగం పెరుగుతున్నప్పటికీ ఉత్పాదకత పెరగటంతో లాభాలు పెరుగుతున్నాయి. పెట్టుబడిదారీ విధానం తన ఉత్పత్తి సంబంధాల సంకెళ్ళ ద్వారా మానవుల శక్తి సామర్థ్యాలనుపూర్తిగా వినియోగించుకోవటానికి, ఉత్పాదకశక్తుల పెరుగుదలకు ఆటంకం కలిగించినప్పటికీ, మానవశ్రమ స్థానంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ముఖ్యంగా కృత్రిమ మేధను ఉత్పత్తిక్రమంలో వినియోగించటం ద్వారా తాత్కాలికంగా ఉత్పాదక పెరుగుదలను సాధించారు. ఈ లక్షణం రానున్న కాలంలో మరింతగా పెరిగే అవకాశం ఉంది. కాని ఇది ఎక్కువ కాలం కొనసాగదు.

ఆర్థిక సంక్షోభాన్ని గురించి మన అంచనాలను బలపరుస్తూ 2008లో ద్రవ్యవ్యవస్థ కూలిపోవటంతో బ్యాంకింగ్, ద్రవ్య వ్యవస్థలు నిరంతర సంక్షోభంలో ఉన్నాయి. "కేంద్ర బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలలోని కేంద్రబ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు సంక్షోభం ముందునాటి కన్నా అనేక లోపాలతో ఉన్నాయని, సంక్షోభానికి ముందు జిడిపి-రుణనిష్పత్తి 36 శాతంగా ఉండగా, ఇపుడు 52 శాతానికి చేరిందని" ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది.

నయా ఉదారవాదం తీవ్ర సంక్షోభంలో ఉందని, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎంత తీవ్ర సంస్కరణలు చేసినా ప్రజలకు ఉపశమనం కలిగించటం సాధ్యం కాదన్న వాస్తవాన్ని ఇది బలపరుస్తున్నది.

మనం సూచిస్తున్నట్లుగా సామాజిక, ఆర్థిక రంగాలలో మౌలిక సదుపాయాలను పెంచటం కోసం ప్రభుత్వ ఖర్చును, ప్రభుత్వరంగం ఖర్చును పెంచటం ద్వారానే ఉద్యోగాలను, ప్రజల కొనుగోలు శక్తిని పెంచటం సాధ్యమౌతుంది. ఇది దేశీయ డిమాండ్‌ను అత్యున్నత స్థాయికి పెంచుతుంది. ఈ సంక్షోభం నుండి బయటపడటం కోసం చైనా అనుసరించిన విధానాలను, ప్రజలకు ఇచ్చిన ప్రోత్సాహకాలను ఐఎంఎఫ్ ప్రశంసించింది. నయా ఉదారవాద విధానాలకు ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకతను గుర్తిస్తూనే, రక్షణవాద విధానాలను అమలుచేయటం వలన తలెత్తే ప్రమాదాలను గురించి కూడా ఐఎంఎఫ్ నివేదిక హెచ్చరించింది.

అమెరికా ఆర్థికవ్యవస్థ కొద్దిపాటి ఆర్థికాభివృద్ధిని, ఉద్యోగాల పెరుగుదలను నమోదు చేసింది. తెల్ల అమెరికన్ల జీవనాన్ని మెరుగుపరుస్తానన్న తన ఎన్నికల వాగ్దానాన్ని అమలు జరపటంలో భాగంగా ట్రంప్ దీనిని చూస్తున్నాడు. జాతి వివక్ష, విదేశీ ప్రజలపై వ్యతిరేకతను రెచ్చగొట్టటం, వలసలను నిరోధించటం, వీసాలను కఠినతరం చేయటం, విదేశాల నుండి నైపుణ్యం ఉన్న ఉద్యోగుల రాకను తగ్గించటం ద్వారా మాత్రమే దీనిని సాధించారు. వాణిజ్య యుద్ధాలు దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించే విధానానికి దారితీశాయి. ఇవి తాత్కాలికంగా కొంత ప్రయోజనం కలిగించవచ్చు. కాని పైన పేర్కొన్న విధంగా దీర్ఘకాలం వీటిని కొనసాగించటం సాధ్యంకాదు.

### వాణిజ్యయుద్ధాలు

గత కేంద్రకమిటి సమావేశంలో మనం చెప్పిన విధంగా అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రమైంది. ఇది ప్రపంచ ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. 50 బిలియన్ డాలర్ల విలువైన చైనా ఉత్పత్తులపై గతంలో అధిక సుంకాలు విధించిన అమెరికా ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లకు పైగా విలువైన చైనా ఎగుమతులపై సుంకాలను విధిస్తున్నది. 110 డాలర్ల విలువైన 527 అమెరికా ఉత్పత్తులపై సుంకాలను విధించటం ద్వారా చైనా దీనికి సమాధానం చెప్పింది. ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య తీవ్రమౌతున్న ఈ వాణిజ్యయుద్ధం ప్రపంచ ఆర్థికాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం కలిగిస్తుంది. అమెరికా, ప్రపంచదేశాల మధ్య తీవ్రమౌతున్న సుంకాల యుద్ధం 2020 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 430 బిలియన్ డాలర్ల పెరుగుదలను కోల్పోవటానికి-2020 పెరుగుదల అంచనాలో 0.5 శాతం- దారితీస్తుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. తీవ్రమౌతున్న వాణిజ్యయుద్ధం నుండి తమ ఆర్థికవ్యవస్థలను కాపాడుకోవటం కోసం ఈయు దేశాలు, బ్రిటన్ ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. సామ్రాజ్యవాద శిబిరంలోమరింతగా ఉద్రిక్తతలు, విభేదాలు పెరగటానికి ఇది దారితీస్తుంది.

### పెరుగుతున్న నిరసనలు

గత కేంద్రకమిటి సమావేశం తర్వాత నయా ఉదారవాద దాడి, తీవ్రమౌతున్న దోపిడికి వ్యతిరేకంగా ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో మిలిటెంట్ నిరసన కార్యక్రమాలు పెరిగాయి. పుతిన్ తీసుకొచ్చిన పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా రష్యాలో పెద్ద ప్రదర్శనలు జరిగాయి. సిరిజా ప్రభుత్వ పొదుపు చర్యలకు వ్యతిరేకంగా

గ్రీస్‌లో మిలిటెంట్ నిరసన కార్యక్రమాలు జరిగాయి. రుమేనియాలో తక్కువ వేతనాలకు, ఉన్నతస్థాయి అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలను పోలీసులు నిరంకుశంగా అణచి వేయటంతో అనేక వందల మంది గాయ పడ్డారు. మంచి వేతనాలు, మెరుగైన పని పరి స్థితులు కోరుతూ జర్మనీలో పైలెట్లతో సహా కార్మికవర్గం పనులు నిలిపివేసింది. లాటిన్ అమెరికాలో తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వెనిజులాతో పాటు అర్జెంటైనా, మెక్సికో, డొమినికన్ రిపబ్లిక్ లలో పెద్ద ప్రజా నిరసనలు జరిగాయి. అన్ని లాటిన్ అమెరికన్ దేశాలలోనూ అమెరికా ప్రోత్స హిస్తున్న మితవాద శక్తుల దాడి తీవ్రమౌతున్నది. బ్రెజిల్‌లో అక్టోబరు 7న ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలకు సన్నాహంగా మితవాద, మిత వాద వ్యతిరేకశక్తుల భారీ సమీకరణలు జరుగుతున్నాయి.

### క్షీణించిన అమెరికా-చైనా సంబంధాలు

వాణిజ్యయుద్ధంతో పాటు రష్యా నుండి సుఖోయ్ ఎస్‌యు-355 యుద్ధ విమానాలు, ఉపరితలం నుండి ఆకాశంలోకి ప్రయోగించే ఎస్-400 మిసిలీ వ్యవస్థలను కొనుగోలు చేసినందుకు చైనా సైన్యంపై అమెరికా ఆంక్షలు విధించింది. ఉక్రెయిన్‌లో అనుసరించిన విధానం వలన రష్యాపై అమెరికా విధించిన ఆంక్షలలో తాము భాగస్వాములు కావటం లేదని చైనా స్పష్టం చేసింది. చైనా తక్షణమే అమెరికా రాయబారిని పిలిపించింది. తమ నౌకాదళాధిపతి అమెరికా పర్యటనను రద్దుచేసింది. రెండుదేశాల మధ్య జరగవలసిన సైనిక చర్చలను వాయిదా వేసింది. "చైనాను నిరోధించటం" అన్న తన విధానాన్ని కొనసాగిస్తూ, అమెరికా తైవాన్‌కు సైనిక పరికరాలను విక్రయిస్తున్నది. దక్షిణ చైనా సముద్రంలో సంచరిస్తున్న అమెరికా యుద్ధనౌకను చైనా నౌకాదళ డిస్ట్రాయర్ హెచ్చరించి, అంతర్జాతీయ జలాలలోకి తిప్పి పంపించింది.

### ఇరాన్‌పై ఆంక్షలు

ఇరాన్, బహుళ దేశాల మధ్య కుదిరిన అణు ఒప్పందం నుండి వైదొలగిన అమెరికా ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. మొదటిదశ ఆంక్షలు ఆగస్టు 7వ తేదీ నుండి అమలులోకి వచ్చాయి. ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకాలపై నియంత్రణలను విధించటం ద్వారా ఇరాన్ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని కలిగించే రెండవ దశ ఆంక్షలు నవంబరు 4వ తేదీ నుండి అమలులోకి రానున్నాయి. ఇరాన్ అణు ఒప్పందానికి కట్టుబడి ఉందని ఐఎఇఎ అంర్జాతీయ ఇన్స్‌పెక్టర్ల బృందం నివేదించినప్పటికీ అమెరికా ఆంక్షలను విధించింది. ఇరాన్ నుండి చేసుకుంటున్న ఆయిలు దిగుమతులను నవంబరు నాటికి భారతదేశం నిలిపివేయాలన్న అమెరికా ఒత్తిడికి లొంగిపోయిన మోడి ప్రభుత్వం సెప్టెంబరు మొదటి రెండు వారాలలో దిగుమతులను సగానికిపైగా తగ్గించింది.

**"ఇరాన్, బహుళ దేశాల మధ్య కుదిరిన అణు ఒప్పందం నుండి వైదొలగిన అమెరికా ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. మొదటిదశ ఆంక్షలు ఆగస్టు 7వ తేదీ నుండి అమలులోకి వచ్చాయి. ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకాలపై నియంత్రణలను విధించటం ద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని కలిగించే రెండవ దశ ఆంక్షలు నవంబరు 4వ తేదీ నుండి అమలులోకి రానున్నాయి."**



అణు ఒప్పందంపై చర్చలు జరుపుతున్న ఇరాన్, ఐదు అగ్రదేశాలు

### సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు

మనం 22వ మహాసభలోనూ, గత కేంద్రకమిటి సమావేశంలో చెప్పుకున్నట్లుగా అమెరికా ఏకపక్ష చర్యలతో అమెరికా, ఈయు మధ్య వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ఆంక్షలను వ్యతిరేకిస్తామని ఈయు నాయకులు పట్టుపడుతున్నారు. అయినప్పటికీ అనేక యూరోపియన్ కంపెనీలు అమెరికా ఆంక్షల ఒత్తిడితో ఇరాన్‌తో వాణిజ్యం నుండి నిదానంగా ఉపసంహరించుకుంటున్నాయి. "బ్లాకింగ్ స్టాట్యూట్" ద్వారా ఆంక్షల ప్రభావాన్ని తటస్థీకరించవచ్చునని, ఇరాన్‌లో పనిచేస్తున్న ఈయు కంపెనీలను అమెరికా ఆంక్షల నుండి కాపాడుకోవచ్చునని ఈయు ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఇరాన్‌కు మానవత్వ పరంగా అవసరమైన సరుకుల సరఫరాపై ఆంక్షలను ఎత్తివేయాలని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఏకగ్రీవ ఆదేశాన్ని జారీచేసింది. ఇజ్రాయిల్, సౌది అరేబియా, భారతదేశం అమెరికాకు అత్యుత్తమ మిత్రులని ఈ మధ్య జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ట్రంప్ చెప్పాడు.

### ఇజ్రాయిల్: యూదు ఉన్మాద దాడి

అతి మితవాద ఇజ్రాయిల్ ప్రభుత్వం "జెరూసలెం నేషన్ స్టేట్ లా" ను అమలులోకి తెచ్చింది. ఈ చట్టం పాలస్తీనీయుల హక్కులను రద్దుచేసి, వారిని రెండవ తరగతి పౌరులుగా మారుస్తుంది. ఈచట్టం వివక్షను రాజ్యాంగబద్ధం చేస్తుంది. యూదుల ఆధిక్యతను బహిరంగంగా సమర్థించటం ద్వారా యూదుల సెటిల్మెంట్లను "జాతీయ ప్రాధాన్యత" కలవిగా మారుస్తుంది. అటువంటి యూదుల సెటిల్మెంట్లు వందలు, వేలమంది పాలస్తీనా వాసులను వారి ఇళ్ళ నుండి, మాతృభూమి నుండి తరిమివేశాయి. "ఐక్య, జెరూసలెం పూర్తి నగరం ఇజ్రాయిల్ రాజ ధాని'అని ఈ చట్టం బహిరంగంగా ప్రకటిస్తున్నది. ఇది ఐక్యరాజ్యసమితి తీర్మానాలను పూర్తిగా ఉల్లంఘించటం, రెండు దేశాల పరిష్కారాన్ని తిరస్కరించటం అవుతుంది. 1967 సరిహద్దుల ను ఇజ్రాయిల్ ఇపుడు అంగీకరించటం లేదు. తూర్పు జెరూసలెంను పాలస్తీనా రాజధానిగా అంగీకరించటాన్ని వ్యతిరేకించటం ద్వారా పాలస్తీనా రాజ్యహక్కును తిరస్కరిస్తున్నది. ఈ చట్టానికి వ్యతిరేకంగా వేలాది మంది ఇజ్రాయెలీలు వీధుల్లోకొచ్చి నిరసనలు, ఆందోళనలలో పాల్గొంటున్నారు. వివక్షాపూరితమైన ఈ చట్టాన్ని ఖండించకుండా అమెరికాతో కలిసి వ్యవహరించిన ప్రధానమైన దేశాలలో భారత్

> **“ఈ ఒప్పందం భారతదేశ సార్వభౌమత్వంపై దాడి. భారత సైనిక స్థావరాలను అమెరికా తనిఖీలకు తెరవటం, వారు చేసిన సైనిక సరఫరాలను, ఉత్పత్తులను పర్యవేక్షించటానికి ఈ ఒప్పందం అమెరికాకు అవకాశం కల్పిస్తుంది. ప్రస్తుతం భారతదేశ సైనిక సమాచార వ్యవస్థను అమెరికా పర్యవేక్షించగలుగుతుంది.”**

ఒకటిగా ఉంది.

**వెనిజులా**

వెనిజులాలోని అతి మితవాదశక్తులు అమెరికా మద్దతున్న ప్రతిపక్ష గ్రూపులతో కలిసి వెనిజులా బొలివేరియన్ రిపబ్లిక్ ప్రెసిడెంట్ నికొలస్ మదురోపై హత్యా ప్రయత్నం చేశారు. వెనిజులాను, ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపర్చటానికి అమెరికా దాడులను ఉధృతం చేసింది. లాటిన్ అమెరికాలో కోల్పోయిన ఆధిపత్యాన్ని తిరిగి పొందటం కోసం అమెరికా విస్తృత వ్యూహంలో ఇదొకభాగం. వివిధ దేశాలలో అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా వెనిజులా, ఇతర దేశాలలో భారీ నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.



నికొలస్ మదురో

**బ్రెగ్జిట్**

బ్రెగ్జిట్ రిఫరెండంతో ఈయు నుండి బ్రిటన్ వైదొలగటానికి జరుగుతున్న చర్చలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. బ్రిటన్‌లోని టోరి ప్రభుత్వం పెడుతున్న షరతులను అంగీకరించటానికి యూరోపియన్ యూనియన్ తిరస్కరించింది. ఈయు నుండి బ్రిటన్ బయటికి పోవటం, రాయితీలు పొందటం రెండూ సాధ్యం కావని దృఢంగా చెప్పింది. ఇది ఏ విధంగా పరిణమిస్తుందన్నది అస్పష్టంగా ఉన్నది. ఇది బ్రిటన్‌లో రాజకీయ కల్లోలానికి, బ్రెగ్జిట్‌పై మరోసారి రిఫరెండం జరపాలనే డిమాండ్‌కు దారితీసింది. ప్రధాని థెరెస్సా మే నాయకత్వంలోని టోరి ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేబర్ పార్టీ, జెరెమీ కార్బిన్ తమ జాతీయ సమావేశంలో ఈయు నుండి బ్రిటన్ బయటికి రావటానికి సంబంధించిన అంశాలపై చర్చల కోసం ఈయుకు అందజేయటానికి ప్రత్యామ్నాయ పథకాన్ని రూపొందించారు.

**రెండు ప్లస్ రెండు చర్చలు**

అనేకసార్లు వాయిదా పడ్డతర్వాత అమెరికా, భారత్ రక్షణ, విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. గత సమావేశంలో మనం చర్చించిన కాంకాసా ఒప్పందంపై లాంఛనంగా సంతకాలు చేశారు. అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడటాన్ని, జూనియర్ వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ స్థాయిని ఇది మరింత పటిష్టం చేసింది. ఈ ఒప్పందం భారతదేశ సార్వభౌమత్వంపై దాడి. భారత సైనిక స్థావరాలను అమెరికా తనిఖీలకు తెరవటం, వారు చేసిన సైనిక సరఫరాలను, ఉత్పత్తులను పర్యవేక్షించటానికి ఈ ఒప్పందం అమెరికాకు అవకాశం కల్పిస్తుంది. ప్రస్తుతం భారతదేశ సైనిక సమాచార వ్యవస్థను అమెరికా పర్యవేక్షించగలుగుతుంది. భారత రక్షణ వ్యవస్థ, సాయుధ సైనికులు పూర్తిగా అమెరికా సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడటానికి, ఇంతకు ముందు రష్యా, ఇతర దేశాల నుండి కొనుగోలు చేసి ఉపయోగిస్తున్న ఆయుధాలు నిరుపయోగం కావటానికి ఈ ఒప్పందం దారితీస్తుంది.

**భారత్-రష్యా రక్షణ ఒప్పందం**

భారత్, రష్యాలు 40,000 కోట్ల రూపాయల విలువైన రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఉపరితలం నుండి ఆకాశంలోకి ప్రయోగించే ఐదు అడ్వాన్స్‌డ్ ఎస్-400 ట్రయమ్ఫ్ మిసిలీ స్క్వాడ్రన్‌లను భారత్ కొనుగోలు చేస్తుంది. గత రెండు దశాబ్దాలలో రష్యాతో చేసుకున్న అతిపెద్ద రక్షణ ఒప్పందం ఇది. 2020 నుండి ఇవి భారత్‌కు అందటం ప్రారంభం అవుతుంది.

తొమ్మిది ఇతర ఒప్పందాలు కూడా చేసుకున్నారు. అంతరిక్ష సహకార రంగంలో 2020 నాటికి ఇద్దరు భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపుతానని రష్యా వాగ్దానం చేసింది. ఆర్థికరంగంలో రైల్వేలు, పౌర విమానాల తయారీ రంగంలో సహకారానికి రష్యా ఆసక్తి చూపించింది. 2017-18లో 10.7 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2025 నాటికి 30 బిలియన్ డాలర్లకు పెంచాలని భావించారు. అమెరికా ప్రతిపాదించిన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్‌ల మధ్య చతుర్ముఖ సైనిక సహకార ప్రతిపాదనకు మోడి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమెరికా ప్రపంచ రక్షణ వ్యూహంలో ప్రధాన రక్షణ, వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ పాత్రను ఇది పటిష్టం చేస్తుంది.

సైనిక సంబంధాల పరిధిని దాటి ఇది ప్రభావితం చేస్తుంది. ఇరాన్‌పై ఆంక్షల అమలు సందర్భంలో జరిగినట్లుగా భారత్ ఇప్పటికే అమెరికా ఒత్తిడికి లొంగిపోయింది. ఆయుధాలతో పాటు మరిన్ని అమెరికా సరుకులను కొనుగోలు చేయాలని, భారత్‌లో పెట్టే అమెరికా పెట్టుబడులపై అన్ని విధాలైన ఆంక్షలు తొలగించాలని అమెరికా డిమాండ్ చేస్తున్నది. ఇందుకు పరిహారంగా ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పెంచుతున్న సుంకాల తగ్గింపు, వీసా నిబంధనల సడలింపులాంటి రాయితీలేమీ భారత దేశానికి ఇవ్వలేదు.

**విదేశాంగ విధానంలో ఊగిసలాటలు**

గత కేంద్రకమిటి సమావేశంలో మనం గమనించిన విధంగానే అమెరికాకు జూనియర్ వ్యూహాత్మక భాగస్వామిగా తన స్థానాన్ని పటిష్ఠం చేసుకున్నప్పటికీ సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత వైరుధ్యాలు, రష్యా బలపడుతున్న నేపథ్యంలో భారత విదేశాంగ విధానం ఊగిసలాటతో ఉన్నది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలను అంగీకరించబోమని భారతదేశం ప్రకటించింది. పరిమాణం తగ్గినప్పటికీ ఇరాన్ నుండి ఆయిల్ కొనుగోలు చేయటాన్ని కొనసాగిస్తున్నది. భారత్, రష్యా రక్షణ ఒప్పందం, భారీస్థాయిలో ఆయుధాల కొనుగోలు, రష్యా, చైనాలతో వ్యవహరించటం తమ సైనిక ప్రయోజనాలకు ప్రతికూలమైనదని అమెరికాలో భావిస్తున్నారు. రష్యా నుండి ఆయుధాలు కొనుగోలు చేస్తే కౌంటర్ అమెరికాస్ అడ్వార్జరీస్ త్రూ శాంక్షన్స్ యాక్ట్ (సిఎఎటిఎస్ఎ) ద్వారా ఆంక్షలు విధిస్తామని అమెరికా బెదిరించినా ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందానికి ఈ చట్టాన్ని వర్తింపచేయరాదని భారత్ కోరింది. దీనిపై అమెరికా ఏ విధంగా స్పందిస్తుందనేది వేచి చూడాల్సివుంది. ❋

# సామాజిక న్యాయానికి మరో విఘాతం

ఎంవిఎస్ శర్మ



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

**ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ప్రమోషన్లు క్రీమి లేయర్ వర్తిస్తుందన్న సుప్రీంతీర్పు**

**2018** సెప్టెంబరు 26న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు వర్తిస్తాయని తీర్పు చెప్పింది. అదే సమయంలో ఆర్థికంగా అధికాదాయాలు పొందే (క్రీమిలేయర్) ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తించవని, ప్రమోషన్లలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు రిజర్వేషన్లు అమలు చేయాలా వద్దా అనేది ఆయా రాష్ట్రాలు నిర్ణయించుకోవచ్చునని తీర్పునిచ్చింది.

సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి (తీర్పు వెలువడే నాటికి) జస్టిస్ దీపక్‌మిశ్రా, న్యాయ మూర్తులు రోహింగ్టన్‌నారీమన్, కురియన్ జోసెఫ్, ఎస్.కె.కౌల్, ఇందుమల్హోత్రా ఇచ్చిన తీర్పులో ప్రమోషన్లలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగంలో పొందుపరిచిన 16 (4ఎ), 16 (4 బి) అధికరణాలు చెల్లుతాయని తెలిపారు. అంత వరకూ బాగానే ఉంది. కాని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులలో అధిక ఆదాయాలు వచ్చేవారికి ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తించవని తీర్పునిచ్చారు.

మనలో పలువురికి ఈ విషయమై ఇప్పటికే రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి. కలెక్టర్ కొడుక్కి కూడా రిజర్వేషన్ అవసరమా? కార్లలో తిరిగేవారికి రిజర్వేషన్లు అవసరమా? – ఇలాంటి ప్రశ్నలు ఎదురౌతుంటాయి. ఇటువంటి ప్రశ్నలు లేవనెత్తేవారు రాజ్యాంగంలో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లను ఎందుకు కల్పించారన్న మౌలిక విషయాన్ని మరిచిపోతున్నారు.

1) మనదేశంలో అనేక ఇతర కులాలు కూడా కులవివక్షను ఎదుర్కొంటున్నారు. కాని అస్పృశ్యత, అంటరానితనం అనే మహమ్మారి దళితులను మాత్రమే పీడిస్తోంది. అలాగే వేల సంవత్సరాల వెనకబాటుతనం గిరిజనులను కూడా సమాజం నుంచి దూరంగానే ఉంచింది. అరవై సంవత్సరాల పాటు రిజర్వేషన్ విధానం అమలు జరిగినప్పటికీ ఆ అంటరానితనం నుండి, వెలివేత నుండి దళితులు, గిరిజనులు ఇంకా విముక్తి పొందలేదు. ఎస్సీ ఎస్టీలలో కొద్దిమంది ఉన్నత పదవులలోకి వచ్చి ఉండొచ్చు. వారెంత పెద్ద పదవులలో ఉన్నా వారింకా అంటరానితనం నుండి, సామాజిక వివక్ష నుండి విముక్తి పొందలేదు.

మనదేశప్రథమ పౌరుడు రామనాథ్‌కోవింద్ పూరీలోని జగన్నాథ ఆలయాన్ని దర్శించడానికి ఇటీవల పోయినప్పుడు ఆయనను గుడిలోపలికి అనుమతించలేదు. మెట్లవద్దే తన ప్రార్థన నివేదించుకుని వెనుదిరిగాడాయన. మనదేశ ఉపప్రధాని పదవి చేపట్టిన బాబుజగజ్జీవన్‌రామ్ ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ సంపూర్ణానంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఒక సవర్ణుడి విగ్రహాన్ని దళితుడు ఆవిష్కరించినందున ఆ విగ్రహం మైలబడిందని ఆ తర్వాత ఆ విగ్రహాన్ని గంగాజలంతో శుద్ధిచేశారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మన రాజ్యాంగ నిర్మాత అయిన తర్వాతి కాలంలో సైతం ఆయన పట్ల ఇటువంటి వివక్ష పాటించిన సందర్భాలు చాలా ఉన్నాయి. కులాంతర వివాహాలకు మేము సిద్ధమేనని ముందుకొచ్చే సంస్కరణాభిలాషుల్లో సైతం "ఏ కులమైనా పరవాలేదు గాని, మరీ బత్తిగా ఎస్సీ ఎస్టీలైతే మాత్రం కష్టమే" అని వెనక్కి తగ్గే ప్రబుద్ధులు చాలామంది ఉన్నారు.

అనేక బి.సి కులాల వారు కూడా కుల వివక్షను, చిన్నచూపును ఎదుర్కొంటున్నా, వారికి దళితులవలె అంటరానితనం అనే శాపం లేదు. కనుక దళిత, గిరిజనులు ఆర్థికంగా, విద్యాపరంగా, వృత్తిపరంగా మాత్రమే గాక సామాజికంగా కూడా సవర్ణులతో సరితూగే స్థాయికి చేరుకునేలా విధానాలను, పథకాలను, కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు జరిపేవరకూ రిజర్వేషన్లను కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఉంటుంది.

2) రిజర్వేషన్లను మేము అంగీకరిస్తున్నాం. కాని ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లంటే ఎలా? అనేవారున్నారు.

రిజర్వేషను ఉండాలని కోరుతున్నవారు నిజానికి కోరుతున్నది సమన్యాయం. జనాభాలో (2011 జనాభా లెక్కల ప్రకారం) దళితులు 16.6 శాతం: గిరిజనులు 8.6 శాతం. మొత్తం 25.2 శాతం ఇన్నాళ్ల రిజర్వేషన్ విధానం తర్వాత నైనా ఆ 25 శాతం మేరకైనా దళిత గిరిజన ఉద్యోగులు ఉన్నత పదవులలో ఉన్నారా? ఐఎఎస్‌లలో, ఐపిఎస్‌లతో వీరు నాలుగో వంతు ఉన్నారా? ఐఎఎస్ అధికారుల సంతానంలో తిరిగి అటువంటి ఉన్నత స్థానాలకు చేరుకో గలిగిన వారెంత శాతం ఉన్నారు? రిజర్వేషన్లు బ్యాక్‌లాగ్ ఖాళీలు ఇప్పటికీ ఎందుకు కొనసాగుతున్నాయి?

ప్రభుత్వ ఉద్యోగాలలోని నాలుగు గ్రేడ్లలోనూ, గ్రేడ్లవారీగా దళిత, గిరిజన ఉద్యోగుల శాతం ఎంత ఉందో లెక్కలు తీస్తే ఆఖరుగ్రేడ్‌లో మాత్రం వారు 25 శాతం కన్నా ఎక్కువే ఉంటారు. సవర్ణ కులవ్యవస్థ పారిశుద్ధ్య పని, స్మశానాల వద్ద పని వంటివి వారికే కేటాయించింది గనుక ఈ పరిస్థితి ఉంది. మొదటి మూడు గ్రేడ్‌లలో మాత్రం బ్యాక్‌లాగ్ వేకెన్సీలు చాలా ఉంటున్నాయి. ఏళ్ల తరబడి వాటిని నింపడం లేదు. ఇంతెందుకు? మన న్యాయస్థానాలనే తీసుకుంటే సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఒకే ఒక్క దళితుడు ఇంతవరకు ఉన్నాడు. ఆయనే జస్టిస్ కె.జి బాలకృష్ణన్. 2010లో ఆయన పదవీకాలం ముగిశాక, ఇంతవరకూ సుప్రీం న్యాయమూర్తి పదవులలో జరిగిన నియామకాలలో ఒక్క దళితుడూ లేరు. గిరిజనులూ లేరు. దేశంలోని 24 హైకోర్టులలో ఒక్కచోటకూడా నేడు దళిత ప్రధానన్యాయమూర్తి లేదు. ఉన్నత విద్యాలయాలను పరిశీలించినా ఇదే పరిస్థితి. కేంద్రప్రభుత్వం అధీనంలోని విశ్వవిద్యాలయాల్లో ఒక్కరే వైస్‌ఛాన్సలర్ దళితుడు కాగా గిరిజనుడు ఒక్కరూ లేరు.

కనుక ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఉండరాదని వాదించడం అంటే శతాబ్దాల కులవివక్షను

> **"మొదటి పాయింటులోనే ఈ అంశంపై వివరణ ఉంది. 'అంటరానితనం' అనే కొలబద్ద ఆధారంగా రూపొందించిన రిజర్వేషన్లలో ఆదాయం స్థాయిని బట్టి పరిమితులు విధించడంలో అర్థం లేదు. ఆదాయాలు పెరిగితే అంటరానితనం పోతుందన్న పొరపాటు భావన ఇందులో ఉంది. బిసిలకు వర్తించే క్రీమీ లేయర్ దళిత, గిరిజనులకు వర్తించదు."**

పరోక్షంగా సమర్థించడమే అవుతుంది.

(3) ఉన్నత ఆదాయాల స్థాయికి చేరుకో గలిగివారికి ప్రమోషన్లలో రిజర్వేషన్లను వర్తింప జేయకూడదని సుప్రీం తీర్పు చెప్పడం సమంజస మేనని భావిస్తున్నవారున్నారు.

మొదటి పాయింటులోనే ఈ అంశంపై వివరణ ఉంది. 'అంటరానితనం' అనే కొలబద్ద ఆధారంగా రూపొందించిన రిజర్వేషన్లలో ఆదాయం స్థాయిని బట్టి పరిమితులు విధించ డంలో అర్థం లేదు. ఆదాయాలు పెరిగితే అంటరానితనం పోతుందన్న పొరపాటు భావన ఇందులో ఉంది. బిసిలకు వర్తించే క్రీమీ లేయర్ దళిత, గిరిజనులకు వర్తించదు. రాజ్యాంగంలో దీనికి సంబంధించి ఎట్టి ప్రస్తావన లేదు. రిజర్వేషన్లలో ఆదాయాల కొలబద్ద – దీనినే క్రీమి లేయర్ అని అంటారు – అనేది మండల కమిషన్ నివేదిక సందర్భంగా ముందుకు వచ్చింది. ఈ కమీషన్ బిసిలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై ఏర్పాటు చేసింది. 1993లో ఏడాదికి కుటుంబ ఆదాయం రు. లక్ష దాటితే క్రీమిలేయర్ అన్నారు. 2017లో దానిని రు. 8 లక్షలకు పెంచారు. ఎంతసవరించినా అంటరానితనాన్ని అది నిర్మూలించగలిగిందా? అందుకు ఎంత బలమైన సామాజిక విప్లవం అవసరమో మనం గ్రహించాలి. మండల్ కమిషన్‌పై సుప్రీం ఇచ్చిన తీర్పులో సైతం 'క్రీమి లేయర్' అనేది దళిత, గిరిజనులకు వర్తించదని స్పష్టంగా ఉంది.

నిజానికి ఈ కాలంలో కుల దురంహకారం మరింత విజృంభించి వెర్రితలలు వేస్తోంది. కులాంతర వివాహం చేసుకున్న వారిని నరికి చంపెయ్యమని ఆదేశించే ఖాప్ పంచాయత్‌లు, అల్లుడిని కడతేర్చిన మామలు, కన్నకూతుర్నే నరికే తండ్రులు మనకి కనబడుతున్నారు. ఇలా శిక్షించడం సబబేనంటూ బరితెగించి కులదురం హకారులు రోడ్లెక్కుతున్నారు. సోషల్‌మీడియాలో వెర్రి కూతలు కూస్తున్నారు. ఉన్నత విద్యాల యాల్లో రోహిత్ వేముల వంటి దళిత విద్యార్థుల



బాబూ జగ్జీవన్‌రాం

ఆత్మహత్యలు, దళితులపై పెరుగుతున్న అత్యా చారాలు మన ముందు కనిపించే వాస్తవ చిత్రం. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోవడం, ఖాళీలు కూడా భర్తీగాక పోవడం వలన దళిత గిరిజనులకు గతంలో దక్కిన పోటీ ఉద్యోగాలు కూడా ఇప్పుడు దక్కకుండా పోతున్నాయి. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేసేదిలేదని కార్పొరేట్లు గట్టిగా చెప్తున్నాయి. ఇది నయా ఉదారవాద విధానాల పర్యవసానం. దళిత, గిరిజనులు ఆర్థికంగా ముందుకు పోతున్నారనే వాదన కూడా వాస్తవ దూరమే. ఒక దళిత కుటుంబం చేసే ఖర్చును ఒక సవర్ణ కుటుంబం చేసే ఖర్చుతో పోల్చి చూస్తే 1999–2000లో వ్యత్యాసం 38 శాతం ఉంది. 2011–12 వచ్చేసరికి ఇది 37 శాతం ఉంది. ఏమంత తేడా వచ్చింది గనుక?

గిరిజనుల విషయంలోనైతే ఈ వ్యత్యాసం 49 నుండి 53 శాతానికి పెరిగింది కూడా. కనుక జనరల్‌గా సమాజంలో ఉన్న వెనుకబాటు తనానికి, అంటరానితనంతోను, సమాజానికి దూరంగాను ఉండే దళిత, గిరిజనుల వెనకబాటు తనానికి గల తేడాను మనం చూడాలి.

(4) సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులో ఎస్సీ ఎస్టీల ప్రమోషన్ల అమలుకు సంబంధించి, క్రీమీ లేయర్ కొలబద్దలకు సంబంధించి నిర్ణయించు కునే అవకాశం ఆయా రాష్ట్రాలకు కల్పించింది. దళిత, గిరిజన తరగతులకు అనుకూలంగా చట్టా లను రూపొందించి అమలుచేయ డంలో వివిధ రాష్ట్రాలలో రకరకాల అనుభవాలు ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో మాయావతి ప్రభుత్వ హయాంలో దళిత, గిరిజనులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించారు. దానిపై అలహాబాదు హైకోర్టు ఆ ఉత్తర్వులు చెల్లవని తీర్పునిచ్చింది. ఈలోపు సమాజ్‌వాది పార్టీ అధికారం చేబట్టింది. హైకోర్టు తీర్పుని అడ్డం పెట్టుకుని అంతకుముందు ప్రమోషన్లు పొందినవారందరినీ మళ్లీ వెనక్కి తగ్గించింది (డిమోట్) అంతే తప్ప ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చెయ్యలేదు. బీహార్ ప్రభుత్వం 23.07.2018న దళిత, గిరిజన ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వే షన్లు కల్పిస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. కర్నాటక లో కూడా యు.పి.లో మాదిరిగానే వచ్చిన ప్రమోషన్‌లు కోల్పోయిన దళిత, గిరిజన ఉ ద్యోగులు 4000 మంది ఉన్నారు. ఇంకో 5000 మంది ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. కాని అక్కడి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది.

కనుక ఆయారాష్ట్రాల ప్రభుత్వాల ఇష్టా ఇష్టాలకు వదలివేయవలసిన అంశం కాదిది అని అనుభవాలు సూచిస్తున్నాయి.

(5) ఈ మధ్యకాలంలో అత్యాచారాల నిరోధక చట్టం విషయంలో కూడా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్త నిరసనలకు, ఆందోళన లకు దారితీసింది. కొందరు ప్రాణాలను సైతం కోల్పోయారు. మళ్లీ ఇప్పుడీ తీర్పువచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానం 'సామాజిక న్యాయం' అంశాన్ని, తానిచ్చిన రెండు తీర్పుల ప్రతికూల ప్రభావాన్నిపునఃపరిశీలించాల్సిన అవసరముంది. కేంద్రప్రభుత్వం ఈ తీర్పు విషయంలో మౌనం గా ఉండడం బట్టి బిజెపి 'దళిత అను కూల ముసుగు' ఎంత కపటమైనదో స్పష్టం అవుతోంది.

కాంగ్రెస్ పార్టీ సైతం ఇంతవరకూ తన వైఖరిని తెలియజేయలేదు. సిపిఐ (ఎం) ఇటీవల జరిగిన కేంద్రకమిటీ సమావేశంలో ఈ తీర్పుపై స్పష్టంగా స్పందించింది. దళిత, గిరిజనులకు ప్రమోషన్లలో 'క్రీమిలేయర్'ను వర్తింపజేయడం సరైంది కాదని, ఇప్పుడు ప్రమోషన్లతో మొదలైన ఈ వాదన రానున్న రోజుల్లో మొత్తం అన్ని రిజర్వేషన్లకూ పాకుతుందని, దళిత గిరిజనులకు ఇప్పటికే అరకొరగా అమలు జరుగుతున్న సామాజిక న్యాయం ఇంకా అన్యాయమై పోతుం దని సిపిఐ (ఎం) తన అభిప్రాయాన్ని తెలియ జేసింది. సుప్రీంకోర్టు ఈ విషయాన్ని పున: పరిశీలించాలని డిమాండ్ చేసింది. ❃

# వ్యవసాయ సంస్కరణలతోనే సంక్షోభ పరిష్కారం

**ఎ. కోటిరెడ్డి**



రచయిత
ప్రజాశక్తి సహాయ సంపాదకులు

ఆర్థికరంగంలో నెలకొంటున్న పరిణామాలు సంక్షోభ ఘంటికలను మోగిస్తున్నాయి. ప్రభుత్వం ఈ సూచనలను పట్టించుకోకపోగా మరింతగా సంక్షోభంలో కూరుకుపోయే విధానాలను అనుసరిస్తున్నది. సంక్షోభ సూచనలు మొత్తం ఆర్థికరంగంపై తీవ్ర ప్రభావం చూపటంతోపాటు ప్రత్యేకంగా వ్యవసాయరంగాన్ని కోలుకోలేని దుస్థితిలోకి నెడుతున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతాంగం, వ్యవసాయ కార్మికులు, వ్యవసాయ రంగంపై ఆధారపడిన ప్రజానీకాన్ని తీవ్రమైన కడగండ్లకు గురిచేస్తున్నాయి.

**వ్యవసాయరంగ పరిణామాలు**

ప్రభుత్వం అందిస్తున్న లెక్కలే వ్యవసాయ సంక్షోభ తీవ్రతను కళ్ళకు కడుతున్నాయి. 2011-12 , 2014-15 సంవత్సరాల మధ్యకాలంలో 5.2 శాతంగా ఉన్న వ్యవసాయాభివృద్ధి 2014-15, 2017-18 సంవత్సరాల మధ్యకాలంలో 2.5 శాతంకు దిగజారింది. 2013 జులై నుండి 2018 జులై మధ్యకాలంలో హోల్‌సేల్ ధరల సూచీ ప్రకారం 11.07 శాతంగా ఉన్న వ్యవసాయోత్పత్తుల ధరలు మైనస్ 4.04 శాతానికి పడిపోయాయి. 2019 నాటికి వ్యవసాయాదాయాలను రెట్టింపు చేస్తామని మోడి గొప్పగా చెబుతుండగా వాస్తవంలో వ్యవసాయోత్పత్తుల ధరలు ఈ విధంగా దిగజారిపోతున్నాయి. ఇపుడు 2019 గడువును పక్కన పెట్టి 2022 నాటికి రైతాంగ ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ విధంగా ప్రకటనలు చేస్తుండగా మరోవైపు రైతాంగం కనీవినీ ఎరుగని సంక్షోభంతో కునారిల్లిపోతున్నది. రైతాంగ రుణభారం పెరుగుతున్నది. రుణభారం నుండి బయటపడే మార్గం లేకపోవటం, వ్యవసాయం ద్వారా తగిన ఆదాయాన్ని పొంది, కుటుంబాలను సక్రమంగా నడపగలమనే పరిస్థితులు శూన్యం కావటంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఆర్థిక పరిస్థితుల నుండి ఉపశమనం కల్పించాలని రైతాంగం ఆందోళనలు క్రమంగా పెరుగుతున్నాయి. దేశంలోని అనేక ప్రాంతాలలో జరుగుతున్న రైతుల ఆందోళనలను ప్రభుత్వాలు నిరంకుశంగా అణచివేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, అనేక రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు రైతాంగ సమస్యల పరిష్కారానికి అనేక చర్యలు తీసుకున్నామని గొప్పగా ప్రచారం చేసుకొంటూ అమలుకు మాత్రం అడుగు కదపటం లేదు. ఫలితంగా రైతాంగ పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. బిజెపితో పాటు వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ బూర్జువా పార్టీలు కూడా రైతాంగ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవటం లేదు.

ఈ విధంగా ఒకవైపున వ్యవసాయాభివృద్ధి తగ్గిపోవటం, మరోవైపున వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవటంతో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతాంగం అప్పులపాలవుతున్నారు. ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. సంక్షోభం నుండి బయటపడటం కోసం క్రమంగా ఉద్యమాలను మార్గంగా ఎంచుకోవటంతో దేశంలోని అనేక ప్రాంతాలలో రైతాంగ పోరాటాలు పెరుగుతున్నాయి. వ్యవసాయంలోకి యంత్రాల ప్రవేశం పెరగటం వలన పనులు తగ్గిపోవటంతో వ్యవసాయ కార్మికులలో నిరుద్యోగం పెరుగుతున్నది. ఒకవైపున అభివృద్ధిని గురించి పాలకులు గొప్పలు చెప్పుకొంటుండగా మరోవైపున దరిద్రం పెరుగుతున్నది. అధికారిక నివేదికల ప్రకారం పోషకాహారం అందని వారు 15 శాతానికి పైగా, అంటే సుమారు 20 కోట్లమంది ఉన్నారు. వాస్తవంలో ఇంతకు రెట్టింపుకు సంఖ్యలో పేదలకు పోషకాహారం అందటం లేదని ఇతర అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పునరుత్పత్తి చేసే వయసులో ఉన్న 15-49 సంవత్సరాల మధ్య వయసు మహిళలలో 51.9 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు.వయసుకు తగిన ఎత్తులేక గిడసబారిన పిల్లలు 38.4 శాతం, ఎత్తుకు తగిన బరువులేక కుంచించుకుపోతున్న పిల్లలు 21 శాతం మంది ఉన్నారు. 2017 ఆకలి సూచీలో 119 దేశాలలో మనదేశం 100వ స్థానంలో ఉన్నది. స్వాతంత్ర్యం సాధించి 70 సంవత్సరాలు గడిచిన తర్వాత ఇటువంటి పరిస్థితులు ఏర్పడటానికి కారణం ఏమిటనేది పరిశీలించాల్సిఉంది.

**పెట్టుబడిదారీ అభివృద్ధి ఫలితం**

స్వాతంత్ర్యానంతరం దేశంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని అనుసరించింది. వ్యవసాయ రంగంలో కూడా పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయటానికి ప్రయత్నం చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్వాతంత్ర్య పోరాట కాలంలో వాగ్దానం చేసిన విధంగా భూ సంస్కరణలను అమలు చేయక పోవటంతో పేదలకు భూములు దక్కలేదు. ఫలితంగా ఒకవైపున కోట్లాది మంది వ్యవసాయ కార్మికులు, పేదరైతులు భూములు పొందలేదు. మరోవైపున భూకేంద్రీకరణలో కొద్ది మార్పులు జరిగినా భూస్వాములు, ధనికరైతుల చేతుల్లో కోట్లాది ఎకరాల భూముల కేంద్రీకరణ కొనసాగుతూనే ఉన్నది. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసమంటూ ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు, రుణాలు, ఆధునిక వ్యవసాయం కోసమంటూ ప్రవేశపెట్టిన ట్రాక్టర్లు, యంత్రాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, రసాయనిక ఎరువులు, మేలుజాతి విత్తనాలు తదితరాలు, వాటి ఫలితాలను పై తరగతులు ఎక్కువగా స్వంతం చేసుకున్నాయి. పేద, మధ్య తరగతి రైతులు అప్పుల పాలవటం, భూములు అమ్ముకొని వ్యవసాయ కార్మికులలో కలవటం, అప్పులు తీర్చే దారిలేక ఆత్మహత్యలు చేసుకోవటం పెరిగింది. పాలకవర్గాలు అనుసరించిన ఈ విధానాల ఫలితంగా వ్యవసాయ రంగంలో ఒకవైపు భూస్వాములు, ధనికరైతుల చేతుల్లో భూమి, సంపద కేంద్రీకరణ పెరిగింది.

**"గతంలో విత్తన పరిశోధన ప్రధానంగా ప్రభుత్వ రంగంలో జరిగేది. అది క్రమంగా ప్రైవేటు వారి చేతికిపోయింది. ఎరువుల ధరలను భారీగా పెంచటం రైతాంగానికి పెనుభార మైంది. గత దశాబ్దకాలంలో ఎరువుల ధరలు 2-3 రెట్లకు మించి పెరిగాయి. పురుగుమందుల ధరలు అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్నాయి. విద్యుత్, డీజిల్ తదితరాల ధరలు పెరిగి రైతాంగానికి పెనుభారంగా మారాయి."**



సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న రైతులు

మరోవైపు వ్యవసాయ కార్మికులు, పేదరైతుల పరిస్థితులు దిగజారుతూ వచ్చాయి.

1990వ దశాబ్దం నుండి కేంద్రంలోనూ, ఎక్కువ రాష్ట్రాలలోనూ అధికారంలోకి వచ్చిన పాలకవర్గ పార్టీల ప్రభుత్వాలు సరళీకరణ విధా నాలను అమలు చేయటం ప్రారంభించాయి. ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోయాయి. వ్యవసాయ రంగానికి విద్యుత్, సాగునీరు అందించటం, మురుగునీటిని తరలించే సదుపాయాలు కలిగిం చటం తదితర మౌలిక సదుపాయాల కల్పన నుండి ప్రభుత్వం క్రమంగా ఉపసంహరించు కొంటూ, ప్రైవేటురంగానికి పెద్దపీట వేస్తున్నది. గతంలో విత్తన పరిశోధన ప్రధానంగా ప్రభుత్వ రంగంలో జరిగేది. అది క్రమంగా ప్రైవేటు వారి చేతికిపోయింది. ఎరువుల ధరలను భారీగా పెంచటం రైతాంగానికి పెనుభారమైంది. గత దశాబ్దకాలంలో ఎరువుల ధరలు 2-3 రెట్లకు మించి పెరిగాయి. పురుగుమందుల ధరలు అడ్డూ అదుపూ లేకుండా పెరుగు తున్నాయి. విద్యుత్, డీజిల్ తదితరాల ధరలు పెరిగి రైతాంగానికి పెనుభారంగా మారాయి. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు తదితర యంత్రాల ధరలు, అద్దెలూ పెరిగాయి. ఈ విధంగా వ్యవసాయో త్పత్తికి అవసరమైన వాటి ధరలు పెరిగాయి. మరోవైపు వ్యవసాయోత్పత్తుల ధరలు ఆ మోతాదులో పెరగటం లేదు. కొన్ని సందర్భాలు, కొన్ని పంటలకు తగ్గుతున్నాయి. ప్రభుత్వం కొన్ని వ్యవసాయోత్పత్తులకు ధరలు నిర్ణయిస్తున్నప్పటికీ, పెరిగిన ధరలకు, ప్రభుత్వం నిర్ణయిస్తున్న ధరలకు సంబంధం ఉండటం లేదు. పంటలు మార్కెట్‌లోకి వచ్చే సీజన్‌లో నిర్ణయించిన ధరలకన్నా వ్యాపారులు తక్కువ ధరలకు పంటలను కొనుగోలు చేస్తున్నపుడు ప్రభుత్వం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుండి పంటలను కొనుగోలు చేయటం లేదు. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా వ్యాపారుల నుండి మాత్రమే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా ధరలు దిగ్గోయటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. ఫలితంగా ఒకవైపున వ్యవసాయ ఖర్చులు పెరగటం, మరోవైపున ఉత్పత్తులకు తగిన ధరలు రాకపోవటంతో రైతాంగం అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి జారిపోతున్నది.

వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి బయట పడవేయటానికి అవసరమైన సిఫా ర్సులు చేయటం కోసం వామపక్షాల మద్దతుతో అధికారంలో ఉన్న యుపిఎ-1 ప్రభుత్వం ప్రము ఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ కమిషన్‌ను నియమించింది. వ్యవసాయ సంక్షోభ కారణాలను లోతుగా విశ్లేషించి నివేదికను రూపొందించిన ఆ కమిటి సంక్షోభ నివారణకు కొన్ని సిఫార్సులు చేసింది. కమిషన్ సిఫార్సులను అమలుచేస్తే వ్యవసాయ సంక్షోభం నుండి బయటపడటంతో పాటు, దేశాన్ని చుట్టుముదుతున్న ఆర్థిక సంక్షోభాన్ని కూడా నివారించటానికి అవకాశం ఏర్పడుతుంది.

**స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు**

భూసంస్కరణలు అమలుజరిపి, సీలింగ్‌కు మించిన భూములను, వ్యవసాయ యోగ్యమైన బంజరు భూములను వ్యవసాయ కార్మికులు, పేదరైతులకు పంచాలని, వ్యవసాయ భూము లను వ్యవసాయేతర అవసరాలకు మళ్ళించ కుండా చర్యలు తీసుకోవాలని, సాగునీరం దించటం, మురుగునీటిని మళ్ళించటం, జల పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ తదితరాలలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచినపుడే వ్యవసాయ ఉత్పత్తిని పెంచటం సాధ్యపడుతుందని కమిషన్ చెప్పింది. ఎక్కువ పంటలను కనీస మద్దతు ధరల పరిధిలోకి తీసుకురావాలని, ఖర్చులకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని కోరింది. సాగునీరు, భూగర్భ జలాలపై ప్రభుత్వ యాజమాన్యం ఉండాలని, వీటిని అందరికీ సమానంగా పంపిణీ చేయాలని చెప్పింది. గ్రామీణప్రాంతలోని పేదలు, అవసరమైన వారికి 4 శాతం వడ్డీకి ప్రభుత్వం రుణాలు అందించాలని, ప్రైవేటు రుణాల వసూలుపై ఆంక్షలు విధించాలని, ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన వారికి సహాయం అందించటం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరింది. ప్రభుత్వం పంపిణీ చేసే భూములకు మహిళలను కూడా కలిపి జాయింటు పట్టాలు మంజూరు చేయాలని, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఇతర పథకాలను మహిళలకు అందిం చాలని తదితర సిఫార్సులను పొందుపరిచిన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. కమిషన్‌ను నియమించిన యుపిఎ ప్రభుత్వం ఆ కమిషన్ చేసిన సిఫార్సులను అమలుచేయటం కోసం శ్రద్ధ చూయించలేదు. యుపిఎ ప్రభుత్వ వైఫల్యాన్ని చక్కగా వినియోగించుకున్న బిజెపి తాను అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫా ర్సులను అమలు చేస్తానని 2014 ఎన్నికలలో విస్తృతంగా ప్రచారం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత సిఫార్సుల అమలు పట్ల యుపిఎ చూపిన శ్రద్ధ కూడా బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చూపలేదు. పైగా ఖర్చులకు

అదనంగా 50 శాతం కలిపి వ్యవసాయోత్పత్తులకు ధరలు నిర్ణయించటం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా అఫిడవిట్ దాఖలు చేసింది.

బిజెపి ప్రభుత్వం సరళీకరణ విధానాలను మరింత వేగంగా అమలు చేయటం వలన వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రమైంది. ఫలితంగా రైతాంగ స్థితిగతులు దిగజారటంతో దేశంలోని అనేక ప్రాంతాలలో రైతులు పెద్ద సంఖ్యలో కదిలి, వివిధ రకాలుగా మిలిటెంట్ పోరాటాలలో పాల్గంటున్నారు. 2016లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రలలో రైతుల సమ్మె, మాందసౌర్‌లో రైతులపై జరిపిన కాల్పులలో 6 గురు మరణించారు. రైతాంగం, సాధారణ ప్రజలలో ప్రభుత్వాలపై వ్యతిరేకత పెరిగిన నేపథ్యంలో రైతుల రుణాలను మాఫీ చేస్తామని బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. కాని ఆచరణలో జరిగింది లేదు. 2018 మార్చి నెలలో జరిగిన మహారాష్ట్ర రైతుల లాంగ్‌మార్చ్ వ్యవసాయ సంక్షోభ తీవ్రతను దేశంలోని అన్ని తరగతుల ప్రజల దృష్టికి తెచ్చింది. అనంతరం సెప్టెంబరు 5న కిసాన్‌సభ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన భారీ రైతుర్యాలీ, యుపి, ఉత్తరాఖండ్, హర్యానా తదితర రాష్ట్రాలకు చెందిన రైతులు వేలసంఖ్యలో కదిలి, అక్టోబరు 2న పార్లమెంటు ముట్టడికి పూనుకోవటం తదితరాలు సంక్షోభ ఫలితంగా రైతాంగంలో పెరుగుతున్న అసంతృప్తికి అద్దం పడుతున్నాయి.

**"స్వామినాథన్ కమిషన్ సాగు ఖర్చులు, రైతు కుటుంబ శ్రమ, భూమికౌలు, పెట్టుబడిపై వడ్డీని కూడా ఖర్చులో కలిపి, ఆ ప్రాతిపదికగా అదనంగా 50 శాతం కలిపి ఉత్పత్తులకు ధరలు నిర్ణయించాలని చెప్పింది. దీనిని సి2 అంటారు. ప్రభుత్వం దీనిని పరిగణనలోకి తీసుకోకుండా సాగుఖర్చు, రైతు కుటుంబ శ్రమను మాత్రమే పరిగణనలోకి తీసుకొని-దీనిని ఎ2+ ఎఫ్ఎల్ అంటారు- మద్దతు ధరలను నిర్ణయించింది."**



ఉపాధి హామీ పనులలో పాల్గొంటున్న వ్యవసాయ కార్మికులు

### రైతులను మోసం చేస్తున్న మోడి

ఈ అసంతృప్తిని గమనించిన కేంద్ర ప్రభుత్వం రానున్న ఎన్నికలలో జరిగే నష్టాన్ని నివారించటం కోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్నట్లు నాటకం ఆడుతున్నది. కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ఖర్చులకు 50 అదనంగా కలిపి ఖరీఫ్, రబీలలో రైతుల పంటలకు గిట్టుబాటు ధరలను నిర్ణయించామని ప్రభుత్వం ప్రచారం చేసుకొంటూ రైతులను మోసం చేస్తున్నది. స్వామినాథన్ కమిషన్ సాగు ఖర్చులు, రైతు కుటుంబశ్రమ, భూమికౌలు, పెట్టుబడిపై వడ్డీని కూడా ఖర్చులో కలిపి, ఆ ప్రాతిపదికగా అదనంగా 50 శాతం కలిపి ఉత్పత్తులకు ధరలు నిర్ణయించాలని చెప్పింది. దీనిని సి2 అంటారు. ప్రభుత్వం దీనిని పరిగణనలోకి తీసుకోకుండా సాగుఖర్చు, రైతు కుటుంబశ్రమను మాత్రమే పరిగణనలోకి తీసుకొని-దీనిని ఎ2+ఎఫ్ఎల్ అంటారు- మద్దతు ధరలను నిర్ణయించింది. భూమికౌలు, పెట్టుబడిపై వడ్డీని లెక్కించలేదు. దానితో వాస్తవంగా నిర్ణయించాల్సిన దానికన్నా 20 నుండి 30 శాతం తక్కువగా మద్దతు ధరలు నిర్ణయించారు. ఫలితంగా వివిధ పంటలకు ఎకరాకు 10 వేల నుండి 50 వేల రూపాయల వరకు తక్కువ ఆదాయాన్ని నమోదు చేసే పరిస్థితి ఏర్పడుతుంది. వ్యవసాయోత్పత్తులు మార్కెట్‌లోకి వస్తున్న తరుణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నపుడు ప్రభుత్వం మార్కెట్‌లోకి వచ్చి, మద్దతు ధరలకు రైతాంగం నుండి ఉత్పత్తులను కొనుగోలు చేయటం లేదు. రైతుల నుండి పంటలను కొనుగోలు చేసే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకొని, ప్రైవేటు వారికి ఆ బాధ్య తను అప్పగిస్తున్నది. ఫలితంగా సంక్షోభం నుండి రైతాంగానికి ఉపశమనం లభించటం లేదు. ఎక్కువ పంటలకు వారి పెట్టుబడులపై నామ మాత్రమైన ఆదాయం మాత్రమే రావటం, కొన్ని పంటలకు పెట్టుబడులు కూడా రాకపోవటం వారి కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నది.

ప్రభుత్వం అనుసరిస్తున్న ఎగుమతి, దిగుమతుల విధానం కూడా వ్యవసాయోత్పత్తుల ధరలపై ప్రభావం చూపుతున్నది. ప్రభుత్వం కొన్ని దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నది. ఈ ఒప్పందాల వలన ఇతర దేశాల నుండి వ్యవసాయ సరుకులు స్వేచ్ఛగా దేశంలోకి వస్తున్నాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలలోని ప్రభుత్వాలు తమ దేశ రైతాంగానికి వివిధ రూపాలలో భారీ మొత్తంలో సబ్సిడీలిస్తున్నాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో ఆ దేశాల సరుకుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. ఆ దేశాలతో పోలిస్తే మనదేశంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు నామమాత్రమే. దానితో పాటు వరి, గోధుమ, పప్పులు, మరికొన్ని పంటల దిగుబడులు మనదేశం కన్నా అమెరికా, చైనా, బ్రెజిల్ తదితర దేశాలలో చాలా ఎక్కువగా ఉన్నాయి. సబ్సిడీలు, దిగుబడులలో వ్యత్యాసం వలన ఆ దేశాల నుండి దిగుమతి అవుతున్న సరుకులతో మన వ్యవసాయోత్పత్తులు పోటీ పడలేకపోతున్నాయి. ఫలితంగా రైతాంగ ఆదాయాలు మరింతగా పడిపోతున్నాయి.

రైతాంగానికి తగినంత ఆదాయం రాకపోవటం వారిపై మాత్రమే కాక మొత్తం గ్రామీణ ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నది. ఆదాయం తగినంత రాకపోవటం వలన గృహ నిర్మాణం, రిపేర్లు, బట్టలు, కొత్త వస్తువుల కొనుగోలు, పండుగలు, ఫంక్షన్‌లు తదితరాలు జరుపుకోవటానికి ముందుకురారు. ఇవి ఆయా

> **❝ భూ సంస్కరణలను అమలుచేయటం ద్వారా దేశంలో దరిద్రాన్ని తగ్గించటం, సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించటం సాధ్యమౌతుంది. జపాన్, దక్షిణకొరియా, బ్రెజిల్, క్యూబా, చైనా తదితర దేశాలలో భూసంస్కరణలను అమలు చేయటం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమైంది. మనదేశంలో కూడా భూ సంస్కరణలను అమలు చేయటం ద్వారా సత్వర ఆర్థికాభివృద్ధి సాధించటం, దేశ పారిశ్రామికీకరణ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటం సాధ్యం అవుతుంది.❞**

వృత్తులు, ఉపాధులపై ఆధారపడిన వారి ఆదాయాలనుదెబ్బతీస్తాయి. గ్రామీణప్రాంతంలో విస్తారంగా ఉన్న భూమిలేని వ్యవసాయ కార్మికులు, ఇతర వృత్తులు, ఉపాధులు చూసుకునే వారు ఎదుగుబదుగు లేనిస్థితిలో ఉంటారు. అందువలన వ్యవసాయరంగ సంక్షోభాన్ని నివారించటం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటం కోసం వ్యవసాయోత్పత్తులకు 50 శాతం అదనంగా ధరలు నిర్ణయించి, ప్రభుత్వం కొనుగోలు చేయటం తప్పనిసరి. అపుడు రైతాంగ పరిస్థితులు మెరుగుపడతాయి. మొత్తంగా వ్యవసాయ రంగంలో ఉన్న ప్రజల జీవన పరిస్థితులను మార్చటం, దేశం వేగంగా ఆర్థికాభివృద్ధిని సాధించటం అనేది భూసంస్కరణలపై ఆధారపడి ఉంది.

**భూసంస్కరణల ప్రభావం**

భూ సంస్కరణలను అమలుచేయటం ద్వారా దేశంలో దరిద్రాన్ని తగ్గించటం, సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించటం సాధ్యమౌతుంది. జపాన్, దక్షిణకొరియా, బ్రెజిల్, క్యూబా, చైనా తదితర దేశాలలో భూసంస్కరణలను అమలు చేయటం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమైంది. మనదేశంలో కూడా భూసంస్కరణలను అమలు చేయటం ద్వారా సత్వర ఆర్థికాభివృద్ధి సాధించటం, దేశ పారిశ్రామికీకరణ, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటం సాధ్యం అవుతుంది. దేశంలో సుమారుగా 40 కోట్ల ఎకరాలకు పైగా సాగుభూమి ఉంది. పది ఎకరాలకు పైబడిన కమతాలు-నీటి పారుదల సదుపాయం ఉన్నదిగా లెక్కిస్తే-5 శాతం ఉంటాయి. వీరిచేతిలో 20 శాతం వరకు భూమి-సుమారుగా 8 కోట్ల ఎకరాలు- ఉంటుంది. సాగుకు లాయకైన బంజర్లు మరో 10 కోట్ల ఎకరాల వరకు ఉంటాయి. గ్రామీణప్రాంతంలో భూమిలేని వ్యవసాయ కార్మికులు, ఎకరం, అర ఎకరం ఉన్న పేదరైతు కుటుంబాలు పదికోట్ల వరకు ఉంటాయి. ప్రభుత్వం భూసంస్కరణలను అమలు చేసి, మిగులు భూములు, బంజరు భూములను వ్యవసాయ కార్మికులు, పేదరైతు కుటుంబాలకు పంచితే కుటుంబానికి సగటున రెండు ఎకరాల వరకు సాగుభూమి లభిస్తుంది కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున 10 కోట్ల కుటుంబాలకు సాగుభూమి దక్కితే ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితి, దేశ ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. భూమి చేతికి రావటంతో తమ స్వంతభూమిలో ఉత్పత్తిని, తమ కుటుంబ ఆదాయాలను పెంచుకోవటం కోసం కష్టపడి పనిచేస్తారు. ఫలితంగా వ్యవసాయ కార్మికులు, పేదరైతులకు సంవత్సరంలో అంతకు ముందు లభించిన పనిదినాల కన్నా అదనపు పనిదినాలు, అదనపు ఆదాయం లభిస్తుంది. కూలిపనులకు వెళ్ళినపుడు భూ యజమాని కూలీలకు కూలి మాత్రమే చెల్లించి, వచ్చిన ఆదాయాన్నంతా తాను స్వంతం చేసుకుంటాడు. ఇపుడు భూమికి వారే యజమానులు కాబట్టి వచ్చిన ఆదాయమంతా వారికే దక్కుతుంది.

మరో10 కోట్ల వ్యవసాయ కార్మిక కుటుంబాలున్నాయి. వీరికి పనిరోజులు, కూలిరేట్లు తక్కువగా ఉండటంతో వారి కుటుంబ ఆదాయం తక్కువగా ఉంటున్నది. ఫలితంగా వారి కుంటుంబాలకు అవసరమైన ఆహారాన్ని కూడా వినియోగించుకోలేకపోతున్నారు. ఇక పారిశ్రామిక సరుకుల వినియోగం నామమాత్రమే. భూమి రావటం, కూలిరేట్లు పెరగటం ద్వారా ఆ కుటుంబాల ఆదాయం పెరిగితే వారి ఆహార అవసరాలను తీర్చుకోవటంతో బాటు పారిశ్రామిక సరుకులను కూడా కొంటారు. ఇందుకోసం కుటుంబ అవసరాలు తీర్చే విధంగా కనీస వేతనాలను నిర్ణయించి, అమలు జరపాలి. పనిలేని రోజులలో ఉపాధిహామి పనులు కల్పించాలి. సంవత్సరంలో ప్రతి వ్యవసాయ కార్మికునికి 200 రోజుల పని గ్యారంటీతో పాటు రోజుకు 350 రూపాయలను కనీస వేతనంగా నిర్ణయించి, అమలు చేయాలి. కౌలురైతులు కూడా పెద్దసంఖ్యలో ఉన్నారు. వివిధ రాష్ట్రాలలో 9 నుండి 34 శాతం వరకు కౌలురైతులున్నారు. దేశంలో కెల్లా అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ లో 34 శాతం ఉన్నారు. వీరికి కౌలుభద్రత లేదు. భూ యజమానులు ప్రతి సంవత్సరం కౌలురేట్లు పెంచటంతో వీరికి అతి తక్కువ ఆదాయం మాత్రమే వస్తున్నది. కొన్ని సంవత్సరాలలో, కొన్ని పంటలలో తగిన దిగుబడులు రాకపోవటం, ప్రకృతి వైపరీత్యాలు తదితరాల వలన తమ పెట్టుబడులను కూడా పోగొట్టుకొంటున్నారు. వీరికి కౌలు గ్యారంటి, నిర్ణీతమైన కౌలురేట్లను నిర్ణయిస్తే వారు నిర్ణీత ఆదాయం పొందటానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా గ్రామీణప్రాంతంలోని కష్టజీవుల ఆదాయాలు పెరిగే చర్యలు తీసుకుంటే అది అనేక ఆర్థికమార్పులకు దారితీస్తుంది.

ఆదాయం పెరిగిన కుటుంబాలు తమ అవసరాలు తీర్చుకోవటం కోసం ఆహార, వినియోగ సరుకులను కొనుగోలు చేస్తారు. దాదాపు 20 కోట్ల కుటుంబాలు వినియోగ సరుకులను అదనంగా కొనుగోలు చేయటం ప్రారంభిస్తే దేశీయ మార్కెట్ అంగలు పంగలతో విస్తరిస్తుంది. విస్తరించిన మార్కెట్ అవసరాలను తీర్చటానికి అదనంగా సరుకులను ఉత్పత్తి చేయాల్సివస్తుంది. అందుకోసం ఉన్న పరిశ్రమలలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచటం, అదనంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సిరావటంతో అదనంగా కార్మికులు కావాల్సివస్తారు. పెద్ద సంఖ్యలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయటంతో కోట్లాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు దొరుకుతాయి. కొత్తగా పనులలోకి ప్రవేశించిన కార్మికులు పొందే జీతాలు వారి కుటుంబాల కొనుగోలు శక్తిని పెంచుతాయి. తిరిగి వారి అవసరాలను తీర్చటం కోసం ఉత్పత్తిని పెంచవలసిరావటం, అందుకోసం తిరిగి పరిశ్రమల నిర్మాణం, ఈ విధంగా చైన్ రియాక్షన్‌లాగా ఈ క్రమం జరగుతుంటుంది. ఈ విధంగా భూసంస్కరణల అమలు దేశప్రజల కొనుగోలు శక్తిని పెంచటానికి, వారి జీవన ప్రమాణాలు మెరుగు పడటానికి, దేశ పారిశ్రామికీకరణ వేగం పుంజుకోవటానికి దోహదం చేస్తుంది.

అందువలన ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్పటం ఆపి వ్యవసాయరంగంలోని ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి. గిట్టుబాటు ధరలు నిర్ణయించి, వ్యవసాయోత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఉపాధి హామీ పనిరోజులు, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నపుడు ఇవన్నీ అమలుచేయటానికి నిధులెక్కడివని ప్రభుత్వం,

(మిగతా 23వ పేజీలో)

# శబరిమలపై కాంగ్రెస్, బిజెపి అవకాశవాదం

జె. జగదీష్



రచయిత
ప్రజాశక్తి న్యూఢిల్లీ ప్రతినిధి

దేశంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో ఒకటైన కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ సెప్టెంబర్ 23న దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచనల తీర్పు ఇచ్చింది. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఏ కొద్దో సనాతన సంఘాలు మినహా, అన్ని రాజకీయ పార్టీల నేతలు, మెజార్టీ హిందూత్వ సంఘాలతో సహా అన్ని సంఘాలు స్వాగతించాయి. చారిత్రాత్మక తీర్పుగా అభి వర్ణించాయి. బిజెపి వంటి పార్టీల నేతలైతే తమ పార్టీ సిద్ధాంతంలో ఉన్నదానినే సుప్రీం కోర్టు తీర్పుగా చెప్పిందని ప్రగల్భాలు పలికారు. ఇదంతా ఒక ఎత్తైతే.. ప్రస్తుతం కేరళలో ఇదే తీర్పుపై పూర్తి విరుద్ధంగా జరుగుతున్నది. దాడులతో కూడిన హింసతో కేరళలో భయో త్పతం చెలరేగుతున్నది. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పుడు స్వాగతించామని చెప్పిన పార్టీలే, ఇప్పుడు అదే తీర్పుకు విరుద్ధంగా ఆందోళనతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇది ఆ రెండు పార్టీల ద్వంద్వ వైఖరికి అద్దం పడుతున్నది. ఈ రెండు పార్టీలు అమాయక ప్రజలను రెచ్చగొట్టి తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయి.

**శబరిమల కేసు పూర్వాపరాలు**

1990లో శబరిమల ఆలయంలోకి మహిళలకు ప్రవేశంపై నిషేధాన్ని విధించా లంటూ ఎస్.మహేంద్రన్ అనే వ్యక్తి కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన పిల్ దాఖలు చేసేందుకు కారణం అప్పటి "మాజీ దేవస్థాన కమిషనర్ చంద్రిక మనవరాలు అన్నప్రాసన కార్యక్రమం ఆలయం వద్ద నిర్వహించారు. అప్పుడు అక్కడే ఆమె కుమార్తె, యువ మహిళ బంధువులు ఉన్నారు. సామాన్య ఆడవాళ్లను ఆలయంలోకి రానివ్వరు. మరి వారు ఎలా వెళ్లారు? వారికో న్యాయం, తమకో న్యాయమా?" అంటూ ఆయన ప్రశ్నించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ పరిపూర్ణన్, జస్టిస్ కెబి మారర్‌లతో కూడిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం 1991 ఏప్రిల్ 5న కొన్ని వయస్సుల మహిళలపై నిషేధాన్ని సమర్థిస్తూ తీర్పుఇచ్చింది. 2006లో జ్యోతిష్కుడు ఒకరు ఆలయంలో దేవప్రశ్నం అనే కార్యక్రమాన్ని నిర్వహించి ఎవరో మహిళ ఆలయంలోకి ప్రవేశించిందన్నారు. వెంటనే కన్నడ నటి జయమాల తాను 1987లో 28 ఏళ్ల వయస్సులో సినిమా షూటింగ్ నిమిత్తం అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి, గర్భ గుడిలో అయ్యప్ప విగ్రహాన్ని పట్టుకొని మొక్కానని బహిరంగానే ప్రకటించడం సంచల నానికి దారి తీసింది. అప్పటి కేరళ ప్రభుత్వం క్రైం బ్రాంచ్‌ను ఈ ఘటనపై విచారణ జరపమని ఆదేశిం చింది. ఇదిలా ఉండగా శబరిమల ఆలయం లోకి 10 నుంచి 50 ఏళ్ల వయసు మధ్య మహిళలకు ప్రవేశం కల్పించాలంటూ ఇండియన్ యంగ్ లాయర్స్ అసోసియేషన్ (ఐవైఎల్ఎ) నేతృత్వంలో ఐదుగురు మహిళ న్యాయవాదులు లక్ష్మీ శాస్త్రి, ప్రేమ్నా కుమారి, భవాన్ సింగ్ దేవ్, భక్తి పాత్రిచీ సేథి, సుధాపాల్ సుప్రీం కోర్టులో 2006 ఆగస్టు 4న పిటిషన్ వేశారు. పిటిషన్‌కు మద్దతుగా సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ సర్కారు 2007 నవంబర్‌లో అఫిడవిట్ దాఖలు చేసింది. 2016 జనవరి11న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎన్‌వి రమణలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మహిళ ప్రవేశాన్ని ఎందుకు నిషేధించారని ప్రశ్నించింది. జనవరి 16న ఐవైఎల్ఎ జాతీయ అధ్యక్షుడు నౌషాద్ అహ్మద్ ఖాన్, పిటిషన్ వేసిన ఐదుగురు మహిళ న్యాయవాదుల్లో ముగ్గురు లక్ష్మీ శాస్త్రి, ప్రేమ్నా కుమారి, సుధాపాల్ తమకు దాదాపు 500 బెదిరింపు కాల్స్ వచ్చాయని, అందులో ఎక్కువ అమెరికా నుంచి వచ్చాయని, కనుక కేసును వెనక్కి తీసుకుంటామని సుప్రీం కోర్టుకు తెలిపారు. అందుకు సుప్రీం కోర్టు స్పందిస్తూ ప్రజా ప్రయోజనాల వాజ్యం (పిఐఎల్) రద్దు చేయడం కుదరదని స్పష్టం చేసింది. 2007లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మహిళల ప్రవేశానికి మద్దతిస్తూ ఇచ్చిన అఫిడవిట్‌ను 2016 ఫిబ్రవరి 6న కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వం తిరస్కరిస్తూ, మహిళ ప్రవేశాన్ని వ్యతిరేకించింది. ఏప్రిల్ 11న సుప్రీం కోర్టు మహిళల ప్రవేశంపై నిషేధం వల్ల స్త్రీ, పురుష సమన్యాయ భావనకు ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించింది. ఏప్రిల్ 13న ఆలయ సంప్ర దాయం పేరుతో ప్రవేశాలను అడ్డుకోవడంలో హేతుబద్ధత లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏప్రిల్ 21న మహిళలను అనుమతించాలంటూ హింద్ నవోత్థాన ప్రతిష్టాన్, నారాయణాశ్రమ తపోవనమ్ పిటిషన్లు దాఖలు చేశాయి. నవం బర్ 7 అన్ని వయస్సుల మహిళలను అనుమతిం చాలనే వాదనకు మద్దతు తెలుపుతూ సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం మళ్లీ అఫిడ విట్‌ను దాఖలు చేసింది. 2017 అక్టోబర్ 13న శబరిమల ఆలయంలోకి మహిళలను నిషేధిం చడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుం దా? అది తప్పనిసరిగా పాటించాల్సిన మతపర మైన ఆచారం కిందకు వస్తుందా? అన్నది పరి శీలించేందుకు కేసును రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీం కోర్టు బదిలీ చేసింది. అక్టోబర్ 27న కేసును విచారించేందుకు సుప్రీం కోర్టులో లింగ సమానత్వ ధర్మాసనం కోసం పిటిషన్ దాఖలు చేశారు. 2018 జూలై 17న ఐదుగురు

> **"రుతుస్రావాన్ని కారణంగా చూపుతూ ప్రస్తుతం 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధం. అక్రమమం. మహిళలకు ప్రవేశంపై శబరిమల ఆలయం పెట్టిన ఆంక్షలు తప్పనిసరి మత సంప్రదాయాలేమీ కాదు. మతం అనేది మనిషిని దైవత్వంతో అనుసంధానించే జీవన విధానం. భక్తిలో వివక్షను చూపలేం. పురుషాధిక్య విధానాలతో ఆధ్యాత్మికతలో లింగ సమానత్వాన్ని పాటించకుండా ఉండలేం."**




శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించవచ్చునని తీర్పుచెప్పిన రాజ్యాంగ ధర్మాసనంలోని సభ్యులు

న్యాయమూర్తులు జస్టిస్ మిశ్రా, జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ ఇందూ మల్హోత్రాలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. జూలై 19న ఆలయంలోకి ప్రవేశించడం మహిళల ప్రాథమిక హక్కు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వయస్సు వెనుక ఉన్న హేతుబద్ధతను ప్రశ్నించింది. జూలై 25న నాయర్ సర్వీస్ సొసైటి (ఎఎస్ఎస్) రాజ్యాంగం ద్వారా శబరిమల అయ్యప్ప దేవాలయాన్ని రక్షించాలని పేర్కొంది. జూలై 26న బుతుస్రావమనే శారీరక అంశంతో ముడిపెట్టి మహిళ ప్రవేశాన్ని నిషేధించకూడదని సుప్రీం కోర్టు నొక్కి చెప్పింది. శబరిమల ఆలయం తరపున, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు తరపున సీనియర్ న్యాయవాది కెకె వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం నైతికత, ఆరోగ్యం, ప్రజాభిప్రాయానికి అనుగుణం గా ఒక మతసంస్థ తనదైన రీతిలో కార్యకలాపాలను నిర్వహించుకోవటానికి స్వేచ్ఛ ఉందని చెప్పారు. పిటిషనర్ల తరపున సీనియర్ మహిళా న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదనలు వినిపిస్తూ "రాజ్యాంగంలోని 14, 15, 17 ఆర్టికల్స్ ప్రకారం ఇలాంటి నిబంధనలు చట్ట విరుద్ధమని, అన్ని వయస్సుల మహిళలకు ఆలయంలో ప్రవేశించి పూజలు చేసే అవకాశం కల్పించాలని కోరారు. విశ్వాసాలు, కట్టుబాట్ల పేరుతో మహిళలను వివక్షకు గురిచేస్తున్నారని అన్నారు. 1991లో ఎస్.మహేంద్రన్ వర్సెస్ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కేసులో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పునూ పరిశీలించి, ఇరు పక్షాల వాదనలనూ విన్న తరువాత సుప్రీం కోర్టు 2018 ఆగస్టు 1న తీర్పును రిజర్వు చేసింది. సెప్టెంబర్ 28న ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో 411 పేజీల తీర్పును వెలువరించింది. జస్టిస్ మిశ్రాతోపాటు జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్‌లు ఆలయం లోకి స్త్రీల ప్రవేశానికి అనుకూలంగా తీర్పునివ్వ గా, మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఇందూ మల్హోత్రా మాత్రం వారితో విభేదించారు. "రుతుస్రావాన్ని కారణంగా చూపుతూ ప్రస్తుతం 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న మహిళ లను శబరిమల ఆలయంలోకి అనుమతించక పోవడం రాజ్యాంగ విరుద్ధం. అక్రమమం. మహిళలకు ప్రవేశంపై శబరిమల ఆలయం పెట్టిన ఆంక్షలు తప్పనిసరి మత సంప్రదాయాలేమీ కాదు. మతం అనేది మనిషిని దైవత్వంతో అనుసంధానించే జీవన విధానం. భక్తిలో వివక్షను చూపలేం. పురుషాధిక్య విధానాలతో ఆధ్యాత్మికతలో లింగ సమానత్వాన్ని పాటించ కుండా ఉండలేం" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా పేర్కొన్నారు. "అయప్ప భక్తులంతా హిందువులే. వారు ప్రత్యేక వర్గమేమీ కాదు. శరీర ధర్మ కారణాల ముసుగులో మహిళలను అణచివేయడం చట్టబద్ధం కాదు. నైతికత, ఆరోగ్యం తదితర కారణాలతో మహిళలను పూజలు చేయకుండా అడ్డుకోలేం. పురుషులు ఆటోగ్రాఫ్‌లు పెట్టేంత ప్రముఖులు అవుతున్నా మహిళలు సంతకం పెట్టే స్థితిలో కూడా లేరు" అని అన్నారు. "ఈ దేశంలోని ఇతర అయ్యప్ప ఆలయాల్లో మహిళలకు ప్రవేశం ఉంది. శబరిమలలో నిషేధమెందుకు? శబరి మల ఆలయం బహిరంగ ప్రార్థనా స్థలమే." అని స్పష్టం చేశారు. తనతోపాటు జస్టిస్ ఖన్విల్కర్ తరపున కూడా జస్టిస్ మిశ్రాయే 95 పేజీల తీర్పును రాశారు. "రుతుస్రావం అయ్యే వయస్సులో ఉన్న మహిళలను ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26లకు విరుద్ధం" అని జస్టిస్ నారిమన్ పేర్కొన్నారు. "వయస్సు, రుతుస్రావం స్థితి ఆధారంగా మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం అంటరానితనం కిందకే వస్తుంది" అని జస్టిస్ చంద్రచూడ్ తన తీర్పులో పేర్కొన్నారు. అది మహిళల గౌరవానికి భంగం కలిగించడంతోపాటు, పురుషుల కన్నా స్త్రీలను తక్కువ చేసేలా ఉంటుందని అన్నారు. రాజ్యాంగంలోని 17వ అధికరణం ప్రకారం అది అక్రమమని చంద్రచూడ్ తన 165 పేజీల తీర్పులో పేర్కొన్నారు. శబరిమల ఆలయ ప్రవేశం విషయంలో మహిళలపై వివక్ష చూపుతున్న కేరళ హిందూ బహిరంగ ప్రార్థనా స్థలాల నిబంధనల చట్టం-1965లోని 3(బి)ని కూడా కొట్టివేయాలని ఆయన అన్నారు. అక్టోబర్ 2న జస్టిస్ మిశ్రా పదవీ విరమణ పొందే నాటికి ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన ఇచ్చిన చివరి తీర్పు మహిళ హక్కులకు సంబంధించినదే కావడం విశేషం.

### రాజ్యాంగం ఏం చెబుతుంది?

భారత రాజ్యాంగం ప్రకారం దేశంలోని మనుషులంతా సమానమే. కుల, మత, జాతి, లింగ వివక్షలను రాజ్యాంగం సహించదు. శబరిమల కేసులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 17, 25, 26 చర్చకు వచ్చాయి. ఈ ఆర్టికల్స్ ప్రకారం శబరిమల ఆలయంలోకి మహిళలను అనుమతించకపోతే వారి హక్కులకు భంగం కలగటమే కాదు. అంటరాని వారవుతారని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.

ఆర్టికల్ 14 సమానత్వపు హక్కు ఇచ్చింది. స్త్రీ, పురుషులు సమానులేనని నొక్కి చెప్పింది. ఆర్టికల్ 15 కుల, మత, జాతి, లింగ, ప్రాంతం పేరుతో వివక్ష లేకుండా ఉండాలని స్పష్టం చేసింది. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నేరంగా పరిగణించింది. ఆర్టికల్ 25, 26లు నైతికతకు సంబంధించిన అంశాలను స్పష్టం చేస్తున్నాయి. ఈ ఐదు ఆర్టికల్స్‌ను ఆధారంగా చేసుకొని సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చింది.

### ఎప్పటి నుంచీ ఈ ఆచారం

పాతకాలం అయ్యప్ప ఆలయ ప్రధాన పూజారి ప్రకారం "తొలుత అన్ని వయసుల మహిళలు అయ్యప్ప ఆలయంలోకి వెళ్లేవారు. 1950లో మహిళలు ఆలయ ప్రవేశాన్ని అడ్డుకునే నిబంధనలు అమలులోకి తెచ్చారు" అని పేర్కొన్నారు. ఆలయంలోకి మహిళలు ప్రవేశించవద్దని అయ్యప్ప స్వామి చెప్పినట్టు రుజువు చేసే ఆధారాలు ఎక్కడా లేవు. 1940లో ఏభైఏళ్ల లోపు వయస్సు కలిగిన కేరళలోని తిరువనంత పురం ప్రాంతానికి చెందిన రాణి శబరిమల అయ్యప్ప ఆలయంలోకి వెళ్లి, పూజలు చేసినట్టు ఆధారాలున్నాయి. 1950లో పందరం రాజు, ఆలయ ప్రధాన పూజారి(తంత్రి) కలసి 50 ఏళ్ల వయస్సు లోపు స్త్రీలు ఆలయంలోకి రాకూడదనే నిబంధనలు అమల్లోకి తెచ్చారు. అయితే ఈ ఆచారంపై రెండు వాదనలను ఉన్నాయి. మొదటిది: దట్టమైన అడవులు, పులులు సంచరించడంతో మహిళలు భయపడతారనే కారణంతో మహిళ ప్రవేశం నిషేధించారని చెబుతారు. ఇప్పటిలా అప్పుడు విద్యుత్ లేదు. కారు చీకట్లో భక్తులు వెళ్లేవారు. దాంతో అడవుల్లో ఇబ్బందులకు గురయ్యేవారు. దానివల్ల మహిళల పై నిషేధం వచ్చిందని విశ్లేషణ ఉంది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రోడ్ల విస్తరణ, విద్యుత్ సౌకర్యం, అన్ని వసతులు ఉన్నాయి. రెండోది: ఇది కొంత మంది మత ప్రచారకులు చేస్తోన్న వాదన. అయ్యప్ప స్వామి బ్రహ్మచారి కనుక కన్య భక్తులు రాకూడదని చెబుతున్నారు. 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు ఆలయంలోకి ప్రవేశిస్తే రుతుస్రావం జరుగుతుందని, ఆలయం అపవిత్రం అవుతుం దని వాదన చేస్తున్నారు. ఈ వాదనలో ఏరక మైన పస లేదు. హేతుబద్ధత లేదు. హిందూ ధర్మంలో మహిళల పరిస్థితిపై పరిశోధన చేసిన మాంట్రియల్‌లోని మెక్‌గిల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అరవింద్ శర్మ "ఏదైనా మృత దేహాన్ని, అశుద్ధాన్ని తాకినపుడు మనుషులు అపవిత్రం అవుతారనే ఒక భావన ఉంది. రుతుస్రావం సందర్భంగా మహిళలనూ అలాగే భావిస్తారు. ఇది అభివృద్ధి నిరోధకం" అని తెలిపారు. "స్మృతుల్లో కనిపించే స్మార్త హిందూ ధర్మంలో మాత్రమే ఇలా భావిస్తారు. కానీ శాక్త హిందూ ధర్మంలో (వీళ్లు స్త్రీలను, దేవతలను పూజిస్తారు) రుతుస్రావాన్ని అపవిత్రం అని కాకుండా, అది వాళ్లను శుద్ధి చేస్తుందని భావిస్తారు" అని డాక్టర్ అరవింద్ తెలిపారు. శాక్త పద్ధతిలోనే అయ్యప్ప స్వామి పూజా విధానం ఉంటుంది. కనుక రుతుస్రావాన్ని అపవిత్రంగా భావించనవసరం లేదు.

**"ఇది కొంత మంది మత ప్రచారకులు చేస్తోన్న వాదన. అయ్యప్ప స్వామి బ్రహ్మచారి కనుక కన్య భక్తులు రాకూడదని చెబుతున్నారు. 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు ఆలయంలోకి ప్రవేశిస్తే రుతుస్రావం జరుగుతుందని, ఆలయం అపవిత్రం అవుతుం దని వాదన చేస్తున్నారు. ఈ వాదనలో ఏరక మైన పస లేదు. హేతుబద్ధత లేదు."**



శబరిమల వద్ద బైఠాయించిన ఆందోళనకారులు

### సుప్రీం కోర్టు తీర్పు పర్యావసానాలు

శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల గల మహిళలు ప్రవేశానికి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఏదో ఒక్క రోజులో ఊడిపడినది కాదు. ఏళ్ల తరబడి ఇరుపక్షాల వాదలను విని, రాజ్యాంగానికి లోబడి ఇచ్చిన తీర్పు. "సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా శబరిమల కేసులో తీర్పు చదవడం ప్రారంభించినపుడు అందరి ముఖంలో చిరునవ్వు కనిపించింది" అని ఆ సమయంలో సుప్రీం కోర్టులో ఉన్న బిబిసి ప్రతినిధి నితిన్ శ్రీవాస్తవ్ చెప్పారు. "సుప్రీం కోర్టు పరిసరాల్లో కోర్టు హౌస్ వైపు వెళ్లే దారి పూర్తిగా

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

**"శబరిమల దక్షిణ అయోధ్యగా విశ్వ హిందూ పరిషత్ అధికార ప్రతినిధి వినోద్ బన్సాలీ ప్రకటించడం మత విద్వేశాలను రెచ్చగొట్టడమే. ప్రజల మధ్య నెలకొన్న ఐక్యతను బలహీన పరిచే పనిలో ఆరెస్సెస్, విశ్వ హిందూ పరిషత్, భజ రంగ దళ్ హిందూసంస్థలు, బిజెపి, శివసేనలాంటి రాజకీయ పార్టీలు ఉన్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి దేశంలో హిందూ ఓట్లను ఏకీకృ తం చేసే పనిలో పడింది. అందుకనే మత విద్వేషాలను రెచ్చగొడుతుంది."**



కోర్టు తీర్పు అమలుచేస్తామని ప్రకటించిన పినరయి విజయన్

సామాజిక కార్యకర్తలతో నిండిపోయింది. నెలసరి సమయంలో మహిళలు ఆలయ పరిసరాల్లో ప్రవేశించడంపై కోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిందని చాలా మంది అభిప్రాయపడ్డారు. తీర్పు వెలువడగానే చాలా మంది మహిళలు కోర్టులో ఒకరినొకరు ఆలిం గనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. యావత్తు భారతదేశం కూడా కోర్టు తీర్పును అభినందించింది. అన్ని రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలు తీర్పును స్వాగతించాయి. కానీ కొన్ని పార్టీలు తమలోని ద్వంద్వ నీతిని బయట పెడుతున్నాయి. తీర్పు వెలువడినప్పుడు స్వాగతించామని ప్రకటనలు చేసి, ఇప్పుడు అదే తీర్పుకు వ్యతిరేకంగా ఆందోళన చేసి, సుప్రీంకోర్టు తీర్పును రాజకీయం చేస్తున్నాయి.

తీర్పు వెలువడిన వెంటనే శబరిమల ఆలయ ప్రధాన పూజారి కంద్రూ రాజీవరూ సుప్రీంకోర్టు తీర్పు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, కోర్టు ఆదేశాలకు అనుగుణం గా మహిళలను ఆలయంలోకి అనుమతిస్తామని చెప్పారు. కానీ అతనే ఈ రోజు అపవిత్రం పేరుతో ఆలయాన్ని మూసేస్తానని హెచ్చరిస్తు న్నాడు. కేంద్ర మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి, బిజెపి నాయకురాలు మేనకా గాంధీ, బిజెపి ఎంపి సుబ్రహ్మణ్యస్వామి తదితర బిజెపి నేతలు తీర్పును స్వాగతించారు. తాను ఆలయంలోకి వెళ్లి, అయ్యప్ప విగ్రహాన్ని తాకానని చెప్పిన కన్నడ నటి జయమాల కూడా సుప్రీం తీర్పును స్వాగతించారు. ఆమె ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ నేతగానూ, కర్ణాటక మహిళ, శిశు అభివృద్ధి, సాధికారిత మంత్రిగా ఉన్నారు. ఆరెస్సెస్ కూడా సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించింది. ఆ తర్వాత తీర్పును సమర్ధి స్తున్న వారిపై దాడులు చేయడం ప్రారంభిం చారు. మహిళ జర్నలిస్టులపైన, మహిళ భక్తులపైన, మహిళ సామాజిక ఉద్యమ కారులపై దాడులకు పాల్పడ్డారు. గుంపు దాడులకు పాల్పడుతున్నారు. సుహాసిని రాజ్ (న్యూయార్క్‌టైమ్స్ ఇండియా రిపోర్టర్)పై రాళ్ల రువ్వారు. కవితా జక్కల్(మోజో టివి), సామాజిక ఉద్యమ కారులు రీహానా ఫాతిమా, మేరీ స్వీటీ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళ భక్తులు మాధవి, వాసంతి, ఆది శేషమ్మ, బాలమ్మ ఆలయంలోకి ప్రవేశించేం దుకు ప్రయత్నిస్తే దాడికి పాల్పడ్డారు. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును అమలు చేసేందుకు ప్రయత్నిస్తే గుంపు మూకలు ఇలాంటి దాడులకు పాల్పడ్డారు. ఆయా పార్టీల జాతీయ అధ్యక్షులు అమిత్ షా, రాహుల్ గాంధీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీలు మాత్రం నోరు విప్ప టం లేదు. మహిళలను అయ్యప్ప ఆలయంలోకి అనుమతించాలంటూ బిజెపి నిర్వహించిన ఆందోళనలకు బిజెపి కేరళ నేత కె. సురేంద్రన్ మద్దతిస్తూ తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశారు. ఆ పోస్టును 30 మందితో పాటు సామాజిక ఉద్యమకారిని రెహాన ఫాతిమా కూడా టేగ్ చేశారు. ఇప్పుడు అదే పోస్టును తొలగించారు. మరోవైపు సుప్రీం కోర్టు తీర్పుపై రీవ్యూ పిటిషన్లు వేశారు. అంటే మహిళలకు కనీస హక్కులు చెందకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగమే.

**శబరిమల దక్షిణ అయోధ్యా?**

శబరిమల దక్షిణ అయోధ్యగా విశ్వ హిందూ పరిషత్ అధికార ప్రతినిధి వినోద్ బన్సాలీ ప్రకటించడం మత విద్వేశాలను రెచ్చగొట్టడమే. ప్రజల మధ్య నెలకొన్న ఐక్యతను బలహీన పరిచే పనిలో ఆరెస్సెస్, విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ్ హిందూసంస్థలు, బిజెపి, శివసేనలాంటి రాజకీయ పార్టీలు ఉన్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి దేశంలో హిందూ ఓట్లను ఏకీకృతం చేసే పనిలో పడింది. అందుకనే మత విద్వేషాలను రెచ్చగొడుతుంది. తద్వారా రాజకీయ లబ్ది పొందేందుకు కుట్ర పన్నుతుంది. కేరళ శబరిమల అయ్యప్ప ఆలయం లోకి ఏలాగైతే మహిళలను అనుమతించరో, మహారాష్ట్రలోని శని సింగనాపూర్ ఆలయంలోకి కూడా మహిళలను అనుమతించరు. ముంబాయి హైకోర్టు మహిళలను అనుమతించాలని తీర్పు ఇచ్చింది. అక్కడ బిజెపి ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసి మహిళలను అనుమతించారు. మరి అక్కడ అనుమతించిన బిజెపి, శబరిమలలో అనుమతి స్తే ఎందుకు హింసను సృష్టిస్తోంది? దీనిబట్టే బిజెపి, ఆరెస్సెస్ వైఖరి స్పష్టంగా కనబడుతుంది. కేరళలోకి ప్రవేశించేందుకు బిజెపి చాలా ఏళ్లగా ప్రయత్నిస్తోంది. 54 శాతం ఉన్న హిందూ ఓట్లను ఏకీకృతం చేసేందుకు బిజెపి ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. కానీ దాని ప్రయత్నాలు ఫలించిన పాపాన పోలేదు. అందువల్ల అక్కడ మతపరమైన విభజన తీసుకురావాలని ప్రయత్నం చేస్తోంది. కానీ శ్రీనారాయణ గురు లాంటి వ్యక్తులు సంఘ సంస్కరణోద్యమాలు నడిపారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలను చేశారు. కనుక కేరళలో మత విభజన అంత సులువు కాదు.

12 ఏళ్ల క్రితం శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళలను అనుమతించాలని పిటిషన్ వేసింది బిజెపికి చెందిన న్యాయవాదు లే. దానికనుగుణంగా కేరళలో బిజెపి ఆందోళనలు చేపట్టింది. తీర్పు మహిళలకు అనుకూలంగా వచ్చే సరికి అదే బిజెపి సమస్య లను సృష్టిస్తోంది. శాంతి భద్రతల సమస్యను సృష్టించి అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు సాగుతున్నాయి. అందుకు బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన ఎస్ఎన్డిపి నేత నటేశన్ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ఎన్నికైన ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తున్నారని, ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు జరుగుతున్నాయని, కనుకనే తాము ఈ ఆందోళనలకు మద్దతివ్వటం లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి బిజెపి, ఆరెస్సెస్‌కి సమస్య పరిష్కారం గురించి ఆలోచన లేదు. వారి లక్ష్యం ఒక్కటే అల్లర్లను సృష్టించి రాజకీయ అవకాశ వాదాన్ని ప్రదర్శిస్తోంది. దానికి కాంగ్రెస్ కూడా తోడైంది. దేశవ్యాప్తంగా బిజెపిని వ్యతిరేకించే కాంగ్రెస్, కేరళకు వచ్చే సరికి ఒకే నాణేనికి బొమ్మ, బొరుసుగా వ్యవహరిస్తు న్నాయి. నిజంగా ఆరెండు పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలి. పార్ల మెంట్‌లో ఆరెండు పార్టీల బలం మూడొం తులు ఉంది. కానుక చట్టం కూడా సునాయా సంగా నెగ్గుతుంది. కాని అలా చేయకుండా ప్రజలతో చెలగాటం ఆడుతున్నారు. ఓట్ల రాజ కీయానికి తెరతీశారు. ప్రజల మనోభావాలను తమ రాజకీయాలకు వాడుకుంటున్నారు.

“12 ఏళ్ల క్రితం శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళలను అనుమతించాలని పిటిషన్ వేసింది బిజెపికి చెందిన న్యాయవాదు లే. దానికనుగుణంగా కేరళలో బిజెపి ఆందోళనలు చేపట్టింది. తీర్పు మహిళలకు అనుకూలంగా వచ్చే సరికి అదే బిజెపి సమస్య లను సృష్టిస్తోంది. శాంతి భద్రతల సమస్యను సృష్టించి అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు సాగుతున్నాయి.”



కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్న బిజెపి

శబరిమల తీర్పును ఆదర్శంగా తీసు కొని దేశంలో మహిళలను అనుమతించని ఆలయా ల్లోకి ప్రవేశం కోసం పోరాడాలి. శబరిమల తీర్పు తరువాత మసీదుల్లో ప్రార్థనలకు అవకాశం కల్పించాలని కేరళ ముస్లీం మహిళలు సుప్రీం కోర్టుకు వెళ్ళేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రోగ్రెసివ్ ఉమెన్స్ ఫోరం నేతృత్వంలో సుప్రీం కోర్టులో పిటిషన్ వేసేందుకు ముస్లీం మహిళలు నిర్ణయం తీసుకున్నారు. ❋

# వ్యవసాయ సంక్షోభం

(18వ పేజీ తరువాయి)

సరళీకరణ విధానాల సమర్ధకులు ప్రశ్నిస్తున్నారు. వీటిని అమలుచేస్తే విదేశీ పెట్టుబడులు వెనక్కు పోతాయని, దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుం దని బెదిరిస్తారు. ఇవి అర్ధంలేని ప్రశ్నలు. ప్రభుత్వం పూనుకుంటే ఉ పాధి హామీ పనులు కల్పించటం కష్టం కాదు. సంవత్సరానికి మరో లక్షకోట్ల రూపాయలు అదనంగా కేటాయిస్తే గ్రామీణ ప్రాంతంలోని కూలీలందరికీ పనులు కల్పించవచ్చు. మరోరెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తే రైతాంగ పంటలను గిట్టుబాటు ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేయవచ్చు. రెండింటికీ కలిసి 3 లక్షల కోట్ల రూపాయలు కావలసి వస్తాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం బడ్జెట్‌లో పారిశ్రా మిక వేత్తలకిస్తున్న రాయితీలలో ఈ మొత్తం సగం మాత్రమే.

అదనపు నిధులు సమీకరించటానికి ప్రభుత్వానికి అనేక మార్గాలున్నాయి. దేశంలో ప్రత్యక్ష పన్నుల వసూలు చాలా తక్కువగా ఉంది. అనేక దేశాలలో 30 నుండి 50 శాతం వరకు పన్నురేటు ఉ ంది. అమెరికాలో 25 శాతానికి పైగా ఉంది. మనదేశంలో 15 శాతా నికి తక్కువగా ఉన్నది. మనం కనీసం అమెరికా స్థాయికి ప్రత్యక్ష పన్నురేట్లను పెంచినా ఈ పథకాలను అమలుజరపటానికి అవసరమైన నిధులు లభిస్తాయి. గత నాలుగు సంవత్సరాలలో కార్పొరేట్లకు ఇచ్చిన రుణాలలో 3,00,000 కోట్ల రూపాయలకు పైగా పారు బకాయిల కింద రద్దుచేశారు. వాటిని వసూలు చేసినా ఈ పథకాల అమలుకు నిధుల లభిస్తాయి.

ఇక పెట్టుబడులు దేశం వదిలిపోతాయనే వాదన కూడా అర్థం లేనిది. పెట్టుబడులను క్రమబద్దీకరించేలా చట్టాలు చేసే హక్కు పార్ల మెంటుకు ఉన్నది. థాయ్‌లాండ్ లాంటి చిన్న దేశం కూడా తాను సంక్షోభం ఎదుర్కొన్నపుడు విదేశీ పెట్టుబడుల రాకపోకలపై ఆంక్షలు విధించింది. అటువంటి చిన్న దేశాలు తీసుకున్న చర్యలను కూడా మనం తీసుకోలేమా? విదేశీ పెట్టుబడిదారులు లాభాలు సంపాదించుకునేలా కాకుండా మనదేశం, మనప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వం ఆర్థిక విధానాలను రూపొందించి, అమలు చేయాలి. ఈ విధంగా దేశ ప్రయోజనాలను పరిరక్షించటానికి ప్రభుత్వం పూనుకుంటే మనదేశం సంక్షోభం బారిన పడకుండా, అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుంది.

# ఔషధ పరిశ్రమ దోపిడి

జోయెల్ లెక్సిచిన్

అనేక దశాబ్దాలుగా పెట్టుబడిదారులకు లాభాల పంట పండిస్తున్న పరిశ్రమల్లో ఔషధ పరిశ్రమ ఇప్పటికీ అగ్రగామిగానే ఉంది.

పరిశోధనల ద్వారా, అధునాతన చికిత్సా ఔషధాలు ఉత్పత్తి చేసి, విక్రయించడం వల్లే ఈ లాభాలు వస్తున్నాయనుకుంటే అదొక భ్రమ. వాస్తవం దీనికి చాలా భిన్నంగా ఉంటుంది. కొత్త ఔషధాల తయారీ కోసం నిర్వహిస్తున్న ప్రాథమిక పరిశోధనలపై పరిశ్రమలు వాస్తవంగా పెట్టే ఖర్చు పన్నులు మినహాయిస్తే కేవలం 1.3 శాతం మాత్రమే.

ఔషధ సంస్థలు ఉత్పత్తి చేస్తున్న కొత్త మందుల్లో చాలా వరకు కొత్త చికిత్సా మార్గాలకు అంతగా ఉపయోగపడేవి కావు. ఉదాహరణకు 2005-2014 దశాబ్దిలో 1,032 కొత్త మందులు ఫ్రెంచ్ మార్కెట్లోకి రాగా, వాటిలో చాలా వరకు పాత మందుల స్థానే ప్రవేశపెట్టినవే. వీటిలో కేవలం 66 మందులు మాత్రమే కొంత మెరుగ్గా ఉన్నాయి. సగానికిపైగా వాటిలో ఎలాంటి కొత్తదనమూ లేదు. 177 మందులను అనుమతించకూడనివిగా నిర్ధారించారు. ఆ మందులు వాడకం వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేకపోగా, ఆరోగ్యానికి అవి తీవ్ర హాని కలిగించే ప్రమాదముంది.

ఔషధ పరిశ్రమ గరిష్ట స్థాయిలో ఆర్జించిన లాభాలను సమర్థించుకోవడానికి మందుల అభివృద్ధి చాలా రిస్కుతో కూడిన వ్యవహారమని చెబుతారు. ప్రతి పది వేల అణువుల్లో ఒకటి మాత్రమే కొత్త మందుల్లో వుంటుందని ఔషధ సంస్థలు చెబుతాయి. అది నిజమేనని అనుకున్నా, అణువుల్లో చాలా వరకు పక్కకు పోతాయి. ఔషధ తయారీ తొలి దశలో ఇది జరుగుతుంది కాబట్టి దీనికి ఖర్చు కూడా తక్కువగానే ఉంటుంది. మందుల కంపెనీలు మాత్రం కొత్త మందులను మార్కెట్లోకి తీసుకురావడానికి 260 కోట్ల డాలర్ల దాకా ఖర్చు అయినట్లు అంకెల్లో ఇప్పుడు చూపిస్తారు. అసలు గణాంకాలను గోప్యంగా వుంచుతారు. ఊహల ఆధారంగా వేసే లెక్కలను ఎవరైనా సవాలు చేయొచ్చు.

ఔషధాల తయారీ నిజంగానే రిస్కుతో కూడుకున్నదైతే కార్పొరేట్ సంస్థల పరిస్థితిలో ఎగుడు దిగుడులు ఉండాలి కదా. కానీ, దీనికి భిన్నంగా 1980 నుంచి అన్ని బడా కార్పొరేట్ సంస్థలు ఆర్థికంగా చాలా ఉన్నత స్థితిలో వుంటున్నాయి. పేటెంట్ గడువు తీరిన కంపెనీలు కొట్టుకుపోతాయని విశ్లేషకులు ఎన్ని సార్లు హెచ్చరించారో తెలీదు. అయినా అలాంటిదేమీ సంభవించలేదనే విషయాన్ని మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఫిజీషియన్ స్టాన్లీ ఫింకెల్స్టీన్, ఆర్థికవేత్త పీటర్ టెమిన్ ఎత్తిచూపారు.

గణనీయమైన స్థాయిలో లాభాలు కొనసాగుతున్నప్పటికీ ఔషధ పరిశ్రమ సంక్షోభంలో పడడానికి మూడు కారణాలున్నాయి. పేటెంట్ గడువు తీరిపోవడం వల్ల 2010-2015 మధ్య 7,500 కోట్ల డాలర్ల ఆదాయం పడిపోయింది. కొత్త మందుల సరఫరా అధ్వానంగా ఉండడంతో అమెరికాతో సహా చాలా దేశాల్లో వీటి ధరలు ఇటీవల బాగా పెరిగిపోయాయి.

ఆధునిక పెట్టుబడిదారీ విధానంలో కీలకమైన అంశం ద్రవ్య పెట్టుబడి ఈ రంగంలోకి కూడా చొచ్చుకురావడం. ఈ ద్రవ్య పెట్టుబడి విస్తరణతో ఉత్పత్తి నుంచి జరిగే ఆర్థిక కార్యకలాపాలు ఫైనాన్స్ వైపు మళ్లుతున్నాయి. ఔషధాలను కనుగొనడం గురించి ఈ కంపెనీల షేర్ హోల్డర్లు, పెట్టుబడి సమకూర్చే బ్యాంకర్లు, విశ్లేషకులకు బొత్తిగా తెలీదు, తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా వారికి ఉండదు. అల్పకాలంలో అనల్ప లాభాలు ఆర్జించడం ఎలా అన్నదానిపైనే వారి ఆసక్తి అంతా. ఇది ఆయా కంపెనీల సిఇఓల మీద, డైరక్టర్ల బోర్డు మీద ఒత్తిడి పెంచుతుందని కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఫార్మాకాలజీ అండ్ మెడిసిన్ విభాగానికి చెందిన శాన్ డీగో అభిప్రాయపడ్డారు.

ఫైనాన్నియల్ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ఔషధ పరిశ్రమ రకరకాల ఎత్తుగడలు, వ్యూహాలను అమలు చేస్తున్నది. బ్రహ్మాండంగా లాభాలు సంపాదించే బ్లాక్ బస్టర్ నమూనా నిస్సారంగా మారితే ఇతర నమూనాలకు మళ్లుతాయి. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) విభాగం నుంచి తయారయ్యే మందులపై నియంత్రణ వుంటుంది. ఔషద పరిశ్రమ ఈ నియంత్రణ సంస్థలతో పెనవేసుకుపోవడం, అవినీతి, కొన్ని సందర్భాల్లో ప్రభుత్వంతో కుమ్మక్కవడం ద్వారా ఈ నియంత్రణ ప్రక్రియను తొత్తడం చేస్తాయి. ఉత్పత్తుల అమ్మకాలపై గుత్తాధిపత్యం సాధించడం పైన, అభివృద్ది చెందిన దేశాల్లోనూ, మార్కెట్ విస్తరణకు బ్రహ్మాండమైన అవకాశాలున్న వర్ధమాన దేశాల్లోనూ బలమైన మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ పైన ఈ పరిశ్రమ మనుగడ ఆధారపడి వుంది. మందుల ధరల నియంత్రణ నుంచి వచ్చే ముప్పును అధిగమించేందుకు అవి కొత్త మార్గాన్ని ఎంచుకున్నాయి. పాత, కొత్త మందులను వైద్యులతో ఎక్కువగా ప్రిస్క్రిప్షన్ రాయించడం ద్వారా ఆదాయం పెంచుకోవాలన్నదే వాటి లక్ష్యం. దీనిని చేరుకోవడానికి మందులు ఎప్పుడు ఎలా సూచించాలి అన్న దానిపై పరిజ్ఞానం ఉంటే చాలు. మందుల తయారీ, నియంత్రణ ప్రక్రియను అవినీతిమయం గావించడం, ఔషధ ఉత్పత్తుల లాభ నష్టాలను తెలుసుకునే పరిజ్ఞానాన్ని నియంత్రించడం. ఈ నాలుగు అంశాల గురించి క్లుప్తంగా వివరించాలి. కొద్ది సంవత్సరాల క్రితం వరకు ఔషధ పరిశ్రమ అనుసరించే పద్ధతినే బ్లాక్ బస్టర్ నమూనా అని వ్యవహరిస్తారు. గుండె వ్యాధులు, మధు మేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందులను తయారు చేయడం, వాటిని పెద్దయెత్తున అమ్ముకోవడం పరిశ్రమ లక్ష్యంగా వుండేది. యేటా ఈ అమ్మకాలు సుమారు వంద కోట్ల డాలర్ల దాకా వుండేవి. వర్ధమాన దేశాల ప్రజల కొనుగోలు శక్తి తక్కువ కాబట్టి ఆ దేశాలలో

ప్రబలంగా వుండే కొన్ని వ్యాధులను మందుల పరిశ్రమ విస్మరించేది. 2000–2011 మధ్య 859 కొత్త మందుల ఉత్పత్తులను విక్రయించగా అందులో 37 మాత్రమే (4శాతం) ఈ వ్యాధులకు సంబంధించినవి ఉన్నాయి.

ఇటీవల మార్కెట్‌లో సులువైన లక్ష్యాలకు అవకాశాలు అవిరైపోయాయి. దీంతో బ్లాక్ బస్టర్ నమూనాను వీడిఇతర నమూనాలకు మందుల కంపెనీలు మళ్లనారంభించాయి. కార్పొరేట్ సంస్థలు చిన్న మార్కెట్లను తమ మందులతో ముంచెత్తి, ఒక్కో రోగి నుంచి ఒక సంవత్సరానికి వందల వేల డాలర్లు పిండుకుంటున్నాయి. ఔషధ పరిశ్రమ సవాళ్లు, అనుభవాలు పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థలోని ఇతరులు అనుసరించే పద్ధతులను పోలివున్నాయి. ఒక దశకు వచ్చేసరికి మార్కెట్లు అవిరైపోవడమనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్నిహితమై ఉంటుంది. దీని నుంచి బయటపడాలంటే ఉత్పత్తుల్లో వైవిధ్యం ఉండాలి. ఆ పనిచేయాలంటే మందులు మరింత ఖరీదవుతాయి. రేట్లు పెరిగేకొద్దీ మార్కెట్లు అంతకంతకు కుంచించుకుపోతుంటాయి. అభివృద్ధి కూడా మందగిస్తుంది. అమెరికాలో మల్టీపుల్ స్క్లెరోసిస్ మందులను అభివృద్ధి పరచిన తరువాత వాటి ఉత్పత్తి వ్యయం బాగా పెరిగిపోయింది. 1990 దశకం ప్రారంభంలో 8 వేల డాలర్ల నుంచి 11 వేల డాలర్ల మధ్యవున్న వార్షిక సగటు వ్యయం 1990 మధ్య భాగానికి వచ్చేసరికి 60 వేల డాలర్లకు పెరిగిపోయింది.

2013లో కేన్సర్ వ్యాధికి సంబంధించి మెరుగుపరచిన కొత్త మందుల ధరలను కంపెనీలు విపరీతంగా పెంచడాన్ని 15కి పైగా దేశాలకు చెందిన 120 మంది కేన్సర్ చికిత్స నిపుణులు ముక్తకంఠంతో ఖండించారు. పెరిగిన ధరల ప్రకారం ఒక్కో కేన్సర్ రోగి ఈ కొత్త మందుల కోసం ఏటా లక్షడాలర్లకు పైగా వెచ్చించాల్సి వస్తోంది.

పరిశోధన, అభివృద్ధి ఖర్చులు పెరిగినందున మందుల ధరల పెంపు అనివార్యమని కంపెనీలు చేసేవాదన నిజం కాదు. దీనిపై ఫైజర్ మాజీ సిఇవో హాంక్ మెక్ కినెల్ ఏమన్నారో చూడండి. 'మా పరిశ్రమ కానీ, ఇంకా ఏ ఇతర పరిశ్రమ కానీ ఔషధ ఉత్పత్తుల ధరలు పరిశోధన అభివృద్ధి బడ్జెట్‌కు అనుగుణంగానే ఉంటాయనే వాదన తప్పు' అని తేల్చి చెప్పారు.

మార్కెట్ ఏ మేరకు భరించగలదనే దానిపైనే ధరలు ఆధారపడి వుంటాయి. ధరలు ఎక్కువగా వుంటే వాటిని కొనడానికి రోగులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఔషధ నియంత్రణ ప్రక్రియ అవినీతికి ఆలవాలమయ్యా

"ఔషధ పరిశ్రమ సవాళ్లు, అనుభవాలు పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థలోని ఇతరులు అనుసరించే పద్ధతులను పోలి వున్నాయి. ఒక దశకు వచ్చేసరికి మార్కెట్లు అవిరైపోవడమనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్నిహితమై ఉంటుంది. దీని నుంచి బయటపడాలంటే ఉత్పత్తుల్లో వైవిధ్యం ఉండాలి. ఆ పని చేయాలంటే మందులు మరింత ఖరీదవుతాయి. రేట్లు పెరిగేకొద్దీ మార్కెట్లు అంతకంతకు కుంచించుకుపోతుంటాయి. అభివృద్ధి కూడా మందగిస్తుంది."



నూతన మందులకోసం పరిశోధనలు

క మందుల తయారీ కంపెనీలు మందుల అమ్మకాల ద్వారా దండిగా డబ్బు సంపాదించేందుకు ఆస్కారమేర్పడింది. తయారైన మందులు మార్కెట్‌లోకి వెళ్లడానికి ముందు నియంత్రణ సంస్థ అనుమతి పొందాలి. వర్ధమాన దేశాల్లో ఈ ప్రక్రియ కేవలం నామ్‌కేవాస్తేగా మారింది. మూడింట ఒక వంతు దేశాల్లో అసలు ఈ రెగ్యులేటరీ సంస్థ లేకపోవడమో, ఒక వేళ ఉన్నా వాటి సామర్థ్యం నామమాత్రంగా వుండడమో జరుగుతోంది.

భారత్‌లాంటి దేశాల్లో మందుల క్రమబద్ధీకరణ ఒక బూటకంగా మారింది. 2011–12లో ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డిసి) ఉత్పత్తులను పరీక్షించి చూడగా ఆ మందుల్లో రెండు అంతకుమించి ఉత్ప్రేరకాలను వాడినట్లు తేలింది. నియంత్రణ ప్రమాణాలు సరిగా లేకపోవడాన్ని అసరాగా చేసుకుని కార్పొరేట్ కంపెనీలు విదేశాల్లో నిషేధించిన, లేక ఆమోదం లేని, ఎన్నడూ అనుమతించని ఎఫ్‌డిసి ఉత్పత్తులను పెద్దయెత్తున అమ్మి సొమ్ము చేసుకుంటున్నాయి. వీటిని వాడిన వారు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని కేసుల్లో మరణాలు కూడా సంభవిస్తున్నాయి.

అమెరికా, యూరోపియన్ యూనియన్‌లోని రెగ్యులేటరీ సంస్థలు ఔషధ పరిశ్రమల చేత ప్రభావితమై అవినీతిమయంగా తయారయ్యాయని ఫార్మాస్యూటికల్ నిపుణులు కోర్ట్నీ డేవిస్, జాన్ అబ్రహం చెప్పారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో ఔషధ విధానంపై వీరు బోధిస్తారు. గత 30 ఏళ్లలో ఔషధ నియంత్రణను నిర్వీర్యం చేసే పలు సంస్కరణలను ప్రభుత్వాలు తీసుకొచ్చాయని, దీని వల్ల నూతన ఔషధ అన్వేషణ లక్ష్యం గాడి తప్పిందని అన్నారు. రోగుల ఆరోగ్య ప్రయోజనాల కన్నా ప్రైవేట్ మందుల పరిశ్రమ ప్రయోజనాలే నూతన అన్వేషణల పరమార్థంగా మారిందని వారు తెలిపారు.

కార్పొరేట్ అనుకూల సిద్ధాంతాన్ని ఎందుకు ముందుకు తెచ్చారు అనే దాని గురించి అబ్రహం వివరిస్తూ, కార్పొరేట్ అనుకూల సిద్ధాంతాన్ని ప్రభుత్వాలే చురుగ్గా ప్రోత్సహిస్తున్నాయి. ఈ సిద్ధాంతం వ్యాపారవర్గాలకు అనుకూలం. మందుల పరిశ్రమను ప్రోత్సహించేందుకు నియంత్రణలను తొలగించాలని ఇది ప్రబోధిస్తుంది.

**“వినియోగఛార్జీలు ప్రజల ఆరోగ్య భద్రతపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయ నడానికి ఆధారాలు కోకొల్లలు. అమెరికాలో ఒక కొత్త మందు దరఖాస్తును సమీక్షించేందుకు గరిష్టగడువు 300 రోజులు. పిడియుఎఫ్‌ఎ, ఎఫ్‌డిఏ నిబంధనల ప్రకారం ఆ గడువు లోపల 90 శాతం దరఖాస్తులను సమీక్షించాలి.”**

ఔషధ పరిశ్రమ నియంత్రణ సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకోవడమే కాదు, విరాళాల రూపంలో డబ్బు సంచులు ముట్ట జెప్పడం ఇతర రూపాల్లో ప్రలోభపెట్టి ఇవి ప్రభుత్వ విధానా లను శాసించే స్థితికి చేరాయి. వీటి ప్రభావం ఏ స్థాయిలో వుంటుందంటే ఉదాహరణకు మందులకు సంబంధించి ప్రభుత్వ విధానాన్ని రూపకల్పన చేసేందుకు ఏర్పాటయ్యే టాస్క్ ఫోర్స్ లను మందుల కంపెనీల ఏజెంట్లతో నింపే స్తారు. దీనివల్ల అంతిమంగా జరిగేదేమిటి? ఔషధ పరిశ్రమ ప్రయోజనాలే నియంత్రణ బోర్డు లక్ష్యాలుగా రూపుదిద్దుకుంటాయి. వీటికి ప్రభు త్వం చురుగ్గా మద్దతిస్తుంది. ఔషధ నియంత్రణకు ఈ కార్పొరేట్ అనుకూల సిద్ధాంతానికి వున్న బంధానికి స్పష్టమైన ఉదాహరణ కార్పొరేట్ సంస్థలు చెల్లించే వినియోగ రుసుంలపై ఆధార పడి మందుల నియంత్రణ సంస్థల నిర్వహణ వుండేలా చూడడం. అమెరికాలో ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ), ఐరోపాలోని యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ (ఇఎంఎ), బ్రిటన్‌లోని మెడిసిన్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొడక్ట్సు రెగ్యులేటరీ ఏజెన్సీ (యుకె ఎంహెచ్‌ఆర్‌ఎ)లకు కార్పొరేట్ కంపెనీలు నిధులు సమకూరుస్తాయి. అమెరికాలోని ఎఫ్‌డిఏను వెంటాడుతున్న తీవ్రమైన నిధుల కొరతే దానిని ఈ వినియోగ రుసుం విధానం వైపు నెట్టింది. అమెరికన్ కాంగ్రెస్ ఎఫ్‌డిఏ బడ్జెట్‌ను పెంచేందుకు నిరాకరించింది. దీంతో గత్యంతరం లేని స్థితిలో ఔషధ పరిశ్రమ చెల్లించే వినియోగ రుసుంలపై ఎఫ్ డి ఏ ఆధార పడాల్సి వచ్చింది. అంతకుముందు వరకు ఈవినియోగ రుసుం విధానాన్ని ఎఫ్‌డిఏ గట్టిగా వ్యతిరేకించింది. ప్రిస్క్రిప్షన్ డ్రగ్ వినియోగ రుసుం యాక్ట్ (పిడియుఎఫ్‌ఎ)–1992 ప్రకారం రెగ్యులేటరీ సంస్థలకు అమెరికన్ కాంగ్రెస్ సమకూర్చే నిధులకు తోడుగా ఈ వినియోగ రుసుంను చెల్లించేందుకు మందుల పరిశ్రమ అంగీకరించింది. అయితే ఆ డబ్బును నియంత్రణ సంస్థ సామర్థ్యం పెంచేందుకు, మరీ ముఖ్యంగా బ్రాండ్ నేమ్ మందుల సమీక్ష, కొత్త మందుల పరీక్షలను శీఘ్రగతిన పూర్తి చేసేందుకు మాత్రమే వినియోగించాలని అవి షరతు పెట్టాయి. ఫలితంగా వినియోగ రుసుం కింద వచ్చిన దాంట్లో అత్యధిక భాగం కొత్త మందులను పరీక్షించే కిరాయి నిపుణులకు చెల్లించేందుకే సరిపోతోంది. 2007 వరకు ఎఫ్‌డిఏ ఈ అదనపు వనరులను కొత్త ఉత్పత్తుల నాణ్యత, భద్రత ప్రమణాల తనిఖీ, ఆమోదం కోసం వెచ్చించేది. అయిదేళ్ల విరామం తరువాత 2012లో జరిపిన పునరుద్ధరణలో కీలకమైన అంశం నిర్దిష్ట కాలవ్యవధిలో ఆమోదించే నూతన మందుల దరఖాస్తుల క్లియరెన్స్‌కు ఎఫ్‌డిఏ పెంచాలని చెప్పడం. ఎఫ్‌డిఏ కొత్త మందుల దరఖాస్తులను ఎంత ఎక్కువగా ఆమోదిస్తే దాని సామర్థ్యం అంత ఎక్కువగా వున్నట్టు ఈ కొత్త నిబంధనలు నిర్దేశిస్తున్నాయి.

స్వల్పకాలిక పేటెంట్ గడువు కలిగిన మందులు పెద్దయెత్తున మార్కెట్‌లో అమ్మి సొమ్ము చేసుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు దండిగా లాభాలు ఆర్జిస్తున్నాయి. పిడియుఎఫ్‌ఎ ఇప్పుడు చేయాల్సిన పని ఈ మందులను త్వరితగతిన మార్కెట్‌లోకి అనుమతించడం. అలా చేయడం ద్వారా కార్పొరేట్ కంపెనీలకు మరిన్ని లాభాలు చేకూరేలా చూడడం. 1989కి ముందు వరకు మెడిసిన్స్ కంట్రోల్ ఏజెన్సీ (ఎంహెచ్‌ఆర్‌ఎకు మార్గదర్శి)కి వినియోగ రుసుం ద్వారా 65 శాతం, పన్నుల ద్వారా 35 శాతం వనరులు సమకూరేవి. మార్గరెట్ థాచర్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ ప్రభుత్వం ఫిలాసఫీ అమల్లోకి వచ్చాక ఈ వినియోగ రుసుం వాటాను వంద శాతానికి పెంచేశారు. సైన్స్ అనేది పరిశ్రమ అవసరాలను తీర్చేందుకే ఉపయోగపడాలని థాచరిజం చెబుతుంది.

ఈవినియోగ ఛార్జీల ఫిలాసఫీని నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసినప్పటి నుంచే అనుమతించాలని యావత్తు యూరపు వాదిస్తూ వస్తున్నది. ఇక్కడ సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ విధానం ఎవరి ప్రయోజనాలను నెరవేరుస్తుంది? ప్రజలదా? పారిశ్రామికాధిపతులదా?

వినియోగ ఛార్జీలు ప్రజల ఆరోగ్య భద్రత పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయనడానికి ఆధారాలు కోకొల్లలు. అమెరికాలో ఒక కొత్త మందు దరఖాస్తును సమీక్షించేందుకు గరిష్ట గడువు 300 రోజులు. పిడియుఎఫ్‌ఎ, ఎఫ్‌డిఏ నిబంధనల ప్రకారం ఆ గడువు లోపల 90 శాతం దరఖాస్తులను సమీక్షించాలి. ఈ లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోతే వాటికి వినియోగ రుసుం రెన్యూవల్‌కు ఎసరు రావచ్చు. నియంత్రణ సంస్థకు ప్రధాన ఆదాయవనరు ఇదే కాబట్టి నిర్దిష్ట గడువు లోపలే కొత్త మందులకు ఆమోదం పై నిర్ణయం వెల్లడించాలి. త్వరగా వీటిని తేల్చాలనే హడావిడిలో భద్రతా మదింపు ప్రమాణాలను సడలించుకోవాల్సి వస్తుంది. ఇతర సమయాల్లో ఆమోదించిన మందులతో పోల్చితే నిర్దిష్ట గడువుకన్నా రెండు మాసాలు ముందుగానే ఆమోదం తెలపాలంటే భద్రతా ప్రమాణాలను బాగా సడలించాలి. ఎఫ్‌డిఏ చేసే అత్యంత తీవ్రమైన భద్రతా హెచ్చరిక ‘బ్లాక్ బాక్స్ వార్నింగ్’ను కూడా సడలించాలి.

యూరోపియన్ యూనియన్‌లో ఇఎంఏకు మందులపై దరఖాస్తు చేసుకుంటే ఆ నూతన మందు గురించి అంచనా వేయాల్సిన జాతీయ రెగ్యులేటరీ సంస్థే దానికి బాధ్యత వహిస్తుంది. కొత్త ఔషధ దరఖాస్తుపై వాస్తవిక మదింపు వేసేందుకు లేఖకుడ్ని, సహ లేఖకుడ్ని అది నియమిస్తుంది. యూరోపియన్ యూనియన్ దేశాల్లోని రెగ్యులేటరీ సంస్థలకు యూజర్ ఫీజుల రూపంలో గణనీయంగా నిధులు సమకూరుతాయి. లేఖకుడు, సహ లేఖకుడు హోదాలో వున్న వారికి రాబడి బాగా వుంటుంది గనుక ఈ పోస్టులకు విపరీతమైన పోటీ వుంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ మూలంగా తలెత్తిన అంతర్జాతీయ సంక్షోభ కాలంలో దానిలో అవిభాజ్యంగా వున్న ఔషధ పరిశ్రమ తన ఉత్పత్తులను అమ్మి సొమ్ము చేసుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఆ అన్వేషణ ప్రజల నిజమైన ఆరోగ్య అవసరాలను తీర్చేలా మందుల ఉత్పత్తి, ధరల విధానం ఉండాలే తప్ప భారీ లాభాలు ఆర్జించేదిగా ఉండరాదు.

**(ఈ వ్యాస రచయిత న్యూయార్క్ యూనివర్శిటీలో ఆరోగ్య విధానంపై బోధిస్తారు. టొరంటోలోని యూనివర్శిటీ హెల్త్ నెట్ వర్కులో ఎమర్జన్సీ ఫిజిషియన్‌గా పనిచేస్తున్నారు.)**

# జీవన సౌలభ్యం - వాస్తవాలకు దూరం



రచయిత
సిమ్లా నగర డిప్యూటీ మేయర్

**తికేందర్ సింగ్ పన్వార్**

కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఇటీవలే జీవన సౌలభ్య నగరాల జాబితాను ప్రకటించింది. శాస్త్రబద్ధంగా రూపొందించిన ప్రమాణాల ఆధారంగా నిర్వహించిన సర్వేలో దేశవ్యాప్తంగా 111 నగరాలకు ఈ జాబితాలో స్థానం లభించింది. ఈ జాబితా ప్రకారం దేశంలో పూణే ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ చివరి స్థానంలో ఉంది. ఈ నగరాల్లో జీవనం సుఖవంతంగా ఉంటుందని, మిగిలిన నగరాల్లో ఈ స్థాయి సౌకర్యాలతో కూడిన మంచి జీవితం గడపడం ఒక సవాల్ వంటిదని దీనర్థం!

జీవన సౌలభ్య నగరాల్లో నవీ ముంబాయి. ముంబాయి రెండు, మూడు స్థానాల్లో ఉండగా, తిరుపతి నాల్గవ స్థానంలోనూ, ఛండీఘర్ ఐదవ స్థానంలోనూ నిలిచింది. భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే ఈ జాబితాలోని మొదటి పది నగరాల్లో ఆరు దక్షిణాదికి చెందినవే! ఉత్తర భారత దేశానికి చెందిన నగరం ఒకటి మాత్రమే మొదటి పదిలో స్థానం పొందింది. బెంగళూరు, చెన్నై, ఢిల్లీ వంటి పెద్ద నగరాలు వెనకబడ్డాయి. ఈ సర్వేను అథెనా ఇన్ఫోనామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇప్సోస్ రీసెర్చ్‌ప్రైవేట్ లిమిటెడ్, ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ అనే మూడు సంస్థలు ప్రధానంగా నిర్వహించాయి. నగర ప్రణాళిక, ఆర్థిక నిర్వహణ, వాతావరణ మార్పుల వంటి రంగాల్లో నిష్ణాతులైన వారు ఈ సంస్థల్లో ఉన్నారు. వీరందరూ పోటీ, సామర్థ్య, స్మార్ట్ నగరాల భావజాలాన్ని అంగీకరించిన వారే కావడం విశేషం.

సమాచారాన్ని ప్రపంచబ్యాంకు నిర్దేశిత నమూనాలు, పద్ధతుల్లో సేకరించి, క్రోడీకరించడం ద్వారా సులభతర వాణిజ్య, జీవనసౌలభ్య నగరాలుగా ఈ సంస్థలు గుర్తించాయి. దీనికోసం అంతర్జాతీయ, జాతీయస్థాయిలో లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని దిగువస్థాయికి తీసుకువెళ్లే 'పై నుండి దిగువకు' పద్ధతిని వారు వ్యూహాత్మకంగా అనుసరించారు. ఈ విధానంలో మౌలిక వసతులపైనే ప్రధానంగా దృష్టి సారించడం జరుగుతుంది. అయితే, నగరాలంటే కేవలం మౌలికవసతులు మాత్రమే కాదు. ఆ మౌలికవసతులు ప్రజల కోసం, వారికి అందుబాటులో ఉండాలి. తన హృదయ ఆకాంక్ష లకు అనుగుణంగా నిర్మించుకునే ఈ నగరాల్లో మనిషి తరచు ప్రకృతికి విరుద్ధమైన చర్యలకు దిగుతున్నాడని, ఫలితంగా తన మనుగడను ప్రశ్నార్ధకం చేసుకుంటున్నాడని ప్రముఖ సామాజిక శాస్త్రవేత రాబర్ట్ ప్రాక్ వ్యాఖ్యానించారు. జీవన సౌలభ్య అనే పదం చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. కానీ దురదృష్టవశాత్తు నగరాల్లోని క్షేత్రస్థాయిలో కనిపించే వాస్తవాలు కాకుండా, కార్పొరేట్లు నిర్వహించే సమాచారం ఆధారంగా పైనుండి రుద్దే అజెండాతో దీనిని నిర్ధారిస్తున్నారు.

ఢిల్లీకి చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కు చెందిన బోధనాసిబ్బంది ఒక్కరు ఈ మొత్తం ప్రక్రియను జిమ్మిక్కుగా అభివర్ణించారు. నగరాలు పరస్పరం పోటీ పడాలన్న పాలకవర్గాల ఆలోచన నగరీకరణలో నూతన సరళీకరణ ఆర్థిక విధానాలను అమలు చేయడమే! పెట్టుబడుల కోసం తపిస్తున్న నగరాల స్వభావం, రూపం క్రమేణా మారుతోంది, అవి మేనేజర్ల పాత్ర నుండి పెట్టుబడిదారుల స్వభావాన్ని సంతరించుకుంటున్నాయి. వినియోగమయ్యే భూమి స్వభావాన్ని మార్చడం ద్వారా నగరాన్ని ఒక వ్యాపార క్షేత్రంగా మార్చివేస్తున్నారు. స్మార్ట్ సిటీల్లో ఇదే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న స్పెషల్ పర్పస్ వెహికల్ ( ఎస్‌పివి)ని కంపెనీల చట్టం ప్రకారం రిజిస్టర్ చేస్తున్నారు. ఇలా చేయడం ద్వారాస్థానిక ప్రభుత్వాలకు జవాబుదారితనంగా ఉండవలసిన బాధ్యత దీనికి ఉండదు. స్థానికంగా ఎన్నికైన ప్రభుత్వాల పరిధిలో లేనందువల్ల పథకాలను సమర్ధవంతంగా, సత్వరంగా పూర్తి చేయవచ్చని భావిస్తున్నారు. అట్టహాసంగా ప్రకటిస్తున్న జీవన సౌలభ్యానికి అంత ప్రాధాన్యతేమీ లేదు. నిజానికి దాదాపు అన్ని సందర్భాల్లోనూ క్షేత్రస్థాయి వాస్తవాలకు ఇది విరుద్ధంగా ఉంది. దీనికోసం పై నుండి ఇచ్చిన సమాచారానికి, ప్రజల నిజ జీవిత లెక్కలకు పొంతన లేని పరిస్థితి నెలకొంది.

**నగరాలు రూపుమారడంలో ఇవి కీలకాంశాలు**

ప్రైవేటీకరణ : కేవలం పాలనాపరమైన సౌకర్యం కోసమే కాదు. పెట్టుబడులను ఆకర్షించే పేరిట భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యం. .ఐబిఎం, సిస్కో వంటి భారీ కార్పొరేట్ సంస్థలు అందించే సమాచారం ఆధారంగానే నగరాల నిర్వహణ జరుగుతుంది. ప్రభుత్వ వనరులు, పౌర సేవలను ప్రైవేటీకరించడమో, పిపిపి పద్ధతికి అప్పగించటమో చేస్తారు.

సౌలభ్యనగరాల రూపకల్పనకు పై మూడు కీలకం. అదే విధంగా సంస్థాగత, సామాజిక, ఆర్థిక, భౌతిక అంశాలపై ఆధారపడి ఈ మొత్తం కసరత్తు సాగుతుంది.

పాలన. విద్య. సంస్కృతి,ఆరోగ్యం, భద్రత, ఉపాధి-ఆర్థిక నిర్వహణ, సమ్మిళిత గృహ నిర్మాణం, పౌర ఖాళీ స్థలాలు, మిశ్రమ భూమి వినియోగం, అందుబాటులో ఉన్నభూమి, విద్యుత్ సరఫరా, రవాణా-ప్రయాణ సౌకర్యాలు, నీటిసరఫరా, మురుగునీటి నిర్వహణ, సమగ్ర చెత్త విధానం, తక్కువ కాలుష్యం తదితర 15 అంశాలు జీవనసౌలభ్య నగరాల ఎంపికకు ప్రాతిపదిక. పాలనా పద్ధతిలో సెంట్రల్ కమాండ్, కంట్రోల్ సెంటర్ వంటివి ఏర్పాటు చేసి వాటి ద్వారా నగరాలను పర్యవేక్షిస్తారు. మౌస్‌ను క్లిక్ చేయడం ద్వారా అభివృద్ధి చేస్తామంటే ఎవరు మాత్రం కాదంటారు? అయితే, అసాధారణ రీతిలో లాభార్జనే లక్ష్యంగా కల భారీ కార్పొరేట్ సంస్థలు ఈ కమాండ్ సెంటర్లను నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థలు అందించే సమాచారం ఆధారంగా పౌర పాలన సంస్థలు పనిచేయాల్సి

> **“ మురికివాడల్లో నెలకొన్న పరిస్థితులు, వాటి అభివృద్ధికి జరుగుతున్న కృషి జీవన సౌలభ్య నగరాల సూచికలో విస్మరించారు. ఒక నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా కోట్లాది మంది మురికివాడల్లో నివసిస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో అత్యధిక మందికి నగరపాలక సంస్థలు కుళాయిల ద్వారా నీటిని అందిస్తున్నాయి. ఇటువంటి కృషిని జీవన సౌలభ్య నగరాల సూచికలో పరిగణనలోకి తీసుకోవడం లేదు.”**



ప్రభుత్వాలు గొప్పగా ప్రచారం చేస్తున్న స్మార్ట్ సిటీలు

ఉంటుంది. స్మార్ట్ సిటీలు దీనికో ఉదాహరణ. వీటిలో పోలీసింగ్, ట్రాఫిక్, విద్యుత్‌సరఫరా వంటి కీలక బాధ్యతలను కమాండ్ సెంటర్ల పేరిట కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. సాంప్రదాయంగా ప్రభుత్వాలు నిర్వహించే అనేక పౌర సేవలను సొంతం చేసుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం సమాచారాన్ని కంప్యూటరీకరించడానికి (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) 19 ట్రిలియన్ డాలర్ల వాణిజ్య అవకాశాలు ఉన్నాయి, (ఒక ట్రిలియన్ డాలర్లు 72 లక్షల కోట్ల రూపాయలకు సమానం) స్మార్ట్‌సిటీల పరిశ్రమ 2020 నాటికి 1.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఫోర్బ్స్ అంచనా! పెరుగుతున్న ఈ నూతన పరిశ్రమ ప్రజల వనరులను, సౌకర్యాలను ప్రైవేటీకరించాలని. ద్రవ్య వ్యాపారంగా మార్చాలని డిమాండ్ చేస్తోంది. ఫలితంగా ప్రజల వనరులు కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిపోతుండగా, ఖర్చు పెట్టి కొనగలిగిన వారికే సౌకర్యాలు అందుబాటులో ఉంటున్నాయి. మన సమాజంలో అసమానతలు మరింతగా పెరగడానికి ఇది దారి తీస్తోంది. పూర్తిస్థాయి సాంకేతికతపై ఆధారపడి నిర్వహించే స్మార్ట్‌సిటీలు వ్యక్తుల స్వేచ్ఛను, హక్కులను హరిస్తాయి. ఏమాత్రం సామాజిక భాధ్యతలేని. ప్రజల హక్కులకు నామమాత్రపు పూచీలేని సమాజానికి దారి తీస్తుంది. అటువంటి పరిస్థితుతో నిండిఉండే భవిష్యత్తులో నివసించడం సామాన్యులకు ఏమాత్రం సౌలభ్యం కాదు.

ఈ సంస్థల సమాచార విశ్లేషణ ఎలా ఉంటుందో పరిశీలిద్దాం. 2017 వరకు త్రివేంద్రం (తిరువనంతపురం) దేశానికే ఆదర్శంగా ఉంది. భారత నగరాల నిర్వహణ సంస్థ (ఎఎస్ఐసిఎస్) ఆధ్వర్యంలో ఇక్కడ ప్రతి సంవత్సరం పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేవారు. వార్షిక ఆరోగ్య పరీక్షలు జరిగేవి. చట్టాల అమలు నాణ్యత, విధానాలు, పౌరసేవలను ప్రజలందరి భాగస్వామ్యంతో సమీక్షించేవారు. ఫలితంగా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు అందేలా చర్యలు తీసుకునేవారు. దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న ఆ నగరం జీవన సౌలభ్య జాబితాలో 71వ స్థానాన్ని పొందింది, చెన్నై, కొచ్చిలకు కూడా ఇదే అనుభవం ఎదురైంది.

మురికివాడల్లో నెలకొన్న పరిస్థితులు, వాటి అభివృద్ధికి జరుగుతున్న కృషి జీవన సౌలభ్య నగరాల సూచికలో విస్మరించారు. ఒక నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా కోట్లాది మంది మురికివాడల్లో నివసిస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో అత్యధిక మందికి నగరపాలక సంస్థలు కుళాయిల ద్వారా నీటిని అందిస్తున్నాయి. ఇటువంటి కృషిని జీవన సౌలభ్య నగరాల సూచికలో పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఉత్తర భారతదేశానికి చెందిన ఒక నగరం ఈ దిశలో గణనీయమైన కృషి చేసింది. దాదాపుగా నగరంలో ఉన్న అన్ని మురికివాడలకు కొళాయి ద్వారా నీటిని అందించే లక్ష్యాన్ని చేరుకుంది. ఫలితంగా అంతకు ముందు నీటికోసం ఎన్నో కష్టాలు పడి, ఎంతో దూరం నుండి తెచ్చుకున్న ప్రజల జీవితాలు సుఖవంతంగా మారాయి. పైగా నీటి వృద్ధా కూడా అరికట్టారు. అయితే, జీవన సౌలభ్య నగరాల ఎంపికలో ఈ కృషిని కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. మురికి వాడల వాసుల ఆనందాన్ని పట్టించుకోలేదు. సామాన్యులు నివసించే ప్రాంతాలు, వారికి కల్పించే సౌకర్యాలపై కార్పొరేట్ల దృష్టి ఎలా ఉంటుందో చెప్పడానికి ఇదో ఉదాహరణ. విమర్శలు రావడంతో ఆ సమాచారాన్ని స్థానిక ప్రజాసంస్థలు తమకు అందచేయలేదని ఆ సంస్థలు ఇప్పుడు చెబుతున్నాయి. పర్వత నగరాలకు, మైదాన ప్రాంత నగరాలకు ఒకే సూచికలను వర్తింపచేశారు. రవాణా సౌకర్యాలంటే వారి దృష్టిలో ఫ్లైఓవర్ల నిర్మాణంగా మాత్రమే ఉంది! ఇది సమ్మిళిత రవాణా లక్ష్యాలను విస్మరించడమే!

జీవన,సౌలభ్య నగరాల్లో వివిధ విభాగాల కింద ఎంపికైన నగరాలను ఒకసారి పరిశీలిద్దాం. ఛండీఘర్‌కు సాంస్కృతిక నగరంగా అత్యధిక పాయింట్లు దక్కాయి. వాస్తవానికి ఈ నగర నిర్మాణం జరిగి 300 సంవత్సరాలే! ఇంతకన్నా ప్రాచీన చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాలు కల నగరాలు దేశంలో ఎన్నో ఉన్నాయి. సుపరిపాలన విభాగంలో నవీ ముంబాయి మొదటి స్థానంలో ఉండగా, అంతకన్నా మెరుగైన పాలనా పద్ధతులు అనుసరించే నగరాలకు స్థానం లభించ లేదు. అదే విధంగా విద్యలో ఫరీదాబాద్‌కు మొదటి స్థానం దక్కింది.

వాస్తవానికి ఢిల్లీ నగరం ఆ విభాగంలో అంతకన్నా ఎంతో మెరుగని ఎవరైనా అంగీకరించే సత్యం. ఇలా చెప్పుకుంటూ పోతే వాస్తవాలకు దూరంగా సాగిన జీవన సౌలభ్య నగరాలకు ఉదాహరణలు ఎన్నో! లాభాపేక్షే లక్ష్యంగా, ప్రజల వనరులను కాజేస్తూ కొద్ది మందికి విలాసవంతమైన సౌకర్యాలు అందించడం కన్నా, ప్రజలందరు ఆత్మ గౌరవంతో మెలగగలిగేలా చర్యలు తీసుకోవడమే నిజమైన జీవన సౌలభ్యమని ఎవరైనా ఒప్పుకుంటారు.

❋

# లౌకికవాదులు చేయవలసిందేమిటి?

*బిపన్‌చంద్ర రచించిన మతోన్మాదం పుట్టుక పరిణామం నివారణ గ్రంథం నుండి ఈ భాగాన్ని మార్పిస్తూ పాఠకులకు అందిస్తున్నాం - సంపాదకులు*

1. మతతత్వవాదులు ఎజెండా తయారు చేసి ముందు పెడితే దానికి కేవలం ప్రతి స్పందించే పరిస్థితి ఉండకూడదు. మతతత్వం భారతదేశానికి, భారత ప్రజలకు పెనుముప్పుగా మారిన విషయంపై దృష్టి పెట్టాలి. మతతత్వం జాతి వ్యతిరేకమని, ప్రజాస్వామ్య వ్యతిరేకమని, భారతీయ సంస్కృతికి, విలువలకు, నాగరికతకు, హిందూ మత సహనశీలతకు, వైవిధ్య స్ఫూర్తికి భారతీయ నాగరికతకు, అలాగే ఇస్లాం, క్రైస్తవాలకు విరుద్ధమని ప్రజలకు వివరిస్తూ మతతత్వవాదులపై ముమ్మరంగా దాడికి దిగాలి. సామాజిక, రాజకీయ చర్చ నడకను, దాని ద్వారా జాగ్రుతం కావల్సిన అంశాలను మనం క్రమేణా మార్చాలి. తద్వారానే మతతత్వాన్ని ఎదుర్కోగలం.

2-ఎ. భారతీయ సంస్కృతికి, నాగరికతకు సంరక్షకులమంటూ మతతత్వవాదులు చెప్పుకుంటున్నారు. ఈ క్లెయిమును మనం ఖండించితీరాలి. అనేకతాసూత్రం, సమ్మేళనం, సంశ్లేషణల వంటి ఉదాత్త సాంస్కఅతిక ప్రాచీన విలువలకు మతతత్వం వ్యతిరేకమని మన జాతీయ ఉద్యమానికి రాజ్యాంగానికి ప్రాతిపదిక అయిన లౌకికవాదం, ప్రజాస్వామ్యాల వంటి ఉన్నత ఆధునిక విలువతో పాటు వాటి పునాదులనూ ధ్వంసం చేయాలని అది చూస్తోందని మనం వేలెత్తి చూపాలి. భారతీయ సమాజపు బహుళ సంస్కృతి స్వభావాన్నీ, మన సంకీర్ణ సంస్కృతి క్రమానుగత చారిత్రక పరిణామాన్నీ మనం ప్రజలకు హృద్యంగా వివరించితీరాలి.

బి. ఒక బహుళ మత, బహుళ సంస్కృతి సమాజంలో ప్రజాస్వామ్యం, జాతీయ అభివృద్ధి, జాతీయ ప్రయోజనం, జాతీయతా సగర్వం, జాతీయతా బలం వంటి నిలువల గురించి, వాటి స్వభావం గురించి ప్రజలకు మనం వివరించితీరాలి.

ఈ ప్రయత్నంలో జాతీయ సమైక్యతను సజాతీకరణగానో లేదా సమైక్యత అంటే భిన్నత్వానికి వ్యతిరేకమనో అనుకునేట్లు గందరగోళ స్థితి కల్పించకూడదు. వాస్తవానికి, మన సమాజ వైవిధ్యతకు భంగం కలిగించే ఎలాంటి ప్రయత్నమైనా, మైనారిటీలను (మతపరమైన, సాంస్కృతిక పరమైన) నామమాత్రీకరించే ఎలాంటి ప్రయత్నమైనా జాతీయ సమైక్యతకు ముప్పుగానే పరిణమిస్తుంది. ఇరాక్ తాజా సంఘటనల నుంచి మనం ఒక పాఠం నేర్చుకోవాలి. అక్కడ జాతీయ సమైక్యత పేరిట ఏకజాతీయతను బలవంతంగా రుద్దే ప్రయత్న ఫలితంగా షియాలు సున్నీలనుంచి, కుర్దులు కుర్దేతరులనుంచి చీలిపోయారు. దాంతో అమెరికా దాడులను ప్రతిఘటించడంలో ఆ దేశం విఫలమైంది. ఇదే తరహాలో, మెజారిటీ మైనారిటీ సంఘర్షణలతో లెబనాన్ దాదాపు ఉనికిలో లేకుండా పోయింది. శ్రీలంక మరో ఉదాహరణ. సింహళ అధిక సంఖ్యాక వర్గం తమిళ మైనారిటీలను నామమాత్రం చేయబోయిన ఫలితం ఇప్పుడా దేశం అనుభవిస్తోంది. జవహర్‌లాల్ నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో వేదకాలం నుంచి భారత్‌కు సంక్రమించిన సాంస్కృతిక వారసత్వం పట్ల ప్రకటించిన అభిప్రాయాన్ని మనం ఈ సందర్భంగా ప్రస్తావించాలి. నూతన ప్రభావాలకు, సవాళ్లకు అది ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంచేది. ఫలితంగా ఒక సంకీర్ణ సంస్కృతి ఈ గడ్డ మీద వేరూనుకుంది. భిన్నత్వాన్ని ఈ సమాజం స్వాగతించింది. దీన్ని మనం గర్వించ దగిన సమున్నత వారసత్వంగా నెహ్రూ పేర్కొన్నాడు. ఈ మౌలిక వైఖరి ఆవశ్యకతను మనం దేశ ప్రజలకు అవగతపరచితీరాలి.

సి. మేమే హిందూ మత పరిరక్షకులమని హిందూ మతతత్వవాదులు చెప్పుకుంటున్నారు. దీన్ని మనం ఖండించితీరాలి. హిందూ, ఇస్లాం, క్రైస్తవం, సిక్కుమతాల మీద, మొత్తంగా మతం మీద మన స్వంత ప్రవచనాన్ని లేదా వివరణను మనం అభివృద్ధి చేసుకునితీరాలి. మతానికి సంబంధించి గాంధీజీ భారతీయ సంస్కృతి పట్ల నెహ్రూ ఇలా తమ స్వీయ దఅక్పధాలను ఏర్పరచుకున్నారు. ఈ సందర్భంగా మనకు వారు ఆదర్శం. మరీ ముఖ్యంగా, మతాన్ని, లౌకిక వాదాన్ని మతతత్వాన్ని గాంధీజీ ఎలా పరిగణించాడో, వాటి విషయంలో ఎలా వ్యవహరించాడో మనం ప్రజలకు తెలియజెప్పాలి. ఇంతకు ముందు చెప్పినట్లు, కాషాయీకరణ, భగ్వా కరణ్, పరివార్, హిందూ జాతీయతావాదం, హిందూ హక్కు, గోవుల ప్రాంతం వంటి తప్పుదారి పట్టించే పదప్రయోగాలకు పాల్పడి వారి ప్రయోజనాలకు తోడ్పడకూడదు.

డి. భారత్ గతంలో సాధించిన ఘన కృత్యాలను మనం గుడ్డిగా, అసత్యపూరితంగా కాకుండా మరింత గట్టిగా జాతి జనులకు గుర్తుచేయాలి. ఇక్కడ మనకు ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. గతంలోని వేటిని ప్రశంసించాలి. వేటిని విమర్శించాలి అన్నది ఈ ప్రశ్న. గాంధీజీ, నెహ్రు, సి. రాజగోపాలాచారి, తిలక్, రణడే, మౌలానా అజాద్ స్వామి వివేకానందల వైఖరిని ఈ విషయంలో మనం స్వీకరించి తీరాలి. ఉదాహరణు వివేకానందుడి వైఖరినే తీసుకోండి. గత కాలపు మేధో వ్యతిరేక, నిర్హేతుక మత సామాజిక అంధ విశ్వాసాలను ఆయన వ్యతిరేకించాడు. 'సైన్సు మాదిరిగానే మతం కూడా తర్కబద్ధమైన ఆవిష్కరణలతో తనను తాను నిరూపించుకోవాలా? సైన్సుకు, మతేతర విజ్ఞానానికి వర్తించే విచారణ పద్ధతులే మతం అనే సైన్సుకు వర్తింపజేయాలా? నా ఉద్దేశంలో అలాగే జరిగితీరాలి. ఇదిఎంత తొందరగా జరిగితే అంత మంచిదని నా అభిప్రాయం ' అని వివేకానందుడు చెప్పాడు. ఆయన ఇంకా ఇలా అన్నాడు. 'ఆలోచనలో, ఆచరణలో స్వేచ్ఛ కలిగి ఉండటమే జీవితం, ప్రగతి, సంక్షేమం అది ఎక్కడైతే ఉండదో అక్కడి మానవుడు, జాతి, దేశం అధోగతి పాలవక తప్పదు.'

> **"మరోవంక మతతత్వవాదులు ఆక్రమించుకో జూస్తున్న జాతీయతావాద క్షేత్రాన్ని వారి చేజిక్కకుండా కాపాడుకోవాలి. మతతత్వవాదులు వేర్పాటు శక్తులను ప్రోత్సహిస్తారని, కాబట్టి వారు జాతీయ సమైక్యతకు ముప్పుగా పరిణమిల్లారని వేలెత్తి చూపాలి. వారి సంకుచిత మనస్తత్వం మతం పేరు చెప్పి ఒక భారతీయుడిని మరో భారతీయుడి మీదకు ఉసిగొల్పుతుంది."**

ఇ. మతతత్వం నిజస్వరూపాన్ని, ముఖ్యంగా మతానికి నైతిక రాజకీయాలకు అది ఎలా విరుద్ధమైందో వాస్తవాన్ని వెలికితీయాలి. మతం వేరు, మతతత్వ ప్రయోజనాలకు మత దుర్వినియోగం వేరు అన్న విషయాన్ని స్పష్టం చేయాలి.

ఎఫ్. 'మృదు హిందుత్వ' ప్రత్యమ్నాయాన్ని మనం తీవ్రంగా వ్యతిరేకించాలి. హిందు మతాన్ని,దాని అనేకతాసూత్ర సంప్రదాయాలను, మన చరిత్రలో వేరూని ఉన్న భారతీయ సంకీర్ణ సంస్కృతిని, హిందూ సంప్రదాయాలను, తాత్విక విచారణలను, ఇతిహాసాలను తదితరాలను, మధ్యయుగాలలో ఆధునిక కాలంలో మరింత అభివృద్ధి చెందిన ఈ సంస్కృతిని సగర్వంగా చాటుకోవడం 'హిందుత్వ' లేదా మతతత్వం కాబోదు. ముస్లింలు, సిక్కులు లేదా క్రైస్తవుల మత భావాలను పరిగణనలోకి తీసుకోవడం 'మృదు మతతత్వం' కాదు, హిందువుల మత భావాలను పరిగణనలోకి తీసుకోడం అంతకంటే 'మృదు హిందూత్వ' లేదా 'మృదు మతతత్వం' కాబోవు.

అలాగే దీపావళి, దుర్గా పూజ, ఈద్ లేదా క్రిస్మస్ వంటి మత – సామాజిక ఉత్సవాల్లో పాల్గొనడం ఏ విధమైన మతతత్వ కాబోదు. కాని ఎలాంటి సామాజిక, సాంస్కృతిక లేదా మత దృక్పథాన్ని అందరిపై రుద్దే ప్రయత్నం వాంఛనీయం కాదు. మనం ఈ విషయంలో టీవీ జర్నలిజం ప్రభావానికి లోను కాకుడదు. లౌకికవాదులకు, మతతత్వవాదులకు మధ్య విభజన రేఖను మసకబారనీయకూడదు. 'మృదు హిందూత్వ' అనడమంటే హిందూ మతతత్వవాదులకు ఒక ఆసరా ఇచ్చినట్లే, వారు దాన్ని ఉపయోగించుకుని తమకూ లౌకికవాదులకూ తేడా ఏం లేదని, లౌకికవాదులది 'మృదు హిందూత్వ' అయితే తమది 'తీవ్ర హిందూత్వ'మని చెప్పుకుంటారు.

మతతత్వం యెడల ఎలాంటి అవకాశవాదం పనికిరాదు. లేదా దానికి ఎలాంటి రాయితీ ఇవ్వకూడదు. వాటిని ఖండిస్తూనే ఉండాలి.

3. మేం జాతీయతావాదానికి, జాతీయ సమైక్యతకు, లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికి, ఆర్థిక సామాజిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని లౌకికవాద పార్టీలు, వ్యక్తులు ఢంకా బజాయించి చెప్పాలి. జాతీయతావాదాన్ని స్పష్టంగా నిర్వచించుకోవాలి. జాతీయ ఉద్యమ స్వరూప స్వభావాల మీద, అది సాధించిన విజయాల మీద దృష్టి కేంద్రీకరించాలి. భారత్ సమకాలీన ప్రపంచంలో నేడు ఇంతటి ఉన్నత స్థానానికి ఎలా చేరుకోగలిగిందో, ఇంతటి ఆర్థిక స్థాయిని ఎలా అందుకోగలిగిందో ప్రజలకు తెలియజెప్పాలి. అత్యున్నత ప్రమాణాలతో కూడిన టెక్నాలజీ సంస్థల శాస్త్ర ప్రయోగశాలల, ఆసియా లోకెల్లా ఇంకా చెప్పాలంటే ప్రపంచంలోకెల్లా ధీటైన కొన్ని విశ్వవిద్యాలయాల అభివృద్ధి ఎలా సాధ్యపడిందో, ఐటీ విప్లవంలో ఎలా భాగస్వాములం కాగలిగామో, మన స్వశక్తితో అణుపాటవాన్ని ఎలా పొందగలిగామో, భారత్ ఒక అణుశక్తిగా ఎలా ఆవిర్భవించగలిగిందో వారికి వివరించాలి. ఇవన్నీ మన ఘన విజయాలు... ఇవన్నీ భారత జాతీయ ఉద్యమ విజయాలు. స్వాతంత్ర్యం అనంతరం భారత సమైక్యతకు ఎదురైన సవాళ్లను మనం విజయవంతంగా ఎదుర్కోగలిగాం. భాషా ప్రయుక్త రాష్ట్రాలు, జాతీయ అధికార భాషల సమస్యలను పరిష్కరించుకున్నాం. గిరిజనులను జాతీయ స్రవంతిలోకి తీసుకురాగలిగాం. రిజర్వేషన్లు, సామాజిక న్యాయం, మహిళల అణగారినతనం వంటి అంశాలకు పరిష్కారాలు కనుగొన్నాం.

జాతీయతా వాదాన్ని ఇంకా ఎలా బలోపేతం చేసుకోవాలన్నది, విచ్ఛిన్నశక్తుల ఆటలు ఎలా కట్టించగలమన్నది, ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న పేదరికాన్ని, అసమానతలను, సామాజిక న్యాయం సమస్యలను ఎలా పరిష్కరించుకోగలమన్నది, ఇవి మాత్రమే. నేడు ప్రజల ముందున్న నిజమైన సమస్యలు.

మరోవంక మతతత్వవాదులు ఆక్రమించుకోజూస్తున్న జాతీయతావాద క్షేత్రాన్ని వారి చేజిక్కకుండా కాపాడుకోవాలి. మతతత్వవాదులు వేర్పాటు శక్తులను ప్రోత్సహిస్తారని, కాబట్టి వారు జాతీయ సమైక్యతకు ముప్పుగా పరిణమిల్లారని వేలెత్తి చూపాలి. వారి సంకుచిత మనస్తత్వం మతం పేరు చెప్పి ఒక భారతీయుడిని మరో భారతీయుడి మీదకు ఉసిగొల్పుతుంది. ఒకసారి ఇలాంటి సంకుచిత మనస్తత్వం ప్రబలిందంటే అది కాలక్రమంలో భాష, ప్రాంతం, కులం, తెగ ప్రాతిపదికగా భారతీయుల నడుమ పరస్పర వైషమ్యాలకు దారి తీస్తుంది. కాబట్టి మతతత్వ పార్టీల జాతి వ్యతిరేక స్వభావాన్ని పదే పదే ఉద్ఘాటిస్తూ ఉండాలి.

ఈ సందర్భంగా చట్టం ఎదుట ప్రజలందరి సమానత్వం వంటి ప్రజాస్వామిక రాజ్యాంగ బద్ధమైన విలువలను ప్రస్తావించుకోవాలి. హిందువులుగానో, ముస్లింలు గానో లేదా దళితులుగా సైతం రాజ్యాంగ నిర్మాతలు తమను తాము భావించుకోలేదు. తాము దళితులు, గిరిజనులు అయినందువల్ల కాదు, సామాజిక న్యాయానికి మద్దతిచ్చిన భారతీయులు అయినందువల్ల, భారతీయ సమాజం నుంచి అస్పృశ్యతను, వివక్షను పారదోలాలన్న ఆశయం ఉన్నందువల్ల వారు దళితులకు, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించారు. భారతీయులను పౌరులుగానే తప్ప కులాలు లేదా మతవర్గాల సభ్యులుగా రాజ్యాంగం పరిగణించదు. గుజరాత్‌లో ఈ మధ్యన, అంతకు ముందు 1993 తర్వాత మహారాష్ట్రలో మాదిరిగా మతతత్వ శక్తులను బయట పెట్టేందుకు ప్రస్తుత చట్టాలను, న్యాయ వ్యవస్థలను వినియోగించుకోవాలి. మతతత్వవాదులను నిలదీసేందుకు, వారిపై పోరాడేందుకు న్యాయపరమైన అవకాశాలను మనం అన్వేషించాలి. ఇప్పుడున్న చట్టాల్లోనే ఇలాంటి అవకాశాలు చాలా ఉన్నాయి.

4. జాతీయ ఉద్యమ విలువలను, భావజాల దృక్పథాన్ని ప్రజలకు వివరించితీరాలి. అవి మతతత్వం లేదా యుద్ధోన్మాదాలకు ఎలా విభిన్నమైనవో విడమరచి చెప్పాలి. కాంగ్రెస్ వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ఉదారవాదులు పలు కోణాల్లో, పలు తరహాల్లో జాతీయ ఉద్యమానికి ఎలా వారసులో స్పష్టం చేయాలి. అదే మతతత్వవాదుల విషయానికి వస్తే, వారు ఏ వలసవాద వ్యతిరేక పోరాటంలో పాలుపంచుకోలేదు, పైగా 1936 తర్వాత వారు ఆ పోరాటాన్ని వ్యతిరేకించారు కూడా. వాళ్లు ఇప్పుడు పలువురు జాతీయవాద నాయకులను స్వంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

స్వాతంత్ర్య సమరంలో తమ ప్రతికూల పాత్రను కప్పిపుచ్చుకునేందుకు వీలుగా ఆ నేతలకు తాము వారసులం అనుకునేలా ప్రజలను మోసపుచ్చాలని చూస్తున్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో సామాజిక న్యాయం, మహిళా విముక్తి ఉద్యమంలో వారి ప్రతికూల పాత్రను బయట పెట్టాలి. 1950ల తొలినాళ్లలో ప్రవేశపెట్టిన హిందూస్మృతి బిల్లులకు వారు పూర్తిగా వ్యతిరేకం. అలాగే వారు గాంధీజీ, నెహ్రూ, ఇతర జాతీయవాద నాయకులను దుర్భాషలాడుతూ విమర్శించేవారు.

ఆనాటి ముస్లింలీగ్ మతతత్వ సంప్రదాయాలకు పాకిస్థాన్ నేటికీ మూల చెల్లిస్తూనే ఉంది. అలాంటివే హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్లు. అవన్నీ ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకిస్తాయి. ఆర్ఎస్ఎస్ నిర్మాణం, సంప్రదాయాలు, వ్యవహారశైలి అన్నీ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉంటాయి. ఈ వాస్తవాన్ని వెలుగులోకి తేవాలి. ఉదాహరణకు, ఆర్ఎస్ఎస్ అధినేతను ఆయన ముందరి అధినేత ఎంపిక చేస్తాడు. అలా ఎంపికైన వ్యక్తి తన జీవితాంతం ఆ పదవిలో కొనసాగుతాడు. అతడిని తొలగించే వీలు ఉండదు. అలాగే, దాని ఇతర అనుబంధ సంస్థల్లోనూ నామినేషన్ విధానమే గాని, ఎన్నిక జరగదు. యావత్ సంస్థాగత నిర్మాణం అప్రజాస్వామిక రీతిలోనే సాగుతుంది.

5. రాష్ట్రాలు, కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్న మతతత్వవాదులు విద్య, మీడియా రంగాల మీద అదుపు సాధించి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో స్కూలు పాఠ్య పుస్తకాల ద్వారా వారు దేశ చరిత్రను, సాహితీ సంపదను వక్రీకరిస్తున్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ ) మీద అదుపు సాధించి, 1998 తర్వాత వారీ పనికి పాల్పడ్డారు. మొత్తం మీద వారు ప్రభుత్వ యంత్రాంగం మీద తమ అధికారాన్ని మతతత్వ భావజాల ప్రచారానికి ఉపయోగిస్తారు. మరీ ముఖ్యంగా చరిత్రను వక్రీకరిస్తారు. ఎందుకంటే వక్రీకరించిన ఆ చరిత్రే మతతత్వ భావజాలానికి గుండెకాయ వంటిది.

6. మెజారిటీ లేదా మైనారిటీ అది ఏదైనప్పటికీ అన్ని మతతత్వాలపై ఏకకాలంలో దాడి జరగాలి.

(ఏ) హిందూ మతతత్వం కేవలం ముస్లిం వ్యతిరేకం కాదు. హిందువులు, హిందూ మతం కూడా అదే స్థాయిలో ప్రమాదానికి లోనవుతాయి. అలాగే మైనారిటీ మతతత్వాలు మైనారిటీల ప్రయోజనాలకూ భంగకరం అవుతాయి.

**“రాష్ట్రాలు, కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్న మతతత్వవాదులు విద్య, మీడియా రంగాల మీద అదుపు సాధించి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో స్కూలు పాఠ్య పుస్తకాల ద్వారా వారు దేశ చరిత్రను, సాహితీ సంపదను వక్రీకరిస్తున్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్సీఈఆర్టీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్) మీద అదుపు సాధించి, 1998 తర్వాత వారీ పనికి పాల్పడ్డారు.”**


గాంధీ, నెహ్రూ

(బి) స్థానికంగా విభిన్న మతతత్వాల నడుమ పొత్తులు కుదిరిన సందర్భాలను బహిర్గతపరచడం.

(సి) లౌకిక పార్టీల వేదికల నుంచి లౌకిక ముస్లిం, సిక్కు, క్రైస్తవ గొంతుకలను వినిపించడం, ప్రజలకు వాటిని సన్నిహితం చేయడం అవసరం. హిందువులు మాత్రమే లౌకికవాదులు, సహనశీలురు, ముస్లింలు సిక్కులు స్వభావసిద్ధంగా మతతత్వవాదులు అనే బీజేపి ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలి.

7. ఎ. మైనారిటీవాదం, కుహనా లౌకికవాదం ఆరోపణలను పూర్తిస్థాయిలో ఎదుర్కోవాలి.

బి. ఈ ఆరోపణను మొట్టమొదటగా గాంధీజీ, ఇతర జాతీయతావాద నాయకుల మీద వి.డి సావర్కర్, ఎంఎస్ గోల్వాల్కర్లు చేశారని చెప్పాలి.

సి. ఈ ఆరోపణను ఎదుర్కొనేటప్పుడు, ఇప్పుడు ఎందుకు కొందరికి అది నిజమేనని పిస్తోందో పరిశీలన అవసరం.

డి. ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులతో మాట్లాడేటప్పుడు వారు మన గురించి ఎలా అనుకుంటారోనని ఎంత జాగ్రత్త వహిస్తామో, హిందువులతోనూ అంతే జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఇ. ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరంగా ఉండాలి. మైనారిటీలు కట్టగట్టుకని వ్యవహరించే పద్ధతిని నిరుత్సాహపరచాలి. ఉదాహరణకు వారు ఎటు ఓటు వేయాలో ఉమ్మడి నిర్ణయం తీసుకుంటున్నట్లు బహిరంగంగా కనిపిస్తే ఆ ప్రాంతంలోని హిందువులు సైతం మత ప్రాతిపదికన ఏకీకృతం అయ్యే అవకాశం ఉంది. ముస్లింలు ఎటూ బిజేపి లేదా శివసేన అభ్యర్థిని వ్యతిరేకించడానికే మొగ్గుతారు. అది సహజం. కాని వారు కలిసికట్టుగా ఓట్లు వేయడం అలాంటిది కాదు. మనం ఈ విషయంలో అమెరికా రాజకీయ పార్టీల నుంచి పాఠం నేర్వాలి. అక్కడి నల్లజాతి ప్రజలు అత్యధికంగా డెమోక్రటిక్ పార్టీకి ఓటు వేస్తారు. ఎందుకంటే, రిపబ్లికన్ పార్టీలో శ్వేత జాత్యహంకార శక్తులు ఉంటాయి. డెమోక్రటిక్ పార్టీ తన జాత్యహంకార వ్యతిరేక విధానాలను చెప్పుకునేటప్పుడు, అది నల్లజాతి ప్రజలను నల్లజాతి వారుగా తమకు ఓటు వేయాలని అడగరు. నల్లజాతి నేతలు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోవడానికి బహిరంగ సమావేశాలు జరపరు. మన లౌకిక రాజకీయ పార్టీలు కూడా మతపరమైన, వర్గపరమైన నేతలను రాజకీయ మద్దతు ఇవ్వాలని అభ్యర్థించకూడదు.

8. మతతత్వంలో విభిన్న అంశాలు కలగలసి ఉంటాయి. ఇంద్రధనస్సులోని రంగుల్లా

> **“లౌకిక శక్తులు, ప్రభుత్వాలు లోగడ మతతత్వాన్ని, మతహింసను ఎదుర్కోడంలో ఎన్నో బలహీనతలను ప్రదర్శించాయి. వాటిని మనం నిజాయితీగా అంగీకరించాలి. ముఖ్యంగా, మతతత్వ భావజాల వ్యాప్తిని అరికట్టడానికి మనం తగినంతగా కృషి చేయలేదు. మనలో కొందరు, ప్రత్యేకించి కాంగ్రెస్‌లోని వారు, మత హింసను ఖండించడంలో, అణచి వేయడంలో మెతగ్గా కూడా వ్యవహరించారు.”**

అవి ఒక్కోటి ఒక్కో ప్రత్యేకత కలిగి ఉంటాయి. అవన్నీ కలిసి మతతత్వం అవుతుంది. కాబట్టి, కొన్ని మతతత్వ అంశాలు ఉన్నంత మాత్రాన సంబంధిత వ్యక్తులను మతతత్వవాదులుగా ముద్రవేయకూడదు. కాని, ఆ అంశాలను వేలెత్తి చూపి విమర్శ చేయాలి. (సెక్షన్ 1 (హెచ్) చూడగలరు).

9. సెక్షన్ 1(ఐ)లో పేర్కొన్నట్లు మత తత్వ నాయకులు, సిద్ధాంతకర్తలు వేరు. మతతత్వం ఒంటబట్టించుకున్న, మతతత్వంతో వ్యవహరిస్తున్న వారి సామాన్య అనుచరులు వేరు. ఈ తేడాను మనం స్పష్టంగా గుర్తించాలి.

10. లౌకికవాదం పశ్చిమ దేశాల భావన అనే వారిని మనం తీవ్రంగా వ్యతిరేకించాలి. ముఖ్యంగా, రాజకీయాల నుంచి మతాన్ని వేరు చేయాలన్న నిర్వచనంతో ఏకీభవించని వారిని అసలు ఉపేక్షించకూడదు. లౌకికవాదం భారతీయ సంప్రదాయంలో వేరూనుకుని ఉన్నదని, భారత జాతీయ ఉద్యమానికి అది పునాది రాయి అని, భారత రాజ్యాంగంలో అది కలికి తురాయిలా భాసిస్తోందని విడమరిచి చెప్పాలి.

11. మతతత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున రాజకీయ, విద్య, భావజాల పరమైన కసరత్తు అవసరం. ఇప్పటివరకూ మనం దీన్ని నిర్లక్ష్యం చేశాం. ప్రజాస్వామ్యం దానికదే మత తత్వాన్నుంచి మనల్ని కాపాడే కవచం కాబోదు. మతతత్వ వ్యతిరేక వారాన్ని ఏకకాలంలో దేశవ్యాప్తంగా నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టవచ్చు. గాంధీజీ, నెహ్రూ, పటేల్, సుభాష్ చంద్రబోస్, మౌలానా అజాద్, స్వామి వివేకానంద, భగత్‌సింగ్.. ఇలా ఒక్కో నాయకుడికి ఒక్కోరోజును అంకితం చేయాలి. ఈ ప్రచార ఉద్యమంలో ఉన్నత, మధ్యస్థాయి కార్యకర్తలే కాకుండా సాధారణ కార్యకర్తలను, గ్రామీణ, చిన్న పట్టణాల టీచర్లను, లాయర్లను, డాక్టర్లను భాగస్వాములుగా చేయాలి. భావజాలపరమైన స్థాయిలోనే ఇది ఉండాలి. పరస్పర ఉపకారాలు లేదా ఓట్ల సమీకరణ, లేదా పార్టీ బలోపేతం వంటి వాటికి తావివ్వకూడదు (ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి చేసినట్లు లెటర్స్ – టూ – ద ఎడిటర్ ఫోరం కోసం వారి సాయం తీసుకోవచ్చు.)

12. మతతత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమం నిరంతరం కొనసాగేట్టు ఉండాలి. దేశంలో ఎక్కడైనా భారీగా మత హింస పెచ్చరిల్లినప్పుడు లౌకికవాదులు, పార్టీలు స్పందిస్తాయి. కాని కొంతకాలానికి మళ్లీ ఉదాసీనమవుతాయి. అలాగే కొంతమంది ఎన్నికల సమయంలో గట్టి మతతత్వ వ్యతిరేకులు అవుతారు. ఎన్నికలు అయిపోయిన మరుక్షణం దాన్ని మర్చిపోతారు.

13. ఒకప్రాంతం, పల్లె, పట్నం, మొహల్లా, పాఠశాల, కళాశాల, పత్రిక, టీవీ ఇతర మాధ్యమాల్లో నెలకొని ఉన్న మత విశ్వాసాలేమిటో, ప్రజలు ఏమనుకుంటున్నారో తెలిసి ఉన్నప్పుడే మతతత్వ వ్యతిరేక భావజాల నిర్మాణం తాలుకూ కసరత్తు సక్రమంగా జరుగుతుంది. ప్రజల ఈ ప్రగాఢ విశ్వాసాల మీదే మనం మన కార్యక్రమంలో దృష్టి సారించాలి. ఎందుకంటే ప్రజల వాస్తవ భయాలేమిటో గుర్తెరిగి వాటిని తొలగించాలి. మామూలుగా విజ్ఞులైన వారిని సైతం అకర్షించే మతతత్వ భావజాల అంశాలను విశ్లేషించి వాటిని తిప్పికొట్టాలి. కాబట్టి, స్థానిక రాజకీయ కార్యకర్తలు ప్రజలతో కలిసిపోయి, ఆ ప్రజానీకం లో ఎలాంటి మతతత్వ భావనలు, నమ్మికలు పరివ్యాప్తమై ఉన్నాయో అవగాహన చేసుకోవాలి. వాటిలో వాస్తవం ఉంటే, ఆ మేరకు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

14. లౌకిక శక్తులు, ప్రభుత్వాలు లోగడ మతతత్వాన్ని, మతహింసను ఎదుర్కోడంలో ఎన్నో బలహీనతలను ప్రదర్శించాయి. వాటిని మనం నిజాయితీగా అంగీకరించాలి. ముఖ్యంగా, మతతత్వ భావజాల వ్యాప్తిని అరికట్టడానికి మనం తగినంతగా కృషి చేయలేదు. మనలో కొందరు, ప్రత్యేకించి కాంగ్రెస్‌లోని వారు, మత హింసను ఖండించడంలో, అణచివేయడంలో మెతగ్గా కూడా వ్యవహరించారు. 1984లో ఢిల్లీలో, 1982–84లో పంజాబ్‌లో, 1993 బొంబాయి లో, అంతకు ముందు మీరట్, మొరాదాబాద్ వంటి నగరాల్లో హింస చెలరేగిన సందర్భాలు ఇందుకు ఉదాహరణలు. భవిష్యత్‌లో ఇలాంటి పొరబాట్లను మనం పునరావృత్తం చేయకూడదు.

15. కాంగ్రెస్ పట్ల ప్రదర్శించే గుడ్డి వ్యతిరేకత కాంగ్రెసేతర లౌకిక పార్టీల, వ్యక్తుల మరో బలహీనత. మతతత్వ శక్తులకు ప్రత్యక్ష లేదా పరోక్ష మద్దతు ఇవ్వడానికి లేదా వాటిని వ్యతిరేకించడంలో బలహీనంగా ఉండటానికీ ఇది దారితీసింది. పార్లమెంటరీ ప్రజాస్వామిక ప్రక్రియలో రాజకీయ వైరుధ్యాలు, పరస్పర వ్యతిరేకతలు సాధారణమే అయినప్పటికీ, అవి మతతత్వశక్తుల బలోపేతానికి దోహదపడకుండా జాగ్రత్త వహించాలి. అదృష్టవశాత్తూ, ఈ తరహా కాంగ్రెస్ వ్యతిరేకత క్షీణపథం పట్టింది. ఈ ధోరణిని మరింతగా ప్రోత్సహించాలి.

16. (ఎ) చివరిగా మనం గుర్తించాల్సిన అంశం – మతతత్వంపై సాగించే యుద్ధం రణభూమిలో పొజిషన్ తీసుకోవడం వంటిది. (ఎ) భిన్న క్షేత్రాల్లో బహుముఖ పోరాటం సాగించాలి. (బి) విజయం సాధించేవరకూ నిరంతరం ముందంజగా అది ఉండదు. ఒక క్షేత్రంలోనో లేదా మరో క్షేత్రంలోనో ఎదురుదెబ్బ తినాల్సి రావచ్చు. ప్రతి ఎదురుదెబ్బనూ శాశ్వత పరాజయంగా భావించడం తప్పు అవుతుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ గుండె చెదరకూడదు. వందేళ్లకు పైబడి మతతత్వవాదులు పెంచి పోషిస్తూ వచ్చిన భావజాలం, ఆడా మగా తేడా అందరి మనస్సులలో వేరూనుకుపోయిన భావజాలం స్వల్పకాలంలో విచ్ఛిన్నం కాదు. మటుమాయమైపోదు.

(బి) వేగంగా మారుతున్న ప్రపంచంలో మతోన్మాదులు తమ ప్రాతిపదికలతో పాటు, ఎత్తుగడలను కూడా మార్చుకుంటారు. అలాంటి మార్పులను మనం నిరంతరం విశ్లేషిస్తుండాలి. తగిన సమాధానాలు ఇస్తుండాలి.

17. హోలీ, దీపావళి, ఓనం, క్రిస్మస్ వంటి పండుగల సంబరాలను అందరూ కలిసికట్టుగా చేసుకోవడాన్ని ప్రోత్సహించాలి. స్వాతంత్ర్య సమరంలో, దేశవిభజన రోజుల్లో, స్వాతంత్ర్య అనంతర కాలంలో మత సామరస్యానికి గణేష్‌శంకర్ విద్యార్థి, మహబీర్ త్యాగివంటి స్థానిక నేతలు ప్రదర్శించిన వీరోచిత కృత్యాలను మనం వెలుగులోకి తీసుకురావాలి. ❋

# కమ్యూనిస్టు వ్యతిరేకతకు బలైన రోజన్‌బర్గులు

**వర్ధని**

**కరెంటు కుర్చీ వున్న గదిలో ప్రవేశించినా ఎథెల్‌లో గాంభీర్యం తగ్గలేదు. అక్కడున్న వారందరి కళ్ళలోకి ఆమె చూసింది. కొందరు ఆ దృశ్యం చూడలేక కళ్లు మూసుకున్నారు. గంభీరంగా వున్న ఆమెలో అందరికీ ఓ వీరవనిత కనిపించింది. అప్పటికే తన భర్త జూలియస్‌ను హైవోల్టేజీ కరెంటుతో చంపినట్లు జైలు అధికారులు అమెకు చెప్పారు. పిల్లల కోసమైనా మనసు మార్చుకుని కమ్యూనిస్టు రష్యా కోసం తాను పనిచేశానని ఒప్పుకుంటే ఇప్పుడైనా విడిచిపెడతామని చెప్పారు. "నేను చెప్పేదేమీ లేదు. శిక్షకు సిద్ధంగా వున్నా" అని చెప్పింది. ఏథెల్‌కూ అధికారులు కరెంటు షాక్‌తో మరణ శిక్ష అమలు జరిపారు. అమెరికన్ ప్రభుత్వం రోజన్ బర్గ్ దంపతుల ప్రాణాలు తీయగలిగింది. అమెరికా కమ్యూనిస్టు వ్యతిరేకతను, ప్రజాస్వామ్య డొల్లతనాన్ని, న్యాయవ్యవస్థ దుర్మార్గాన్ని, నాజీలకు తీసిపోని నిరంకుశ విధానాలను ప్రపంచం మొత్తం తెలుసుకుంది.**

'రోజన్ బర్గ్‌లు' ఇది కథ కాదు. నవల కాదు. యదార్ధగాథ. 1972లో 'ది ఇంప్లోజన్ కాన్‌స్పిరసీ' అనే 540 పేజీల గ్రంథాన్ని అమెరికన్ న్యాయవాది రాశారు. ఆయన కమ్యూనిస్టు వ్యతిరేకి అయినా రోజన్‌బర్గ్‌లు చనిపోయిన 20 సంవత్సరాల తరువాత ఆనాటి చారిత్రక ఘటనలనూ, అందోళనలనూ, రచనలనూ పరిశీలించి ఈ పుస్తకాన్ని రూపొందించారు. అందులోని అంశాలపై "రావు" పేరుతో మోటూరు హనుమంతరావుగారు రాసిన తెలుగు అనువాదం ప్రజాశక్తిలో సీరియల్‌గా వచ్చింది. ఆ విధంగా 'రోజన్ బర్గ్‌లు'గా పుస్తకం రూపుదాల్చింది. ప్రపంచంలో సామ్రాజ్యవాదదేశాలు కరుడుకట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకతతో ఎలావుంటాయో ఆనాటి రోజన్‌బర్గ్‌ల జీవితం ద్వారా మనకు ఈ పుస్తకంలో ఆవిష్కృతమవుతుంది.

కష్టజీవుల కుటుంబాల్లో పుట్టినవారు రోజన్ బర్గ్‌లు. జూలియస్ రోజన్‌బర్గ్ కుటుంబం – 1902లో జారిస్టు రష్యా నుండి వచ్చి న్యూయార్క్ పట్టణంలో నివసించేవారు. తండ్రి మిఠాయిషాపులో పనిచేసేవాడు. అయిదుగురు సంతానంలో జూలియస్ ఆఖరివాడు. యూదు కుటుంబీకులు కావడం వల్ల హిబ్రూ భాషను అభ్యసించాడు. పబ్లిక్ హైస్కూల్‌లో చదివి తర్వాత సూవార్ట్ పార్క్ హైస్కూల్‌లో చేరాడు. అతని బాల్యదశ నుండి యుక్తవయస్సు వచ్చే కొలదీ అమెరికాలోనూ, ప్రపంచంలోనూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 1929–33 మధ్య ఒక్క రష్యా మినహా అమెరికాతో సహా ప్రపంచమంతా సంక్షోభం ఆవహించింది. అనేక ఆందోళనలు సమ్మెలూ జరుగుతున్న రోజులవి. జూలియస్ తండ్రి షాప్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా సమ్మెకు నాయకత్వం వహించారు. ఉన్న ఉద్యోగం పోయి కుటుంబం ఇబ్బందుల పాలైంది.

అప్పటికే ప్రపంచంలో ఫాసిజం తలెత్తింది. ముస్సోలినీ అబిసీనియాపై దండయాత్ర, హిట్లర్ రీచ్‌స్టాగ్ భవనం తగలబెట్టి కమ్యూనిస్టులపై కేసు పెట్టాడు. యూదుల్ని వేటాడి ఊచకోత కోస్తున్నాడు. ఈ పరిణామాల ప్రభావం జూలియస్‌పై కూడా పడింది. అక్రమ కేసుల్లో ఇరికించి 16 సంవత్సరాలుగా జైలులో వుంచిన కార్మిక నాయకుడు టాంముసాని విడుదల చేయాలని జరుగుతున్న ఆందోళనలో పాల్గొన్నాడు. సంతకాల సేకరణ చేశాడు. 1934 తరువాత విద్యార్థి సంఘానికి వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. కాలేజీలో ముస్సోలినిని పొగుడుతున్న వారికి వ్యతిరేకంగా నినాదాలు చేయటంతో కాలేజీ నుండి బహిష్కరించారు. సమ్మెలు ఎక్కడ జరిగినా వాలంటీర్‌గా ప్రత్యక్షమయ్యేవాడు. జనరల్ మోటార్స్, స్టాండర్డ్, రాక్‌ఫిల్లర్స్, పోర్టులు దేశాన్నెలా దోచుకుంటున్నాయో ఉపన్యాసాలు ఇవ్వడం వరకూ ఎదిగాడు.

ఎథెల్ కూడా పేద కుటుంబం నుండే వచ్చింది. పబ్లిక్ స్కూల్లో చదివింది. పాటలు బాగా పాడేది. సంగీతం మీద మక్కువతో స్కూల్ చదువయ్యాక స్టెనోగ్రాఫర్‌గా ఎన్ఎన్ఎస్ఎపిలో పనిచేసేది. వారానికి ఏడు డాలర్ల సంపాదనలో రెండు డాలర్లతో సంగీతం నేర్చుకుని మిగిలినవి తల్లికిచ్చేది. ఎమెచ్యూర్ డ్రామాట్రూప్‌లో చేరి నాటిక పోటీల్లో బహుమతి పొందింది. 1932లో తనతో సహా ఉద్యోగానికి వచ్చిన దరఖాస్తుదారులపై ప్రభుత్వం చేసిన అన్యాయమైన దాడి అమెలో క్రోధాగ్నిని రగిలించింది. 1935లో ఆ కంపెనీలో సమ్మె చేశారు. కంపెనీ యాజమాన్యం బైట నుండి కూలీలను తీసుకురావటానికి ప్రయత్నిస్తే వీరోచితంగా రెండు సార్లు అడ్డుకున్నారు. ట్రక్కుల్లో నుండి బేళ్లుదించడానికి ప్రయతిస్తే తాళ్లు కోసి బేళ్లను కంపెనీ బైట చెల్లాచెదురు చేశారు. సమ్మెకు సానుభూతిగా 15 వేల మంది కుట్టుపని వారు సమ్మె చేయడంతో విధిలేక మేనేజ్‌మెంట్ తలొగ్గి పనిభారం తగించి జీతాలు పెంచడానికి అంగీకరించింది. సమ్మె జయప్రదమైంది కానీ కక్షతో మేనేజ్‌మెంట్ ఏథెల్‌ను తొలగించింది. పై రెండు సంఘటనలు జూలియస్, ఏథెన్‌ల పోరాటపటిమను, వారి నాయకత్వం స్థాయిని తెలియజేస్తున్నాయి.

**పాట వారిని కలిపింది**

అంతర్జాతీయ సీమన్ యూనియన్ తమ ఫంక్షన్‌లో పాటలు పాడమని ఏథెల్‌ను ఆహ్వానించారు. పాట పాడటానికి ఆమె తడబాటును గమనించిన జూలియస్ పక్కగదిలో రిహార్సిల్ చేయమని సలహాఇచ్చాడు. ఈ సంఘటన వారిద్దరి మధ్య అనురాగం కలిగించింది. జూలియస్ ఇంజనీరింగ్ చదవడానికి ఆర్థికంగా సహకరిస్తానని చెప్పింది. ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే వారిరువురూ పెళ్లి చేసుకున్నారు. న్యూయార్క్‌లోని సైనిక సప్లయి ఆఫీసులో

**"రోజన్ బర్గ్‌లను ఖూనీ చేయొద్దని 1951 ఆగస్టులో ప్రారంభమై 1953 జూన్ 17, 18, 19 తేదీల వరకు తారాస్థాయిలో ఆందోళనలు జరిగాయి. అమెరికాలోనూ, వెలుపలా ఉద్యమం సాగింది. కమ్యూనిస్టులు, కన్సర్వేటర్లూ, సోషలిస్టులు, కేథలిక్‌లూ, యూదులూ అందరూ రోజన్‌బర్గ్‌ల మరణశిక్షణను ఖండించారు. జీన్‌పాల్ సార్త్రే, ఐన్‌స్టీన్, పాబ్లోపికాసో, పాల్‌రాబర్ట్‌సన్‌లాంటి ప్రముఖులు కూడా తీవ్రంగా వ్యతిరేకించారు."**

జూలియస్ ఇంజనీరుగా చేరాడు. ఇద్దరూ జంటగా పార్టీ కార్యకలాపాల్లో కలిసి పనిచేసే అవకాశం రావంతో డెయిలీ వర్కర్‌కి చందా దారులను చేర్పిస్తూ, సాహిత్యాన్ని అమ్మేవారు. జూలియస్ కమ్యూనిస్టు అనే కారణంతో ప్రభుత్వం వారిని ఉద్యోగం నుండి తొలగించింది. ఆ తర్వాత కొంతకాలానికి ఏథెల్ చిన్న తమ్ముడు డేవిడ్ గ్రీన్ గ్లాస్‌తో కలిసి వ్యాపారం పెట్టారు.

**అసత్యాలు - అబద్ధాలు -**
**తప్పుడు కేసులు- అమెరికా నైజం**

అమెరికా ప్రభుత్వం తన కమ్యూనిస్టు వ్యతిరేకతను రోజన్‌బర్గ్ దంపతులపై తప్పుడు కేసులు పెట్టి మరోసారి నిరూపించుకుంది. 1950 – జులై 16న ఎఫ్‌బిఐ ఈ దంపతులను అరెస్టు చేసింది. అందుకోసం ఏకంగా ఏథెల్ చిన్న తమ్ముడు డేవిడ్‌ను అతని మరదలను ఎంచుకొంది. డేవిడ్ సైనిక శాఖలో మెషినిస్టుగా పనిచేస్తున్నాడు. ఈ దంపతుల ద్వారా అమెరికా అణురహస్యాలను రహస్యంగా సేకరించి, వాటిని ఒకచిన్న మైక్రోఫిలింలో భద్రపరచి రష్యాకు చేరవేస్తున్నారన్నది ఆరోపణ. డేవిడ్ గ్రీన్‌గ్రాస్ దంపతులను అప్రూవర్లుగా మార్చి రష్యా వద్ద అణ్వాయుధం ఉంటే అది ప్రపంచశాంతికి నిలబడుతుందనీ, అందుకు సమాచారం అందిస్తే దాన్ని తాము రష్యాకు చేరవేస్తామని చెప్పారంటూ కట్టుకథలు అల్లించారు. అందుకు హరి గోల్డ్ అనే వ్యక్తిని వాడుకున్నారు. రష్యా కార్యాలయానికి డేవిడ్ ద్వారా సమాచారం పంపించేవారని ఆరోపణ. చివరికి నావికాశాఖలోని ఇంజనీరు ఎలిచల్ ద్వారా సమాచారం సేకరించారని పచ్చి అబద్ధాలను ఆడించింది. రష్యాకు పారిపోవడానికి పాస్‌పోర్టు ఫొటోల కోసం వచ్చారని ఫోటోగ్రాఫర్‌తో అబద్ధపు సాక్ష్యాన్ని పుట్టించింది.

**ఎమాన్యుయేల్ బ్లాక్ (మెనిబ్లాక్)**
**పోరాట యోధుడు**

మెనిబ్లాక్ అతని తండ్రి అలెగ్జాండర్ ఇద్దరూ రోజన్‌బర్గ్‌ల తరపున వకాల్తా పుచ్చుకున్నారు. మెనిబ్లాక్ అమెరికా ప్రభుత్వం, న్యాయవ్యవస్థలో వున్న అబద్ధాలను, తప్పుడు విధానాలను ఎండగట్టాడు. సాక్షుల నిజస్వరూపాలను బైటపెట్టాడు. సుమారు మూడు సంవత్సరాల పాటు అహోరాత్రులు శ్రమించాడు రోజన్‌బర్గ్ దంపతులు సామాన్యజీవితం గడిపారనీ, నెలకు 45 డాలర్ల జీతంతో సెకండ్ హ్యాండ్ పర్నీచర్‌తో జీవించారనీ వాదించాడు. 11 సంవత్సరాలలో జూలియస్ 5 సూట్లు మాత్రమే కొనుక్కున్నాడన్నారు. ఏథెల్‌తో పెళ్లి కాక మునుపు 30 డాలర్లకు టైపు మిషన్ కొన్నదనీ, తమ ఇంట్లో ఆమెకు అనారోగ్యం వచ్చినప్పుడు మాత్రమే పనిమనిషిని పెట్టుకున్నారన్నారు. జూలియస్ అప్పుచేసి ఒక యంత్రం కొన్నాడనీ ఇంత దీన స్థితిలో వున్న వారు గ్రీన్ గ్లాస్‌కు డబ్బులిచ్చి పారిపోమ్మనడం అంతా ఒక కట్టుకథని తేల్చాడు...... రోజన్ బర్గ్‌లు స్వార్థం కోసం ఏజెంట్లుగా పనిచేస్తే వారి జీవిత విధానంలో అది ప్రతిబింబించాలని చెప్పాడు. రోజన్‌బర్గ్‌లు నేరస్థులా? కాదా? అనే ప్రశ్న తప్ప వారు కమ్యూనిస్టులా? కాదా? అన్నది ప్రధానం కాదనీ, కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదంలోకి మనం దిగజారకూడదని వాదించాడు.

**అమెరికా కమ్యూనిజంను**
**బూచిగా ఎలా చూపింది?**

రెండవ ప్రపంచయుద్ధాన్ని ప్రారంభించి ప్రపంచాన్ని మారణహోమంగా మార్చిన హిట్లర్, ముస్సోలినీ, టోజోల ఫాసిస్టు దురాక్రమణపై పోరాడటానికి ఆనాటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ స్టాలిన్‌తో చేతులు కలిపాడు. ఫాసిజాన్ని ప్రధానంగా దెబ్బతీసింది రష్యా. ఎక్కడికక్కడ కమ్యూనిస్టులు ఫాసిజాన్ని తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ ప్రభావంతో చైనా విముక్తికి పోరాటం చేసింది. మంగోలియా కొరియా, వియత్నాం సోషలిస్టు శిబిరంలో చేరడంతో 3వ వంతు ప్రపంచం సోషలిస్టు శిబిరంగా మారుతోంది. ఇది నచ్చని అమెరికా ఫాసిజం తమవల్లే ఓడిందని చెప్పుకోవటానికి జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబులు ప్రయోగించింది. ఈ దశలోనే అమెరికాలో కమ్యూనిస్టు ఉన్మాదం తారాస్థాయికి చేరింది. తనదేశంలో ప్రమాదం లేకపోయినా కమ్యూనిస్టు సభ్యులు నేరస్తులవలె ప్రభుత్వం రిజిస్టరులో సంతకం చేయాలని చట్టం చేసింది. ఫారెస్టల్ అనే మిలటరీ కమాండర్ కమ్యూనిజం భూతం వస్తోందన్న భయంతో నిద్రలో మేడ నుండి దూకి చనిపోయాడు. వాతావరణాన్ని ఆదశకు రెచ్చకొట్టడానికి చేసిన ప్రయత్నమే రోజన్‌బర్గ్‌లపై పెట్టినకేసు.

జడ్జి కాఫ్‌మెన్‌కు గానీ, జూరీలకు గాని రోజన్‌బర్గ్‌ల నిర్దోషిత్వం పట్టలేదు. సందు దొరికితే కమ్యూనిజం వాసన గల వాళ్లను ఎలా శిక్షిద్దామా అనే ఆలోచనలో వున్నారు. వీరు చేరవేసిన రహస్యాలవల్లే రష్యా అణ్వాయుధాలు సేకరించుకుందనే భ్రమలో వున్నారు. అందుకనే ఎలాంటి వారైన ఆధారాలు చూపకుండానే 1951 ఏప్రిల్ 5న రోజన్ బర్గ్ దంపతులకు మరణశిక్ష విధించారు. మెనిబ్లాక్ ఎంతగా వాదించినా స్టే ఆర్డర్‌లు తెచ్చినా, అప్పీళ్లకు వెళ్లినా, మెర్సీ పిటీషన్లు వేసినా న్యాయస్థానం కనికరించలేదు. అమెరికా అధ్యక్షుడు "ఐసెన్ హోవర్" అన్ని పిటీషన్లను తోసిపుచ్చాడు.

**కడసారిగా పిల్లలని ఆ జైల్లోనే...**

సంవత్సరం జైల్లో వున్న తర్వాత పిల్లలను చూడటానికి ఏర్పాటు చేశారు. మైకేల్‌కి పది సంవత్సరాలు, రోబీకి ఆరేళ్ళు. అమ్మానాన్నలను ఉరితీస్తారన్న వార్తలు వాళ్ల చెవులను తాకాయి. పిల్లలని తీసుకుని లాయర్ జైల్లోకి వెళ్లిన తరువాత రెండు గంటల సమయం రెండు నిమిషాల్లోనే గడిచిపోయాయి. వెళ్లవల్సిన సమయం అయిపోవడంతో బలవంతంగా వారిని విడదీసి గేటువైపు సాగనంపారు. హఠాత్తుగా ఆమె చేతుల్నుంచి విడిపించుకుని, మైకేల్ కోపంతో అరిచాడు. 'ఇక నేను మిమ్మల్ని చూడలేను. వాళ్లు మిమ్మల్ని చంపివేస్తారు. నేను వూరుకోను! వాళ్లనే ముందు చంపుతాను! హంతకుల వాళ్లు! 'మా అమ్మానాన్నను నేను చంపనివ్వను!' అని అమ్మను కౌగిలించుకున్నాడు. జూలియస్ కొయ్యబారిపోయాడు. కన్నీరు చెక్కిళ్లు పై నుండి వరదలై పారుతుండగా, ఆ బేడీలున్న చేతుల్ని పైకెత్తాడు. అదే ఆ కుటుంబ కడసారి చూపు.

**ప్రపంచవ్యాపిత ఆందోళనలు**

రోజన్ బర్గ్‌లను ఖూనీ చేయొద్దని 1951 ఆగస్టులో ప్రారంభమై 1953 జూన్ 17, 18, 19 తేదీల వరకు తారాస్థాయిలో ఆందోళనలు జరిగాయి. అమెరికాలోనూ, వెలుపలా ఉద్యమం సాగింది. కమ్యూనిస్టులు, కన్సర్వేటర్లూ,

(మిగతా 35వ పేజీలో)

# ఖమ్మం సభ

(2వ పేజీ తరువాయి)

మహాసభ తెలంగాణా పోరాట చరిత్రను నూతన మార్గంలోకి మళ్ళించింది. ఆంధ్ర మహాసభ మొదట సాంఘిక, ఆర్థిక కోర్కెల పరిష్కారానికి, ఇక నుండి రాజకీయ ప్రజాసంస్థగా రూపొం దింది. ఈ మహాసభ కాలంలో దేశమంతటా స్వాతంత్ర్య ఉద్యమం ఉధృతంగా కొనసాగు తోంది. జనగామ, సూర్యాపేట మొదలగు తాలూకాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రారంభమైనవి. ఈ మహాసభ ప్రభావం ఖమ్మం, వరంగల్ జిల్లాలపై బాగా పడింది. ఖమ్మం విద్యార్థి ఉద్యమం అఖిల హైద్రాబాద్ స్టూడెంట్ యూనియన్ నాయకత్వాన ప్రధాన కార్యదర్శి ఓంకార్ ప్రసాద్, సహాయ కార్యదర్శి రఫీ అహ్మద్‌ల పిలుపుపై ఉస్మానియా యూని వర్శిటీలో ప్రారంభమైన వందేమాతరం నైజాం సంస్థానం అంతటా వ్యాపించింది. ఖమ్మం శాఖ తరఫున కూడా హైస్కూల్ సమస్యలపైనా, వందేమాతర గీతంపైనా ఆందోళనలు, సమ్మెలు జరిగాయి. ఈ విద్యార్థి యూనియన్ కార్యకర్తలు, పట్టణ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. గంగవరపు శ్రీనివాసరావు, దామినేని వెంక టేశ్వర రావు, దొండేటి వాసు, కొల్లు రాఘవయ్య, వంకాయలపాటి నాగయ్య, పుసులూరు పురుషోత్తం మొదలగువారు ఉన్నారు.

కార్మిక సంఘాలు ఖమ్మం గ్రైన్ మార్కెటు హమాలీ, బండ్ల కార్మికుల యూనియను చాలా బలమైన సంఘం, గుమస్తాల సంఘం, ఆర్.టి.డి. (రోడ్‌శాఖ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్) మొదలగునవి మహిళా సంఘం కూడా బలమైన సంఘం. రేషన్ దుకాణాల పోరాటాల్లో ఈ సంఘం కీలకపాత్ర వహించింది. మార్కెటులో కూడా ఇది బలంగానే పనిచేసింది.

**కొన్ని విజయాలు**

1. ఇది నిజాం నిరంకుశత్వాన్ని అంతం చేయటానికి జరిగిన సాయుధ పోరాటం. స్వతంత్ర సంస్థానంగా పాలన జరపటానికి నిజాం జరిపిన కుట్రను ఈ పోరాటం భగ్నం చేసినది.

2. కాలదోషం పట్టిన ఫ్యూడల్ వ్యవస్థను అంతం చేయటానికి జరిగిన విప్లవ రైతాంగ పోరాటం. వెట్టిచాకిరీ, చట్ట విరుద్ధ పనులు, ఫ్యూడల్ ప్రభువుల అనేక దోపిడీ పద్ధతులను అంతం చేసింది. రైతు, కూలీల్లో మంచి చైతన్యం తెచ్చి కండ్లు తెరిపించినది. మొదట్లో భూస్వాముల భూములు ముట్టుకోవటమే నేరం. భూస్వాములను బయటకు గెంటి భూములను స్వాధీనం చేసుకొనే చైతన్యం, ధైర్యం వచ్చినది. ఈ పోరాటం తర్వాతనే అనేక రాష్ట్రాల్లో, ఈ రాష్ట్రంలో జమీందారీ రద్దు చట్టాలు, కౌల్దారీ చట్టాలు, భూపరిమితి సీలింగ్ తదితర చట్టాలు వచ్చాయి. మెరుగైన హైదరాబాద్ కౌల్దారీ చట్టం సెక్షన్ 38ఇ, 37ఎ ప్రకారం కౌలు రైతులకు పట్టా హక్కులు, శాశ్వత హక్కులు లభించాయి.

3. భూ సమస్యను స్వాతంత్ర్య భారతదేశ ఎజెండాలోకి తెచ్చిన ఘనత తెలంగాణా సాయుధ పోరాటానిదే.

4. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటం తర్వాత జరిగిన తెలంగాణా సాయుధ పోరా టమే ద్వితీయ స్థానం పొందుతుంది.

5. ఈ పోరాటానికి అంతర్జాతీయ ప్రాముఖ్యత వచ్చినది. నల్గొండ జిల్లాకు సంబంధించిన మురహరిరావు మొదలగు 12 మంది కామ్రేడ్స్‌పై అబద్ధాల హత్య కేసులో భువనగిరి స్పెషల్ కోర్టు ఉరిశిక్ష విధిస్తే హైకోర్టు అప్పీలులో కూడా ఉరిశిక్ష ఖాయమైతే ప్రభుత్వం ఉరితీయడానికి సన్నాహాలు చేస్తుంటే సుప్రీమ్ కోర్టులో అప్పీలు దాఖలైనది. దేశ, విదేశాల నుండి ఆందోళన. వారు దేశభక్తులు, ఉరిశిక్ష అమలుచేయరాదు. శిక్షలను రద్దు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి. దేశంలోని అభ్యు దయ కాముకులు, ప్రజా సంఘాలు, అంతర్జా తీయ కమ్యూనిస్టు పార్టీలు, పత్రికలు ప్రభుత్వాన్ని హెచ్చరించినవి. ఢిల్లీలోని ప్రముఖ సుప్రీమ్ కోర్టు బారిష్టరు ఎ.ఎస్.ఆర్. చారి మొదలగు వారు అప్పీలు దాఖలు చేశారు. లండన్ ప్రివ్యూ కౌన్సిల్ ప్రముఖ బారిష్టర్ డి.ఎన్.ప్రిట్ కేసు వాదించడానికి ఢిల్లీ సుప్రీమ్ కోర్టుకు వచ్చాడు. ఈ బూటకపు, నిరాధార కేసులో ఉరిశిక్షను ఖాయం చేస్తే భారత న్యాయ శాస్త్రాన్ని, న్యాయ మూర్తులను శంకించాల్సి వస్తుంది. ప్రివ్యూ కౌన్సిల్‌కు కూడా ఈ కేసును తీసుకుపోతానని వాదించి హెచ్చరించాడు. అత్యున్నత న్యాయస్థానం అప్పీలును ఆమోదిస్తూ ఈ హత్య కేసు కొట్టివేసినది. ముద్దాయిలందరినీ విడుదల చేశారు. అంతర్జాతీయ ప్రాముఖ్యత ఈ హత్య కేసు రద్దు వీర తెలంగాణా పోరాటా నికి, ఆ పోరాట యోధుల త్యాగాలకు విజయం.

6. ఈ సాయుధ పోరాటంలో తెలంగాణా లో 30 లక్షల ప్రజలు నివశిస్తున్న 4 వేల గ్రామాలు నిజాం నిరంకుశ పాలననుండి విముక్తి అయినవి. 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపకం జరిగినది. 4,500 మంది పోరాట యోధులు వీర మరణం చెందారు. ఆంధ్రలో కూడా 300 మంది కామ్రేడ్స్ పోరాటంలో చనిపోయారు. ఈ పోరాటం కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను పెంచినది. నిజాం రాజరికపు నిరంకుశ పాలనను తుదముట్టించి హైద్రాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర భారతంలో విలీనం చేయటం, దొరలు, దేశముఖ్‌లు, దేశపాండేలు, జమీందార్లు, జాగీర్దార్లు, పటేల్, పట్వారీల దోపిడీ, దౌర్జన్యాల నుండి పీడిత ప్రజలను విముక్తి చేయటం, వెట్టిచాకిరీ అంతంచేసి అంటరాని తనాన్ని, అసమానత్వాలను నిర్మూలించి దున్నే వానికే భూమి కల్పించటం, సాంఘిక, సాంస్కృ తిక, సాహిత్య రంగాలలో అభివృద్ధి సాధించటం సమసమాజాన్ని నిర్మించటం తదితర లక్ష్యాలు. ఈ సాయుధ పోరాటంలో వేలాదిమంది పాల్గొ న్నారు.వందలాది మంది వీరమరణం చెందారు.

**(ఖమ్మంజిల్లా అమరవీరులు పుస్తకం నుండి ఈ వ్యాసాన్ని పునర్ముద్రించడం జరిగింది)**

# కమ్యూనిస్టు వ్యతిరేకతకు బలైన రోజన్‌బర్గులు

(34వ పేజీ తరువాయి)

సోషలిస్టులు, కేథలిక్‌లూ, యూదులూ అందరూ రోజన్‌బర్గ్‌ల మరణశిక్షణను ఖండించారు. జాన్‌పాల్ సార్త్రే, ఐన్‌స్టీన్, పాబ్లోపికాసో, పాల్‌రాబర్ట్‌సన్ లాంటి ప్రముఖులు కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. 37 మంది ప్రముఖు లతో రోజన్ బర్గ్‌ల రక్షణ కమిటీ ఏర్పడింది. దాదాపు 40 పెద్ద నగరాల్లో ఈ కమిటీలు ఏర్పడ్డాయి. ఫ్రాన్స్, రోమ్ నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. జనరల్ కాన్ఫెడేషన్ ఆఫ్ లేబర్ పిలుపునందుకుని 15 నిమిషాలు దేశవ్యాపి తంగా పరిశ్రమలు, రవాణా, కార్యాల యాలన్నీ బంద్ అయ్యాయి. లండన్‌లోని "డెయిలీ వర్కర్" ఫ్రంట్ పేజీ అంతా "మర్డర్" అన్న 5 అంగుళాల నిలువు అక్షరాలతో నింపింది. సోషలిస్టు దేశాలన్నీ రోజన్‌బర్గ్ దంపతులను విడుదలచేస్తే తమ దేశ పౌరసత్వం ఇవ్వడానికి సిద్ధం అని తెలిపాయి. ఇదంతా ప్రజాందోళనకు పరాకాష్ట. అమెరికా పాలకుల పరమ మూర్ఖత్వానికి మచ్చుతునక. ఇవేవీ అమెరికా పాలకులను కరిగించలేదు. వారి పచ్చికమ్యూనిస్టు వ్యతిరేకత, న్యాయవ్యవస్థ దివాళాకోరుతనం కలగలసి రోజన్‌బర్గ్ దంపతు లను మృత్యుకుహరం వైపు నడిపించాయి. మృత్యుకుహరంలో వున్నా "ఫాసిజాన్ని ప్రతిఘటించడమే మార్గం అని ప్రజలకు చెప్పాలి" అన్నా జూలియస్ చెప్పాడు. రోజన్ బర్గ్‌ల ప్రాణ త్యాగం అమెరికాలో తిరుగుబాటు తేలేక పోయింది. ఆ మరణ శిక్షల మీద ఆనాడు జరిగిన ఆందోళన, కలిగిన కలవరం, చర్చలు తర్వాత అమెరికన్ శిక్షాస్మృతి నుంచి మరణ శిక్షణను రద్దుచేయడానికి దోహదపడింది.

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-11-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# ద్రవ్య పెట్టుబడి టెర్రరిస్టు నియంతృత్వమే ఫాసిజం



### జార్జి డిమిట్రావ్

అధికారంలో ఉన్న ఫాసిజం అత్యంత దురభిమానంతో కూడిన, అత్యంత ప్రతీఘాతుక సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడి యొక్క బహిరంగ టెర్రరిస్టు నియంతృత్వం అన్న వాస్తవాన్ని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పదమూడవ ప్లీనం ఎగ్జిక్యూటివ్ కమిటి సరిగానే చెప్పింది. అత్యంత ప్రతీఘాతుక తరహాకు చెందినది జర్మన్ ఫాసిజం. సోషలిజంతో దానికేమీ సంబంధం లేనప్పటికీ తనకు తాను జాతీయ సోషలిజానికి చెందిన దాననని చెప్పకొంటుంది. బూర్జువా జాతీయవాదం మాత్రమే కాక అత్యంత క్రూరమైన దురభిమానంతో కూడినది జర్మన్ ఫాసిజం. అది రాజకీయ గూండాయిజంతో కూడిన ప్రభుత్వ విధానం. కార్మికవర్గం, రైతాంగం, పెటీబూర్జువాలు, మేధావులలోని విప్లవకర శక్తులను రెచ్చగొట్టి, వారిని క్రూరంగా హింసిస్తుంది. మధ్య యుగాలకు చెందిన ఆటవికత, క్రూరజంతు స్వభావంతో ఇతర దేశాలపై అవధులు లేని దురాక్రమణకు పూనుకుంటుంది.

జర్మన్ ఫాసిజం అంతర్జాతీయ ప్రతీఘాతుక విప్లవంలో అగ్రనాయక పాత్రను నిర్వహిస్తున్నది. సామ్రాజ్యవాద యుద్ధాన్ని రెచ్చగొట్టే సాధనంగా, ప్రపంచ కార్మికవర్గానికి గొప్ప పితృభూమి అయిన సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా దండయాత్రలకు ప్రోత్సహించటంలో ముందుపీఠిన ఉంటున్నది. ఓట్టో బాయర్ చెప్పినట్లుగా ఫాసిజం కార్మికవర్గం, పెట్టుబడిదారీ వర్గాలకు అతీతంగా ఉన్న ప్రభుత్వాధికారం కాదు. బ్రిటీష్ సోషలిస్టు బ్రెయిల్స్ ఫోర్డ్ చెప్పినట్లుగా పెటీ బూర్జువాలు తిరుగుబాటు చేసి రాజ్యాంగ యంత్రాన్ని స్వాధీనం చేసుకోవటం కాదు. ఫాసిజం వర్గాలకు అతీతంగా నిలబడిన శక్తికాదు. పెటీబూర్జువాల, అలగా జనాల ప్రభుత్వం కాదు. ఫాసిజం ద్రవ్యపెట్టుబడి యొక్క శక్తి. కార్మికవర్గం, రైతులు, పెటీబూర్జువాలలోని విప్లవకరశక్తులపై అత్యంత తీవ్రంగా ప్రతీకారం తీర్చుకొనే శక్తి ఫాసిజం. సంక్షోభం వలన తమ అవకాశాలను కోల్పోయిన వారిని రెచ్చగొడుతూ పెటీ బూర్జువాలలోని అనేకమందిని, చివరకు కార్మికవర్గంలోని వెనుకబడిన వారిని కూడా తన వైపుకు తిప్పుకుంటున్న పరిస్థితులలో ఫాసిజం యొక్క స్వభావాన్ని గురించి నొక్కి చెప్పాల్సి వస్తున్నది. దాని నిజరూపాన్ని అర్థం చేసుకుంటే ఫాసిజాన్ని వారెన్నటికీ బలపరచరు. చారిత్రక, సామాజిక, ఆర్థిక కారణాలు, జాతీయ ప్రత్యేకతలు, అంతర్జాతీయంగా ఆ దేశం స్థానం తదితరాల వలన ఫాసిజం, ఫాసిస్టు నియంతృత్వం వివిధ దేశాలలో భిన్నమైన రూపాలు ధరిస్తుంది. ఫాసిజానికి విస్తృతమైన ప్రజాపునాది లేని దేశాలలో, ఫాసిస్టు శిబిరంలోని వివిధ గ్రూపుల మధ్య పోరాటం కొనసాగుతున్న చోట ఫాసిజం తక్షణమే పార్లమెంటును రద్దుచేయటానికి పూనుకోదు. ఇతర బూర్జువా, సోషల్ డెమోక్రటిక్ పార్టీలు కూడా చట్టబద్ధంగా పనిచేయటానికి కొంత మేరకు అవకాశం ఇస్తుంది. పాలక బూర్జువా పార్టీలు విప్లవం త్వరగా వస్తుందని భయపడుతున్న దేశాలలో ప్రత్యర్థి పార్టీలు, గ్రూపులపై హింసాకాండను పెంపొందించటం ద్వారా ఫాసిజం తక్షణమే అవధులు లేని రాజకీయ ఆధిపత్యాన్ని నెలకొల్పుతుంది.

ఫాసిజం అధికారానికి రావటం ఒక పార్టీ స్థానంలో మరో పార్టీ సాధారణంగా అధికారంలోకి రావటం కాదు. బూర్జువాల రాజ్యాధికారంలో ఒక విధానం స్థానంలో మరో విధానం-పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో బహిరంగ టెర్రరిస్టు నియంతృత్వం-అధికారంలోకి రావటమే ఫాసిజం. ఈ తేడాని గుర్తించకపోవటం తీవ్రమైన తప్పిదం అవుతుంది. ఫాసిస్టులు రాజ్యాధికారం చేపట్టటాన్ని నిరోధించటం కోసం జరుగుతున్న పోరాటంలోకి పట్టణాలు, పల్లెలలో ఉన్న విస్తారమైన శ్రామిక ప్రజలను సమీకరించటాన్ని, బూర్జువా శిబిరంలో ఉన్న వైరుధ్యాలను విప్లవ శ్రామికవర్గం వినియోగించుకోవటాన్ని ఇది నిరోధిస్తుంది.

ఫాసిజం అధికారంలోకి రావటం ఒక్కరోజులోనో లేక ఫలానా రోజు ఫాసిస్టు నియంతృత్వం అధికారంలోకి రావాలని ద్రవ్య పెట్టుబడి నిర్ణయం చేయటం ద్వారానో సాఫీగా జరుగుతుందని భావించకూడదు. పాత బూర్జువా పార్టీలతో తీవ్రమైన పోరాటాలు, జర్మని, ఆస్ట్రియా, మరికొన్ని దేశాలలో జరిగిన విధంగా ఫాసిస్టు శిబిరంలోని వివిధశక్తులతో పోరాటాలు, కొన్ని సందర్భాలలో తీవ్రమైన సాయుధ ఘర్షణలు తదితరాల ద్వారానే వాస్తవంగా ఫాసిజం అధికారంలోకి వస్తుంది. దీనికి ముందుగా బూర్జువా ప్రభుత్వాలు అనేక ప్రాథమిక దశలగుండా ప్రయాణం చేస్తూ, అనేక ప్రతీఘాతుక చర్యలు తీసుకుంటాయి. ఫాసిజం అధికారంలోకి రావటాన్ని అవి సులభతరం చేస్తాయి. ఈ సన్నాహక దశలో ఫాసిజాన్ని పెంపొందించే బూర్జువాల ప్రతీఘాతుక విధానాలపై ఎవరైతే పోరాడరో వారు ఫాసిజం విజయాన్ని నిరోధించలేరు. ఫాసిజం సులభంగా విజయం సాధించటానికి అటువంటి వారు దోహదం చేస్తారు.

ప్రజలలో ఫాసిజం పలుకుబడి పెరగటానికి కారణమేమిటి? తక్షణ అవసరాలు, కోర్కెలపై రెచ్చగొడుతూ ఫాసిజం ప్రజలను ఆకర్షిస్తుంది. ప్రజలలో పాతుకుపోయిన ఆకాంక్షలను వినియోగించుకోవటమే కాకుండా, వారిలో ఉన్న సానుకూల అంశాలను, కొన్ని సమయాలలో వారిలో ఉన్న విప్లవ సాంప్రదాయాలను కూడా వినియోగించుకొంటుంది.

***(1935లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమావేశంలో జార్జి డిమిట్రోవ్ చేసిన ప్రసంగం నుండి ఈ అంశాలు గ్రహించబడ్డాయి.)***

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.7. Published on November 1, 2018